తెలుగు స్త్రీల చిత్రలిపి

(రామరాజు జానపద విజ్ఞాన బహుమతిని పొందిన పుస్తకం)

డా॥ రావి. ప్రేమలత.
తెలుగు ఉపన్యాసకురాలు
శ్రీ రామచంద్ర ఆర్ట్స్ & సైన్సు కళాశాల, హైదరాబాదు.

హైదరాబాదు
జూన్, 1991

Telugu Streela Chitralipi

Dr. Ravi. Premalata

First Edition, June, 1991.

747.4

For Copies :
Ravi Premalata,
2-2-1105/10, Tilaknagar,
Hyderabad - 500 044.

48472

Rs. 60

Cover Design.
Dr. Neeraj Raj.

C 12746

Printed at :
Laser Printers,
12th Street, Himayatnagar,
Hyderabad 500 029. Ph.69123

ఈ పుస్తకం

నా పరిశోధనారచనలకు

మాతృక, దేశిక

ఆచార్య నాయని కృష్ణకుమారి గార్కి

గౌరవాభిమానాలతో అంకితం

తొలిపలుకు

ఆచార్య రామరాజుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనాక్షేత్రంలో 35 సంవత్సరాల క్రిందట మొట్టమొదట నాటిన విత్తే మొలకెత్తి, వృక్షంగా మారి నేడు శాఖోపశాఖలుగా తెలుగు దేశమంతటా విస్తరించింది. జానపద విజ్ఞాన పరిశోధనా రంగంలో ద్వితీయులు, అద్వితీయులు ఐన నాయని కృష్ణకుమారి గార్కి తోటి ఆచార్యులపైన ఆదరాభిమానాలు అధికం. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసంకోర్చి రామరాజుగారు పదవీ విరమణ చేసిన సమయంలో వారి కృషికి గుర్తింపుగా, "ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్తు " పక్షాన 'రామరాజు జానపద విజ్ఞాన బహుమతి" ని ఏర్పాటు చేసినారు. ఈ బహుమతిని స్వీకరించిన పుస్తకాల్లో 'తెలుగు స్త్రీల చిత్రలిపి" రెండవది.

ఆచార్య రామరాజుగారి పరిశోధనా గ్రంథం, ఉపన్యాసాలు విద్యార్థులకు జానపద విజ్ఞానంపైన ఆసక్తిని కలిగించి, పరిశోధనలకు అవకాశాన్ని కల్గించాయి. జానపద విజ్ఞానంలో పరిశోధన చేసిన, చేస్తున్న విద్యార్థులందరికీ రామరాజుగారి తలంపే, గౌరవ భావాన్ని కల్గిస్తుంది. నాకు రామరాజుగారిపైన గల గౌరవాభిమానాలే వారి పేరుతో ఉన్న బహుమతిని స్వీకరించాలనే కోరికకు మూలకారణమైంది. ఆ కోరిక తీరడం నా జీవిత భాగ్యం.

ఆచార్య కృష్ణకుమారి గారు ఈ పుస్తక రచనకు ప్రోత్సాహాన్నిచ్చి, తగిన సలహాలనందచేసారు. వీరు ఇరవై సంవత్సరాలనుండి నాపై ఆప్యాయతను చూపెడుతూ, ఆర్ద్రతను వర్షిస్తున్నారు. పరిశోధనా రంగంలో అమ్మలా లాలిస్తూ, నా రచనలకు స్ఫూర్తినిస్తున్నారు. స్నేహితురాలిగా సలహాలిస్తూ, గురువులా శాసిస్తూ రచనా స్థాయిని

పెంచుతున్నారు. వీరు వర్ధిష్ణువులను వెన్నుతట్టి ముందుకు నడిపించే గుణ పక్షపాతులు. నా పరిశోధనా మార్గదర్శకులు, పరిశోధనా ప్రవణులైన డా॥ నాయని కృష్ణకుమారిగారికి ఈ చిన్న పుస్తకాన్ని గురుదక్షిణగా సమర్పించుకుంటున్నాను.

నేనెప్పుడూ పదిమాటలైన మాట్లాడుకున్నా నాపైన ఆదరాభిమానాలను చూపెట్టి, తమ నిశిత విమర్శనాదృష్టితో పరోక్షంగా నాకు ఆలోచించడం, రాయడం నేర్పిన గురువర్యులు చేకూరి రామారావుగారికి నానమస్కారాలు.

ఈ పుస్తకానికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన డా॥ కేతు విశ్వనాథ రెడ్డిగారికి, డా॥ పి. ఆవదరావుగారికి డా॥ బి. వెంకటేశ్వర్లుగారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలోని ముగ్గుల కన్నింటికీ ఓపిగ్గా రూపాన్నిచ్చి తీర్చిదిద్దిన చెల్లి హేమలతకూ, జీవిత లక్ష్య సాధనకు నిరంతరం కష్టపడాలి అని అమ్మనైన నాకే అమ్మలా బోధించి, రచనకు పురికొల్పిన ప్రణీతకూ నా ఆశీస్సులు.

ఐందరు పరిసర ప్రాంతాల్లోని ముగ్గుల సమాచారాన్ని సేకరించి ఇచ్చిన స్నేహమయి డా॥ శ్రీలక్ష్మికి నాధన్యవాదాలు.

ఈ పుస్తక ప్రచురణకు కొంత ఆర్థిక సహాయాన్ని అందచేసిన తెలుగు విశ్వవిద్యాలయం వారికి కృతజ్ఞతలు.

• • •

మలిపలుకు

భావ వ్యక్తీకరణ శక్తిని భాషలోని అక్షరాల కూర్పు సంతరించుకుంది. స్త్రీల మనోభావాలనూ, ఆచార సంప్రదాయాలనూ, నమ్మకాలనూ ముగ్గు చిత్రాలు అభివ్యక్తం కావిస్తాయి. లిపిలోని ప్రతి అక్షరానికీ సంకేతం, లక్షణం, లక్ష్యం ఉంటుంది. పరిశోధిస్తే ప్రతి ముగ్గు చిత్రం, ఒక సంకేతార్థాన్నీ, లక్ష్యలక్షణాలనూ పొందిందని ప్రస్ఫుటమవుతుంది. అందుకే ముగ్గులు స్త్రీల చిత్రలిపులు.

ఏదో ఒక ఉద్దేశాన్ని, అంతరార్థాన్ని ఆధారంగా చేసుకొని స్త్రీలు ముగ్గుకు రూప కల్పన కావిస్తారు. ప్రతి ముగ్గుకూ అంతరార్థం ఆదిలో ఉన్ననూ, కాలచక్రగమనంలో అనేక ముగ్గు చిత్రాల్లోని అంతరార్థాలు అంతర్ధానమైనాయి. వాటిని నేడు వివిధ దృక్కోణాలతో పరిశీలించి, పరిశోధించి అంతర్లీనంగా ఉన్న అర్థాన్ని అవగతం చేసుకుంటే స్త్రీ మనస్తత్వం, సామాజిక చరిత్ర కొంతవరకు అర్థమవుతాయి. సామాజిక మత వ్యవస్థలో పరిణమించిన పరిణామాలు తేటతెల్లమవుతాయి. ఈ పరిశీలనా ప్రయత్నం రేఖామాత్రంగా ఈ వ్యాసంలో జరిగింది.

అతి ప్రాచీన కాలం నుండీ సంప్రదాయకంగా స్త్రీలు రచిస్తున్న ముగ్గు చిత్రాల లక్ష్య, లక్షణాల గూర్చి, పుట్టు పూర్వోత్తరాలను గూర్చిన పలు అభిప్రాయాలు వివరణలు, ప్రథమ అధ్యాయంలో వివరించడం జరిగింది.

జానపద విజ్ఞానానికి సీమల్లేవు. ప్రపంచమంతా శాఖోపశాఖలుగా వ్యాపించిన జానపద వటవృక్షంలోని చిన్న శాఖయే తెలుగుజానపద విజ్ఞానం. తెలుగు దేశంలోని స్త్రీల చిత్రకళానైపుణ్యం ఆఫ్రికా,

ఆస్ట్రేలియా, అమెరికా, అరేబియా దేశాల్లోని స్త్రీల చిత్రకళా నైపుణ్యంతో పోలి ఉండవచ్చు. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించడమే జానపద విజ్ఞాన ప్రత్యేకత. ఏకత్వాన్ని దిఙ్మాత్రంగా సందర్శించడానికే ద్వితీయ అధ్యాయంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల ఆచార సంప్రదాయాల్లోని ముగ్గులను గూర్చి సంక్షిప్తంగా పేర్కొనడం జరిగింది.

తెలుగు స్త్రీ జానపద విజ్ఞాన స్వరూపిణి. సంప్రదాయ పరంగా ప్రాప్తిస్తున్న వీరి విజ్ఞానాంశాలు ప్రతి కళలోనూ ప్రతి ఫలిస్తుంటాయి. ముగ్గుల్లో కూడా నిక్షిప్తమైన కొన్ని విజ్ఞానాంశాలను మూడవ అధ్యాయంలో వివరించడం జరిగింది.

జానపదమహిళ ప్రతిముగ్గూ సందర్భాన్నీ, సంకేతాన్నీ సంతరించుకొని ఉంటుంది. మనదేశంలో పుట్టిగిట్టిన మతాలు కొన్ని, అతి ప్రాచీన కాలంనుండి నేటి వరకు సజీవంగా ఉన్నవి కొన్ని. వీటన్నింటి ప్రభావం పడతుల ముగ్గులపైన ప్రసరించాయి. అందుకే ఒక్కొక్క చిత్రంలోని సంకేతాన్ని వివిధ దృక్కోణాలననుసరించి, వివిధ అభిప్రాయాలననుసరించి నాలుగవ అధ్యాయంలో వివరించడం జరిగింది.

అక్షరలిపి, అక్షర జ్ఞానుల భావవ్యక్తీకరణ సాధనం. ముగ్గులు, అతివల సంప్రదాయ, విజ్ఞాన, చిత్రకళల, భావ వ్యక్తీకరణ సాధనాలు. ముగ్గు, స్త్రీల చిత్రలిపి అని వివరించడానికి జరిగిన ప్రయత్నా ఫలితమే ఈ వ్యాసరచన.

రావి.ప్రేమలత.

విషయ సూచిక

పేజీ సంఖ్య

1. ప్రవేశిక :	1-33
1. ముగ్గులు - ఉత్పత్తి వికాసాలు	3-15
2. లక్ష్యాలు, లక్షణాలు	16-17
3. ముగ్గుల చిత్రీకరణ విధానాలు	18-24
4. సాహిత్యంలో ముగ్గులు	25-33
2. వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాల్లోని ముగ్గులు	34-78
1. తెలుగు ప్రాంతంలోని ముగ్గులు	35-53
2. తమిళ ప్రాంతంలోని కోలం	53-60
3. కర్ణాటక ప్రాంతంలోని రంగోలి	60-63
4. కేరళ ప్రాంతంలోని కోలం	63-64
5. ఒరిస్సా ప్రాంతంలోని ఝుటి	64-65
6. బెంగాల్ ప్రాంతంలోని అల్పనలు	66-68
7. మహారాష్ట్ర ప్రాంతంలోని రంగోలి	68-69
8. మధ్య ప్రదేశ్ ప్రాంతంలోని ఎపన్	69-72
9. రాజస్థాన్ ప్రాంతంలోని మండనాలు	72-75
10. భారతీయ మహిళల ముగ్గుల్లోని సామ్యాలు	76-78

3. ముగ్గులు – వివిధ శాస్త్రాంశాలు : 79-107

1. ముగ్గులు - రేఖాగణిత శాస్త్రం 79-80
2. ముగ్గులు - గణిత శాస్త్రం 80-81
3. ముగ్గులు - అక్షరాలు 81-83
4. ముగ్గులు - రసాయన శాస్త్రంలోని నిర్మాణరూపాలు. 83-84
5. ముగ్గులు - చిత్ర కవిత్వంలోని చిత్రాలు 84-89
6. ముగ్గులు - వాస్తు శిల్పం 89-93
7. ముగ్గులు - యోగ విద్యాంశాలు 94-96
8. ముగ్గులు - వైద్య శాస్త్రం 96-101
9. ముగ్గులు - ఆటలు 101-107

4. స్త్రీల చిత్ర లిపి – సంకేతాలు : 108-154

5. తుది పలుకు 155

6. వివరణలు

7. ఉపయుక్త గ్రంథ సూచిక

ముగ్గులు – ప్రవేశిక

ముగ్గులు స్త్రీల కళానైపుణ్యానికి, కల్పనాశక్తికీ, చిహ్నాలు. కేవలం హస్తమాత్ర సహాయంతో ఊహాశక్తిననుసరించి చిత్ర విచిత్రాలైన రచనా విధానాలతో సంప్రదాయాలను ప్రదర్శించే స్త్రీల ముగ్గులు చిత్రకళాధిదేవతకు సహజ సౌందర్య శోభిత ఆభరణాలు.

చిత్రకళ చతుష్షష్టి కళల్లో ప్రధానమైంది.

"రూపభేదా ప్రమాణాని
భావ లావణ్య యోజనం
సాదృశ్యం వర్ణికాభంగ
ఇతిచిత్రం షడంగకం"–

అనే ఆరు అంగాలతో సంపూర్ణ స్థాయిలో చిత్రకళ రూపొందింది. సమస్త కళల్లో అంతర్భూతమైన చిత్రకళ అనేక కళలకు ఆధారభూతమైంది. చిత్రలేఖనంలో సంపూర్ణత్వాన్ని పొందడానికి చతుష్షష్టి కళల్లోని విశేషకచ్ఛేద్యం, తండుల కుసుమ బలివికారం, పుష్పాస్తరణం, దశనవాసాంగరాగం, మణిభూమికాకర్మ, మాల్యగ్రథన వికల్పాలు, నేపథ్య ప్రయోగాలు, కర్ణపత్ర భంగాలు, భూషణ యోజనాలు ఇత్యాది కళలను అభ్యసించాలి.[1] గృహాలంకరణలోనే ఈ కళలన్నీ ఇమిడి ఉన్నాయి. ప్రాచీన కాలంలో మన తెలుగు బాలికల నుండి వృద్ధుల వరకు ఈ కళలన్నింటినీ నేర్చుకొని ఉండేవారు. అందుకే కళలన్నింటినీ ఇముడ్చుకున్న చిత్రలేఖనంలో స్త్రీలు నేర్పరులైనారు. వివిధ రూపాలను ముగ్గుల్లో స్త్రీలు సునాయాసంగా చిత్రిస్తుంటారు. శిల్పుల, చిత్రకారుల కల్పనా లక్షణాలన్నీ ముగ్గుల్లో గోచరిస్తాయి. చిత్రకళలోని అవయవానురూపత్వం లేదా సమవిభక్తాంగత్వం

(Symmetry) క్రమ గమనం (Running) అనేది లక్షణాలను ముగ్గులు సంతరించుకున్నాయి. చిత్రలేఖనంలో 'బిందుజ" భాగానికి చెందింది ముగ్గులోని చిత్రీకరణం. స్త్రీలు బిందువులతో, రేఖలతో ఎడబాటు లేకుండ చిత్రాలను చిత్రిస్తుంటారు.

చతుష్షష్టి కళల్లో అరవది అయిన తండుల కుసుమ బలి వికారం (బియ్యపు పిండి, పూవులు మొదలైన వాటితో భూతతృప్తి కొరకు పెట్టెడు ముగ్గులు) అని ముగ్గుల చిత్రీకరణను ప్రత్యేక కళగా ప్రాచీనులు పేర్కొన్నారు.[2]

అతి ప్రాచీనతనూ, ప్రజ్ఞాపాటవాలనూ సంతరించుకున్న స్త్రీల చిత్రాలు సాత్విక గుణ సంకేతమైన ధవళ వర్ణపు ముగ్గుతో చిత్రితమౌతాయి. పసుపు, కుంకుమలు కూడా రంగవల్లుల్లో తెలుపు ప్రక్కనే వాడబడుతాయి. హైందవ చిత్రకళలో ప్రధానమైన ఈ రంగులతోనూ, వలువులతోనూ అజంతా చిత్రలేఖన కర్తలు ప్రపంచ ప్రఖ్యాతి వహించిన చిత్రాలను చిత్రించారు.[3] తెలుగు చిత్రకారిణులు గోమయంతో అలికిన ప్రదేశంలో ముగ్గులు చిత్రిస్తారు. కొంతమంది ఇసుకనూ, మట్టినీ, వరికుట్టునూ గోమయంతో కలిపి అలికిన ప్రాంతంలోనే ముగ్గులను చిత్రిస్తుంటారు.[4] ఈ పదార్థాలతోనే, ఈ విధంగానే గరుకైన రాతి గోడలను నునుపుగా, భిత్తికగా చేసుకొని అజంతా చిత్రకారులు చిత్ర రచన కావించినట్లు పరిశోధకులు వివరిస్తున్నారు.[5]

ప్రాచీన చిత్ర కళారీతులను పొందుపరుచుకున్న ముగ్గులకు తెలుగు దేశంలో పలుప్రాంతాల్లో ప్రాచీన కాలం నుండి నేటి వరకూ అనేక పర్యాయ పదాలున్నాయి. ముగ్గులను పట్టులు, వరికలు, ఉరుంగులు, పోతలు, రంగవల్లులు ముగ్గు గీతలు, ముగ్గు కర్రలు అని పిలుస్తారు.

ముగ్గుల్లో నియమిత ప్రదేశాల్లో పెట్టిన చుక్కలను పట్టుదలతో కలుపుతూ, వివిధ రూపాలనేర్పరుస్తుంటారు. కాబట్టి వీటిని పట్టులని అంటారని ఒక అభిప్రాయం ఉంది. ⁶* గ్రామ దేవతల ఉత్సవాల్లో దేవత ముందు రక, రకాల ముగ్గులను వేస్తారు. వీటిలో ముగ్గుల్లోని లతలూ, పూవులూ, పద్మాలూ గోచరిస్తుంటాయి. వీటిని పటం అని అంటారు. పటం నుండే పట్టు రావచ్చు.

దృశ్య విశేష్యమైన ఉరుంగులకు - ఇల్లు అలికిన తర్వాత ముత్యాలతో, అందంగా లతాద్యాకారాలతో చిత్రించే రంగవల్లికి సంబంధించిన ముగ్గుల అలంకారం అనే అర్థం కానవస్తుంది. హంసవింశతి కావ్యంలో కవి ఉరుంగులు అనే పదాన్ని ప్రయోగించాడు.

పాడ యెండ గాయని పొన్న గున్నల నీడ
గ్రొమ్ముత్తియపుటురుంగులు చెలంగ -

ముగ్గు అనే పదానికి 'పరికో', పర్యాయ పదం అని ఆంధ్ర వాచస్పత్యం తెలుపుతుంది. ⁷* పూజామందిరాల్లో వేసెడి వాటినీ, రంగులతో వేసెడి వాటినీ, రంగవల్లులని అంటారు. నేడు మాత్రం తెలుగు దేశమంతటా ముగ్గు అనే పదం వ్యవహారంలో ఉంది.

ముగ్గులు - ఉత్పత్తి వికాసాలు :

జానపద విజ్ఞానం పుట్టుపూర్వోత్తరాలను నిర్ధారించడం క్లిష్టతరం. జానపద విజ్ఞానాంశమైన ముగ్గుల ఉత్పత్తి వికాసాలను గురించి సరియైన నిర్ణయం చేయడం కూడ అసాధ్యం. జానపదుల నమ్మకాలనూ, ఆచారాలనూ సాహిత్యాన్నీ ఆధారంగా చేసుకొని పరిశీలిస్తే ముగ్గు ఎందుకు, ఏ విధంగా రూపు చెందిందో ఊహించవచ్చు. ఈ పరిశీలనకు మానవ శాస్త్రం, పురాతత్త్వ శాస్త్రం, సామాజిక శాస్త్రం, మంత్ర తంత్రాలకు సంబంధించిన విజ్ఞానాంశాలు సహకరిస్తాయి.

స్త్రీలు "ముగ్గుగీతను గీచిరా" అని తమ పిల్లలను ఆదేశిస్తుంటారు. ఈ గీతను దుష్ట గ్రహాలు లోనికి రాకుండా ఉండడానికి గీస్తారు. కొంతమంది ఇంటి ముందు ముగ్గుకర్ర వేయి అని అంటుంటారు. నడిచే వ్యక్తి కాలికి కర్ర తగిలితే పడి పోతాడు. అదే విధంగా గృహ ప్రవేశం చేయబోయే దుష్ట శక్తులకు అడ్డంగా ముగ్గు కర్రను వేస్తారు

ముగ్గును సున్నపు పొడితో వేస్తారు. రాతియుగం నాటి రాక్షసిగుళ్ళుగా పిలువబడుతున్న సమాధుల చుట్టూరా సున్నం గీతలు గీచిన నిదర్శనాలున్నాయి. ఆనాడు సున్నం గీతను దుష్ట శక్తులు లోనికి ప్రవేశించకుండ ఉండడానికే వేసినారని ఊహింపవచ్చు. ఈనాటికీ మహర్ తెగలో చనిపోయిన వారి సమాధులపైన సున్నం చల్లే ఆచారం ఉంది. సున్నానికి పరిశుభ్రత, స్వచ్ఛత, ఔషధీ గుణాలు ఉన్నాయి.



శక్యను నెదిరించే ముగ్గులు

చిన్న కులాలవారు గీతల ముగ్గునే వేస్తుంటారు. వీరికి చుక్కల ముగ్గులు తెలియవు. అగ్రవర్ణాలవారు కూడ పర్వ దినాల్లో గీతల ముగ్గును తప్పకుండా వేస్తారు. ఈ నియమం గీతల ముగ్గు ప్రాచీనతను తెలుపుతుంది. ఇవి అడ్డం, నిలువు గీతలతో, గళ్ళతో కళ్ళను చెదరగొడతాయి. బెదురును కలిగిస్తాయి. దుష్టశక్తులను బెదిరించడానికి, దృష్టి దోషం తగులకుండా ఉండడానికి మగువలు మొదట ఈ ముగ్గులను ఆరంభించి ఉండవచ్చు.

చిన్న కులాల్లో బైండ్లవారు పసిపిల్లలకు, పెద్దలకు గ్రహదోషాలు నుండి దుష్టగ్రహాలనుండి రక్షణ కలుగుతుందని రక్షరేకులను కడుతుంటారు. వీటినే యంత్రం అని అంటారు. గ్రామాల్లో ఏ అనారోగ్యం ఏర్పడినా యంత్రాలను కట్టించుకుంటారు. అనారోగ్యం, దుష్ట శక్తులు ఆవహిస్తేనే ప్రాప్తిస్తుంది అని వారి విశ్వాసం. బంగారు రేకుపైన గానీ, రాగిరేకుపైన గానీ, కాగితంపైన గానీ గీతలతో ప్రత్యేక చిత్రాలను గీచి మధ్యలో బీజాక్షరాలను లిఖిస్తారు.[10] ఈ యంత్రాలపైన ఉండే చిత్రాలకూ, ముగ్గుల్లో ఉండే చిత్రాలకూ సామ్యం అధికంగా ఉంది. కొన్ని కులాల్లో (కమ్మ, కాపు, గొల్ల మొదలైనవి) 1,2 యంత్రాలను పోలిన "పోలును" వివాహ సమయంలో వడ్లతోగానీ, ఇతర ధాన్యాలతో గానీ వేసి మధ్యన వధూవరులను కూర్చోబెట్టి మైలపోలు తీస్తారు. వివాహ మండపంలో కూడా 'పోలు' రాస్తారు. ఈ ఆచారం వధూవరుల దగ్గరకు దుష్ట శక్తులు రాకుండ ఉండడానికి ఏర్పడిందే కావచ్చు.



చిన్న పిల్లల ఆరోగ్యానికి కట్టబడే యంత్రాల చిత్రాలు

1 తల్లికి కట్టబడే యంత్రం



a) ఎల్లమ్మ పండుగలో వేసెడి రతి

b) కర్ణాటక ప్రాంతంలోని భగవతీముగ్గు

మానవుడు తన దేహరక్షణకు, అలంకరణకు ఎంతగా పాటుపడతాడో తాను నివసిస్తున్న ఇంటి రక్షణకు, అందానికి కూడా అంతగానే శ్రమిస్తాడు. దేహాన్ని దుష్ట శక్తులనుండి కాపాడుకోవడానికి యత్నించినట్లుగానే, ఇంటిని కూడా దుష్టశక్తులనుండి రక్షించుకోవడానికి రక్షరేఖగా ముగ్గు గీతలను గీచి ఉండవచ్చు. నేటికీ ముగ్గు గీతను గీస్తే దయ్యాలు, భూతాలు ఇంట్లోకి రావనే నమ్మకం జానపద స్త్రీలకు ఉంది.

గ్రామ దేవతల పండుగల్లో దేవతా పూజారులే ముగ్గులను వేస్తుంటారు. ఆంధ్ర ప్రాంతంలో తిరుపతి సమీపంలో "మాతమ్మ" అమ్మవారి బొమ్మను ముగ్గుతో చిత్రిస్తారు.[11] కర్ణాటక ప్రాంతంలో భగవతీ ఆరాధన సమయంలో దేవతా చిత్రాన్ని చూపరులకు భయం కల్గించేటట్లుగా చిత్రిస్తారు. [12]

తెలంగాణా ప్రాంతంలో గ్రామదేవతల పండుగ సమయాల్లో దేవతా కళ్యాణోత్సవం తర్వాత వేసే ముగ్గును "రతి" అంటారు. దీనికి తెలుపు, నలుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు పొడులను వాడుతారు

ఈ ముగ్గును వేయడానికి అర్ధచంద్రాకారపు పలకలను, దీర్ఘచతురస్రాకారపు పలకలను వాడుతారు. వీటిలో రంగుల పొడిని నింపి, అలికిన ప్రదేశంలో బోర్లిస్తారు. ఈ ముగ్గులో మధ్యన ఎరుపురంగులో పద్మం వేస్తారు. చుట్టూరా పూలు, తీగలుంటాయి. ఈ నమూనానే రతి అనీ, పట్టణం అనీ, పటం అనీ అంటారు. దేవతలను బట్టి రతుల సంఖ్య మారుతుంది.[13]

గ్రామదేవతల పండుగల్లో దేవతాకళ్యాణం తర్వాత రతిని వేస్తారు. వాయిద్యాలను మోగిస్తూ రతుల మీద నిమ్మకాయలను కోసి వేస్తారు. కొబ్బరి కాయలను కొడతారు. తర్వాత దేవతను రతి మధ్యకు తీసుకొని వస్తారు. జంతువును బలి ఇచ్చి, రక్తాన్ని రతి మీద చల్లుతారు. పండుగ పూర్తైన తర్వాత రతిని(ముగ్గును) కడిగి వేస్తారు. మల్లన్న పండుగలో ఈ ముగ్గునే పూజారులు వేసి పట్టణం, కోట అనీ అంటారు. మల్లన్న పెళ్ళి తర్వాత ముగ్గునంతా తొక్కి వేస్తారు. పూజారులు వేసిన ముగ్గును తర్వాత తొక్కివేసే ఆచారం మన తెలుగు దేశంలోనే కాకుండా, క్యూబాదగ్గరున్న హైయతి ద్వీపవాసుల్లో కూడ కనడుతుంది. అక్కడ పూజారులు నేలపైన వెవర్ (Vever) అనే నమూనాను వేస్తారు. ప్రజలందరూ ఆ నమూనాను గౌరవంగా వంగి ముద్దు పెట్టుకుంటారు. ఈ నమూనా మన గీతల ముగ్గు మాదిరి ఉంటుంది. నాట్యకారులు ఒకటేసారి నాట్యం చేస్తూ నమూనాను త్రొక్కి వేస్తారు.

తెలంగాణా ప్రాంతంలో గొల్లవారు చనిపోయిన వారిని స్మశానానికి తీసుకొని వెళ్ళడానికి ముందు రతిని వేసి పడుకోబెడతారు. దేవతా కళ్యాణం తర్వాత వేసే ముగ్గు మధ్యలోని పద్మంపైన దేవతావిగ్రహాన్ని కూర్చోబెట్టడంలో, ముగ్గును 'రతి' అని పిల్వడంలో ఔచిత్యం కనిపిస్తుంది. పద్మం సఫలతకూ, గర్భానికీ సంకేతం అని

ఊహించవచ్చు. రతిలో శవాన్ని పడుకోబెట్టడం, ప్రాణి స్త్రీగర్భంలోనికి పునః ప్రవేశాన్ని కోరడాన్ని సూచిస్తుంది. దేవతాపండుగకు వేసే రతినే మాంత్రికులు తాంత్రికులు దేవతాస్తంభనకు, వశీకరణాదులకు ఉపయోగిస్తారు.

నిరక్షరాస్యులైన వారికే కాకుండ అక్షరాస్యులకూ, అగ్రవర్ణస్థులకూ యంత్రాలపైన విశ్వాసం అధికంగా ఉంటుంది. మృత్యుంజయయంత్రం, సర్వరోగ నివారణాయంత్రం మొదలైన వాటిని రక్షరేకుగా గానీ, చిత్రపటంగా గానీ ధరిస్తారు, ఇంట్లో పెట్టుకొని పూజిస్తారు. వీటివల్ల మృత్యుభయం, రోగ భయం, దృష్టిదోషం ఉండదని నమ్ముతారు. ఈ యంత్రాల్లో సామాన్యంగా మధ్యన రెండు త్రికోణాలు, చుట్టూర పద్మదళాలు చిత్రించబడుతాయి. ప్రపంచ పర్యాప్తంగా రేఖాగణిత చిత్రాలను మాంత్రిక శక్తులను వశపరచుకోవడానికే చిత్రిస్తుంటారు. ముగ్గుల్లో కూడ ఇవి అధికంగా ఉన్నాయి.

మాంత్రికులు దయ్యాలు పట్టిన వారిని, భీతిని కలిగించే పెద్ద పెద్ద ముగ్గులను చిత్రించి వాటి మధ్యలో కూర్చోబెట్టి మంత్రాలను చదువుతుంటారు. తెలుగు దేశంలో పరిక ముగ్గుల వాళ్లనెడి సంచార భిక్షుక గాయకులున్నారు. వీరు ఉభయ గోదావరులు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల్లో నివసిస్తున్నారు. [14] ఈ భిక్షుక గాయకులు సోది చెప్పుతూ, పచ్చబొట్లు వేస్తూ, భూతవైద్యం చేస్తూ జీవితాలను గడుపుతున్నారు. దయ్యాలు పట్టిన వారిని ముగ్గులో కూర్చోబెట్టి వైద్యం చేస్తారు కాబట్టి థర్‌స్టన్ వీరి కులాన్ని దయ్యాల కులం అని పేర్కొన్నాడు.[15] వీరు మొదట భూమిపైన అలికి ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ, నలుపు రంగుల పొడులతో పంచ ముగ్గులను వేసి అష్టదళ పద్మాన్ని గానీ, భయాన్ని కల్గించే బొమ్మను గానీ చిత్రించి గాలి, ధూళి, సోకిన వారిని మధ్యలో కూర్చోబెట్టి

మంత్రాలను చదువుతారు. వీరు వేసే పంచముగ్గుల్లో కొందరు యంత్రాలను కూడా వేస్తారు. వాటిలో ఆంజనేయ యంత్రం, భేతాళ యంత్రం, నరసింహ స్వామి యంత్రం ముఖ్యమైనవి.

తెలుగులో 'ముగ్గులో లేకుండా పోయాడు" అనే సామెత ప్రచారంలో ఉంది. దీని అర్థం కనపడకుండా మాయమై పోయాడనే అర్థం. భూతవైద్యులు వేసెడి ముగ్గులను ఆధారంగా చేసుకొని జనించిన సామెత కావచ్చు ఇది.

ఈ విధంగా వివిధ వర్గాల, వివిధ ఎర్ణాల ఆచార సంప్రదాయాలకూ, ముగ్గు చిత్రాలకూపోలిక కనపడుతున్నందువల్ల ముగ్గు వేయడమనే ఆచారం దుష్ట శక్తుల నిరోధం కొరకు ఏర్పడింది అనే అంశం స్పష్టమవుతుంది.

Prof. John Layard రచించిన "Labyrinth Ritual in South India" లో కోలం (తమిళ దేశంలో ముగ్గును కోలం అని అంటారు) చిక్కు త్రోవ (చక్ర వ్యూహం వంటిది) ను వేయడమనే ఆచారం నుండి రూపొందిందని వివరించివాడు. ప్రాచీన కాలంలో చిక్కు త్రోవను చిత్రించినందువల్ల మానవునికి ఈ లోకంలోనూ, పరలోకంలోనూ విజయం లభిస్తుందని నమ్మేవారు. త్రోవలను చిక్కు చిక్కుగా చిత్రించడంవల్ల దుష్ట శక్తులు లోనికి ప్రవేశించవని వారి విశ్వాసం. ఈజిప్టు రాజుల సమాధుల్లో త్రోవలను కొత్తవారూ, దుష్ట శక్తులూ ప్రవేశించకుండా ఉండడానికి చక్కగా కాకుండా చిక్కుగా ఏర్పరచేవారు. మెలనేషియా ద్వీపవాసుల్లోని ఆటవిక తెగలు శవాన్ని పాతిపెట్టే ప్రాంతానికి పోయెడి మార్గాన్ని రేఖాగణిత చిత్రాల మాదిరిగా ఆడ దయ్యం ఇసుకలో సగం చిత్రాన్ని చిత్రించి వదలి వేస్తుందనీ, చనిపోయిన మగవాని దయ్యం ఆ చిత్రాన్ని

పూర్తిచేసుకొని ముందుకు సాగిపోతుందని నమ్ముతారు. ఈ నమూనాలనే అక్కడి వారు ఆటల చిత్రాలుగా చిత్రిస్తుంటారు. ఈ చిత్రాలు ఒకే ఒక్క పొడవైన గీతతో, వివిధ కోణాల్లో అనేక రూపాల్లో తిరిగి తిరిగి పూర్తి అవుతుంది. ఈ గీత చిన్న చిన్న చుక్కలను ఆధారంగా చేసుకొని అనేక మలుపులను తిరుగుతుంది. ఈ చుక్కలు దయ్యం కళ్లకూ, ముక్కు రంధ్రాలకూ ప్రతి రూపాలు. పొడవైన గీత దయ్యం రూపానికి ప్రతి బింబమని వారు నమ్ముతారు. దక్షిణ దేశంలో ముగ్గులను ఎక్కువగా మార్గశిర మాసంలో వేస్తారు. ఈ మాసంలో సూర్యుడు దక్షిణాయణంలో ఉంటాడు, అనారోగ్య కాలమిది, ఎక్కువమంది చనిపోతుంటారు. ఈ సమయంలోనే సూర్యుని కాంతి క్షీణిస్తుంది. - స్త్రీలు వేసెడి ముగ్గులను మగవారు దాటి వెళ్ళిపోతుంటారు. మలేషియా వారు, ఈజిప్టు వారు, మరణించిన వారి కొరకు వేసెడి చిక్కు చిత్రాల్లోని భావం కోలంలో కనపడుతుంది అని "లయర్డ్" వివరించారు. *16

Prof. John Layard వివరణ హిందూ సంస్కృతికి అన్వయించినట్లుగా కనపడదు. మార్గశిర మాసంలోనే ముగ్గులనధికంగా చిత్రించడానికీ, మన స్త్రీలు వివరించెడి వివరణకూ ప్రొఫెసర్ 'లయర్డ్' వివరించే వివరణకూ వైరుధ్యం అనంతంగా ఉంది. లయర్డ్ వివరించిన దుష్ట శక్తుల ప్రవేశ నిరోధకంగా స్త్రీలు ముగ్గు చిత్రాలను చిత్రిస్తారనే అంశం కొంత వరకు సమంజసంగా ఉంది.

స్త్రీల ముగ్గులకు మూలం వ్రతాచరణలు. వీటికి మూలం ప్రాచీన మానవుని చిత్రాలు, చిత్తప్రవృత్తి అని శ్రీ అజిత్ ముఖర్జి పేర్కొన్నాడు. [17] మధ్య ప్రదేశ్ త్రవ్వకాల్లో లభించిన ముద్రికలు, అవశేషాలు, గుహల్లోని చిత్రాలు రాతియుగం నాటి మానవులవని నిర్ణయించారు. రాయ్‌ఘర్, హెూసంగబాద్, చక్రధర్‌పూర్

ప్రాంతాల్లోని రాతి గుహల్లో ప్రాక్చారిత్రక యుగానికి సంబంధించిన చిత్రాలు కొన్ని కనపడ్డాయి. గోదావరి, నర్మద ప్రాంతాల్లో లభించిన చిత్రాలు కూడ మానవుని ఆటవిక దశకు చెందినవని పురాతత్త్వ శాస్త్రజ్ఞులు వివరించారు. ఈ ప్రాంతాల్లోని చిత్రాల్లో ప్రాచీన మానవు ణ్ణి ఆకర్షించిన సూర్యచంద్రులు, నక్షత్రాలు, చుక్కలు, అలలు, మనిషి చేయి, చెట్టు, గుట్ట, జంతువుల రూపాలు గాక, మనిషి జంతువును వేటాడే దృశ్యం కూడా చిత్రీకరింపబడినాయి. జంతువుల చిత్రాలను చిత్రించడం వల్ల వాటిపైన అధిపత్యాన్ని, వాటినుండి రక్షణను, మాంసాన్ని సంపాదించుకోవాలనే భావం ప్రాచీన మానవునికి ఉండవచ్చు. ప్రాచీన మానవుని అభిప్రాయాలూ, చిత్రాలూ కాలం గడచిన కొద్దీ రూపాంతరం చెంది వ్రతాలుగా కర్మకాండలుగా పరిణమించినాయి.

హోసంగబాదు ప్రాంతంలోని చిత్రాలెక్కువగా చేతి వ్రేళ్ల చివర్లతోనే వేసినట్లుగా ఉన్నాయి. చిత్రీకరణకు జేగురు రంగును, తెలుపును, నలుపును వాడినారు. ఈ మూడింటి సమ్మేళనంతో ఏర్పడిన కుంకుమ వర్ణాన్ని కూడా వారు చిత్రాల్లో ఉపయోగించుకున్నారు. పసుపు వర్ణంతో ఏనుగు చిత్రం గుహల్లో ఆకర్షణీయంగా చిత్రింపబడింది. ఈ వర్ణాలూ, చిత్రాలూ కర్మకాండల్లో ప్రవేశించినాయని ముఖర్జీగారు వివరించినారు. మధ్యప్రదేశ్ లోని ఈ గుహలను అచటి వారు మందిరాలని అంటుంటారు.

ప్రాచీన మానవుడు వ్రేలితో చిత్రించిన చిత్రాల అవశేషాలే నేటి స్త్రీలు చేతి వ్రేళ్ల చివర్లతో చిత్రించే ముగ్గులు కావచ్చు. ఆ చిత్రాల్లోని తెలుపు, పసుపు, జేగురు, కుంకుమవర్ణాలు నేటి ముగ్గుల్లో కూడ కనపడుతున్నాయి.ముగ్గు పొడి తెల్లగా ఉంటుంది. పూజా మందిరాల్లోని ముగ్గుల మధ్యన, సంక్రాంతి సమయంలో ముగ్గు మధ్యన గొబ్బెమ్మల చుట్టూర వేసెడి పసుపు కుంకుమలు రాతి గుహల చిత్రాల్లోని

వర్ణాలకు గుర్తులని భావింపవచ్చు. కొన్ని ప్రాంతాల్లో తెల్లటి ముగ్గు గీత ప్రక్కనే ఎర్రటి జేగురు గీతను గీస్తారు. ఒక్క తెలుపు గీత గీయడం అనాచారం అని వారి అభిప్రాయం. ఆదిలాబాద్ ప్రాంతంలో పండుగ సమయాల్లో ఎర్రగీత ప్రక్కన తెల్లగీతను గీస్తారు.

రాతి గుహల్లోని చిత్రాలే క్రమంగా ఇంటి ముంగిట ముగ్గులుగా రూపొందినాయనడానికి బలవత్తరమైన మరొక నిదర్శనం గుహ చిత్రాల్లోని అంశాలు ముగ్గుల్లో కూడ కనపడడం. సూర్యుడు, చంద్రుడు, చెట్లు, లతలు, జంతువులను ముగ్గుల్లో చిత్రిస్తుంటారు. రాజస్థాన్, బెంగాల్ ప్రాంతంలో రేఖల్లోనే మానవాకారాలను ముగ్గుల్లో చిత్రిస్తుంటారు. ప్రాచీన కాలంలోని చిత్రాంశాలూ, వర్ణాలూ, చిత్రీకరణ విధానం, ముగ్గుల్లో ప్రతిబింబిస్తున్నాయి కాబట్టి నాటి చిత్రాల అవశేషాలే నేటి ముగ్గులని నిర్ణయింపవచ్చు.

రాతి గుహలోని వేటాడే దృశ్యం చిత్రీకరణ ప్రాచీన మానవుని కోరికను వ్యక్తం చేస్తున్నది. స్త్రీలు సంపద కొరకుగానీ, సంతానం కొరకు గానీ, సౌభాగ్యం కొరకుగానీ, వ్రతాలను ఆచరిస్తుంటారు. కోరికలను నెరవేర్చుకోవడానికి నియమ నిష్ఠలతో కూడిన వ్రతాచరణ ముఖ్యం. భారతీయ మహిళలకు సంపద అంటే వ్యవసాయ సంపద. పంటలు సమృద్ధిగా పండితే ఇల్లు అన్ని రకాల సంపదలతో తులతూగు తుంటుంది. మాతృత్వం స్త్రీకి పరమావధి. సఫలతా శక్తి కొరకు స్త్రీ అనేక పాట్లు పడుతుంది. సౌభాగ్యం స్త్రీ జీవిత ధ్యేయం. వీటి సాధనకే స్త్రీలు వ్రతాచరణలో పాటు చిత్రాలను చిత్రిస్తారు.

తెలుగు స్త్రీ- సంపదకూ, సౌభాగ్యానికీ సఫలతా శక్తికీ సంకేతాలైన చిత్రాలను వాకిట్లో చిత్రిస్తుంది. పూజామందిరంలో కూడచిత్రించి పూజిస్తుంది.ముగ్గు ద్వార స్త్రీ తనకోరికలను వ్యక్తం చేస్తుందనెడి అంశం స్పష్టంగా వ్యక్తమవుతుంది.

వ్రతం మొదట మంత్ర విద్యగా ఉండి కాలక్రమేణ కళ ద్వార భగవద్భక్తిని ఆరాధించే విధంగా పరిణమించిందని బెంగాలీ విజ్ఞానవేత్త సుధాంశు వివరించాడు. మంత్రం వ్రతంలో కవిత్వంగానూ, మాంత్రిక సంబంధమైన అల్పన (బెంగాలీ ముగ్గు), కళగానూ మారింది. వ్రతంలో మంత్ర వివరణకు చిత్రం అవసరం. చిత్రంలోని లక్ష్యం మంత్రం ద్వారా స్థిరత్వాన్ని పొందుతుంది. [18.]

తంత్ర విద్యకూ, ముగ్గుకూ సామ్యాలనేకం గోచరించడం వల్ల ముగ్గుచిత్రాలకు మూలం, తంత్రంలోని మండలాలు, చక్రాలు, యంత్రాలు అనే అభిప్రాయం ఏర్పడుతుంది. ముగ్గులే తాంత్రికుల రచనకు మూలమైనాయనెడి భావం కూడ కలుగుతుంది. తంత్ర శాస్త్రంలోని యంత్రాలను, చక్రాలను పూజిస్తే తమ ఆరాధ్య దేవతలు (యంత్రాలపైన అధిష్ఠించిన దేవతలు) సంతోషిస్తారని తాంత్రికుల విశ్వాసం. త్రిభుజాకార, వృత్తాకార చక్రాలను పూజిస్తే రోగాలు అంతరిస్తాయనీ, బలం, భాగ్యంతోపాటు శత్రునాశనం కూడ జరుగుతుందని భావిస్తారు. మండలంలో, యంత్రంలో, చక్రంలో, మధ్యన దేవతను సూచించే బీజం ఉంటుంది. విగ్రహం ఉండదు. దాని చుట్టూర చిత్రం చిత్రితమై ఉంటుంది. ముగ్గుల్లో కూడ మధ్యన చుక్క ఉంటుంది. చుట్టూరా పద్మం కానీ, త్రికోణాలు కానీ ఉంటాయి. ముగ్గుల్లో విగ్రహం ఉండదు. దేవీ ప్రతీకలు ఉంటాయి. తాంత్రికులు ఎరుపును ఎక్కువగా వాడుతారు. ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో పేడ కలిపిన ఎర్రమట్టితో అలికి ముగ్గులను చిత్రిస్తారు. తాంత్రికులు స్త్రీశక్తిని ఆరాధిస్తారు. ముగ్గులను స్త్రీలే రచిస్తారు. తంత్రంలోని చక్రాల మాదిరిగానే, ముగ్గు శుభసూచకమనీ, దుష్టశక్తులను దరిచేరనివ్వదనీ స్త్రీలు విశ్వసిస్తారు.

తంత్ర లక్ష్యం, ఉద్దేశం, చక్ర, మండల, యంత్ర రచనలు ముగ్గులో ప్రతిబింబిస్తున్నాయి. కాబట్టి ముగ్గులకు మూలం తంత్రమనే అభిప్రాయం కొంత వరకు అసమంజసమని భావింపవచ్చు.

తాంత్రికులు చక్రాలనూ, యంత్రాలనూ రహస్యంగా ఆరాధిస్తుంటారు. సాధ్యమైనంతవరకూ వాటిని బహిరంగ ప్రదేశాల్లో, పెట్టి పూజించరు. అవి పవిత్రాలు, పవిత్రమైన వాటిని నేలపైనవేయరు. తాంత్రికుల చిత్రాలు ముగ్గులకు మూలం కావు కాని మహిళల ముగ్గుల్లోని రూపాలే తంత్రాలకు మూలమైనాయనే భావం కలుగుతుంది.

మనస్తత్వ శాస్త్ర పరంగా ఆలోచిస్తే స్త్రీ అందం కొరకే ముగ్గును వేయడం ఆరంభించిందనే అభిప్రాయం ఏర్పడుతుంది. స్త్రీకి అందంగా కనపడాలనే తాపత్రయం పురుషునికంటె అధికంగా ఉంటుంది. అందుకే అలంకరణపైన మోజు చూపెడుతుంది. తానే గాక తన ఇల్లు, పిల్లలు, పరిసరాలు పరిశుభ్రంగా, అందంగా ఉండాలనే తపన ప్రతి తరుణి అంతరంగంలో ఉంటుంది. స్త్రీ తాను ప్రతిరోజూ నీటితో స్నానం చేసి శుచియై అలంకరించుకుంటుంది. అదే విధంగా ఇల్లాలు, ఇంటిని ప్రతి రోజూ ఊడ్చి పరిశుభ్రం చేసి పేడనీళ్ళతో అలికి ముగ్గులు వేసి అందంగాఅలంకరిస్తుంది. పల్లెల్లో వాకిట్లోనే గాక ఇల్లంతా ఎర్రమట్టితో అలికి ముగ్గులు పెట్టుతుంటారు. నేటికీ చాలా మంది స్త్రీల అభిప్రాయం ప్రకారం ముగ్గు లక్ష్యం అందంగా కనపడడం. వీరి అభిప్రాయం స్త్రీ మనస్తత్వానికీ, జీవితానికీ అన్వయిస్తుంది.

ఈ విధంగా వివిధ పండితుల అభిప్రాయం ప్రకారం ముగ్గు ముందు మంత్రంలో, తంత్రంలో, గృహాలంకరణలో ఒక భాగంగా ప్రారంభమై , క్రమంగా ఆచారంగా పరిణమించిందని ఊహించవచ్చు.

ముగ్గుల్లో వేసే చిత్రాంశాలకు అతి ప్రాచీన చరిత్ర ఉందని ప్రాచీన కాలానికి చెందిన త్రవ్వకాల్లో వెలువడిన శిథిలాల ద్వార వెల్లడి అవుతుంది. క్రీ.పూ. 2,3 వేల సంవత్సరాల నాటి సింధు నాగరికతలో వెలువడిన శిథిలాల్లో నేటి ముగ్గుల్లోని త్రికోణాలు, వలయం, దీర్ఘ చతురస్రాకారం, చేప, స్వస్తిక్, పద్మాలు - కనపడుతున్నాయి. [1[illegible]]

సింధూనాగరికతానాణేలపైన గల చిత్రాలు



ఇందులోని 17వ చిత్రం ముగ్గుల్లోనూ, మాంత్రికుల యంత్రాల్లోనూ వివాహ సమయంలో రాసే పోలులో కనపడుతుంది. మనమతానికి పునాది సింధు నాగరికతయే అని ఈ చిత్రాల వల్ల నిరూపితమౌతుంది. స్వస్తిక్ నేడు శుభచిహ్నం. వలయం సూర్యునికి సంకేతం. పద్మం లక్ష్మికి ప్రతిరూపం వీటిలోని కొన్ని చిత్రాలు దంతపు - వస్తువులపైన చిత్రితమైనాయి. ఆనాటికే ప్రజలు అలంకరణ వస్తువులపైన చిత్రాలను వేసెడి వారని విదితమౌతుంది. నాటి అలంకరణచిత్రాలే ముగ్గుల్లో ప్రవేశించి ఉండవచ్చు.

సింధు నాగరికతలో చిత్రాల్లోనే లిపి లిఖించబడింది. పండితులు ఈ లిపిలోని భావాన్ని సరిగ్గా చెప్పలేకపోయినారు. ఆనాడు స్త్రీమూర్తులను పూజించినట్లుగా మాత్రం స్త్రీ ప్రతిమలనేకం లభించాయి. దేవాలయాలు ఆనాడు నిర్మించలేదని చారిత్రకులు వివరించారు. నాటి ప్రజలు తమ భావాలనూ, ఆరాధనలనూ చిత్రలిపి ద్వార వ్యక్తం చేసెడివారు. స్త్రీల ముగ్గులు కూడ వారి మనోభావాలకు ప్రతిదర్పణాలు.

హరప్పా మొహెంజొదారో లోని లిపిలోని చిత్రాలన్నీ ముగ్గుల్లో ప్రతిబింబిస్తున్నాయి. అందుకే భారతీయ స్త్రీలు సింధు నాగరికతా కాలం నుండి చిత్రలిపిని ముగ్గుల్లో పదిల పరుస్తున్నారని భావించవచ్చు.

శ్రీ జోగేందర్ సక్సేనా వేద కాలంలోని యజ్ఞ వేదికల నిర్మాణ నమూనాలే ముగ్గుల్లో చోటు చేసుకున్నాయని వివరించారు. ఆర్య స్త్రీలు హోమకుండాలను ముగ్గులతో అలంకరించెడి వారనీ, అతిథికి స్వాగతం చెప్పే కార్య క్రమాల్లో ఇంటినీ, యజ్ఞ వేదికనూ అలంకరించే వారనీ, వారి అలంకరణా దృష్టి ముగ్గుల్లో ప్రతిబింబించేదనీ విశదీకరించారు. ఆర్య అనార్యుల సమ్మేళనంతో సింధు నాగరికతలోని చిత్రాలూ, ఆర్యుల యజ్ఞవేదిక నిర్మాణ నమూనాలూ సమ్మేళితమైనాయని తెలిపి, ఆ సమ్మేళనా ఫలితమే నేటి ముగ్గుల చిత్రీకరణ అని స్పష్టం చేయడానికి ప్రయత్నించారు.[20]

సింధు నాగరికతలోని చిత్రాలేగాక, ఋగ్వేదంలో వర్ణింపబడిన రథం, వివిధ పౌరాణిక ఇతివృత్తాలను ప్రదర్శించే ప్రతీకలు ముగ్గుల్లో కనపడుతున్నాయి. సింధు నాగరికతతో ప్రారంభమైన చిత్రలిపి కాలానుగుణంగా అనేక సంస్కృతీ ప్రతీకలతో విస్తరిల్లుతూ నేటికీ స్త్రీల ముగ్గుల్లో విరాజిల్లుతుంది అని చెప్పవచ్చు.

ముగ్గుల లక్ష్యం - లక్షణాలు

లక్ష్యం -

ముగ్గు అందంగా కనపడుతూ, పరిసరాలను అలరింపచేయడమే ప్రధాన, ప్రథమ లక్ష్యం. ఇంటి అందం కొరకే ఇంతులు ముగ్గులను వేస్తారు. చిన్నదైనా, పెద్దదైనా, గీతలోగానీ, చుక్కలో గానీ రూపొందిన ముగ్గు అందంగా కనపడాలి.

ఆచార సంప్రదాయాలను పాటించడానికి ముగ్గును వేయడం స్త్రీ రెండవ లక్ష్యం. నేను ప్రశ్నించిన స్త్రీలు ఎక్కువగా అందం కొరకే ముగ్గు అన్నారు. కొంత మంది మాత్రం ముగ్గు పెట్టడం ఆచారం అని తెలిపినారు. ఈ ముగ్గుల్లో సామాన్యంగా ఎనిమిది లక్షణాలు గోచరిస్తాయి.

లక్షణాలు :

1. సూర్యకిరణాలు ప్రసరించక పూర్వమే ముగ్గు ఇంటి ముంగిట ప్రత్యక్షమౌతుంది. ముగ్గు గీతగీచిన తర్వాతనే మగవారు గడపదాటుతారు. ప్రొద్దు ఎక్కిన తర్వాత ముగ్గు వేస్తే దరిద్రం అంటారు.
2. ఒక్క గీత ముగ్గు ఉండదు. కనీసం రెండు గీతలైనా ఉండాలి. సరుసగా నాలుగు గీతలతో ముగ్గును వేస్తారు కాని మూడు గీతలతో వేయరు. కొన్ని ప్రాంతాల్లో ఒక్క తెలుపు గీతనేగాక ప్రక్కన జాజుతో ఎర్రటి గీతను గీస్తారు, ఒక్క రంగుతో వేయరు.
3. మామూలుగా ముగ్గును గుల్ల సున్నంపొడితో వేసినమా, పర్వదినాల్లో, పూజా మందిరాల్లో పిండితోనే వేస్తారు.
4. ముగ్గు గీత వంకరటింకరలు లేకుండా చక్కగా ఉంటుంది. ముగ్గును ఒకమారే వేయాలి, మాటి మాటికి తుడపకూడదని అంటారు. తుడిస్తే దరిద్రం అని విశ్వసిస్తారు.
5. ముగ్గు, ఇంటి ముంగిట గడప దగ్గర నుండి వాకిట్లో మధ్య వరకూ వస్తుంది గానీ, వాకిట్లో చివరి భాగంలో గానీ, మూలకు గానీ వేయరు.
6. ప్రత్యేక సందర్భాలకూ, పండుగలకూ ప్రత్యేక ముగ్గులు ఉంటాయి.
7. పద్మం వంటి దేవతా ప్రతి రూపాలను ప్రత్యేక ముగ్గుగా వాకిట్లో

వేయరు. ముగ్గుల మధ్యన కమలాలు ఉండవచ్చు. వాటిని పూజా మందిరంలో వేస్తుంటారు. ఇంట్లో అశుభం జరిగితే ముగ్గు వాకిట్లో ఉండదు.

9. ముగ్గు నిండుగా ఉంటుంది. ముగ్గులో గీతలన్నీ కలిసి ఉంటాయి. విడిపోయి ఉండవు. గీతలు విడిపోయి ఉంటే దుష్ట శక్తులు లోనికి ప్రవేశిస్తాయని పల్లెవారు విశ్వసిస్తారు. ముగ్గును సగంలోగానీ, అసంపూర్ణంగాగానీ వేయకూడదు. ఒకవేళ వేస్తే అశుభం జరుగుతుందనే నమ్మకం ఉంది. ఈ నమ్మకాల వెనుక ముగ్గు సమగ్రంగా సౌందర్యంగా ఉండాలనే అభిప్రాయం దాగి ఉంది.

ముగ్గుల్లోని రకాలు :

భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో , వివిధ పేర్లతో అందంగా కనిపించాలనే లక్ష్యంతో లక్షణ సహితంగా మగువలు ముగ్గులను చిత్రించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. దేశమంతటా సంప్రదాయ పరంగా ప్రచారంలో ఉన్న ముగ్గులనన్నింటిని మూడు విధాలుగా విభజించవచ్చు. 1. పర్వత ప్రాంతాల్లోని ముగ్గులు 2. తీర ప్రాంతాల్లోనూ , మైదాన ప్రాంతాల్లోనూ వేసేవి 3. ఈ రెండింటి మధ్యన ఉండే ప్రాంతాల్లోని ముగ్గులు. ఇవి ఆకృతి, వల్లరీ, ఆకృతీ వల్లరీ ప్రధానాలుగా ఉంటాయి.

1. ఆకృతీ ప్రధానాలు : పర్వత ప్రాంతంలోని ముగ్గులు ప్రధానంగా, అధికంగా, ఆకృతి ప్రధానాలు. ఇవి పర్వతాల స్థిరత్వాన్ని, కఠినత్వాన్ని సూచించే రేఖాగణిత ప్రకారంలో చిత్రింపబడుతాయి. తెలుగు దేశంలోని ముత్యాల ముగ్గులు ఈ ప్రాంతాల్లో కనపడవు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిమాచల ప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లోని ముగ్గులు ఈ విభాగంలో చేరుతాయి.

2. వల్లరి ప్రధానాలు: పూలూ, లతలూ చిన్న చిన్న రేఖా చిత్రాలూ బెంగాల్, బీహార్ ప్రాంతాల ముగ్గుల్లో ఉంటాయి. పుష్పం మృదుత్వాన్ని ప్రవాహపు లయలను ఇవి సూచిస్తాయి.
3. ఆకృతి వల్లరి ప్రధానాలు: ఆకృతి వల్లరీ ప్రధాన చిత్రాల్లో స్థిరత్వాన్ని సూచించే రేఖాగణిత చిత్రాలు, మృదుత్వాన్ని సూచించే పుష్పాలు, లతల చిత్రాలు ఉంటాయి. దక్షిణ దేశంలోని తెలుగు, తమిళ, కర్ణాటక దేశాల్లోని ముగ్గులు ఆకృతి వల్లరీ ప్రధానాలు. [21]

ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాల్లో బియ్యాన్ని నానబెట్టి రుబ్బి ఆ చిక్కటి ద్రవంతో ముగ్గు చిత్రాలను చిత్రిస్తారు. కొన్ని ప్రాంతాల్లో సుద్దపొడిని నీటిలో కలిపి వేస్తారు. దక్షిణ ప్రాంతంలో గుల్లముగ్గు పొడిని వాడుతారు. తెలుగు ప్రాంతంలో గుల్ల ముగ్గును గానీ, రాతి ముగ్గును గానీ వాడుతుంటారు. మట్టినేల పైన ముగ్గుపొడిని వాడినమా, గచ్చునేలపైన, ఇంట్లో పరిచిన రాళ్ళపైన బియ్యాన్ని నానబెట్టి రుబ్బి సన్నటి పుల్లతోగానీ, పుల్లకు పలుచగా దూదిని గానీ చుట్టి దాన్ని కుడి చేతి రెండు వ్రేళ్ళతో పట్టుకొని ముగ్గును చిత్రిస్తుంటారు. కొంతమంది నామును వాడుతారు. చాక్ ముక్కను (Chalk Piece) నీటితో తడిపి ముగ్గును వేస్తారు. ఈ రోజుల్లో తెల్లటి పెయింట్‌ను సన్నటి పుల్ల సహాయంతో ముగ్గు చిత్రంగా చిత్రిస్తారు. ఈ ముగ్గు చిత్రాలు కొన్ని రోజుల వరకూ చెక్కు చెదరకుండా ఉంటాయి. సంక్రాంతి సమయాల్లో, వివాహం, గృహప్రవేశం మొదలైన శుభకార్యాల్లో కొన్ని రోజుల వరకూ నిలిచి ఉండే ముగ్గులను వేస్తుంటారు. వీటిని వివిధ రంగులతో తీర్చి దిద్దుతారు.

ముగ్గు వేసే విధానంలో రెండు విధానాలున్నాయి. ముగ్గు పొడిని కుడిచేతి బొటన వ్రేలు, చూపుడు వ్రేలుతో వేసే విధానం ఒకటి. ముగ్గు పొడిని చేతిలోనికి తీసుకొని పిడికిలివలె వంచిన వ్రేళ్ళ

మధ్యనుండి అతి నైపుణ్యంగా జాగ్రత్తగా రాల్చుతూ వివిధ ఆకారాలను మలచడం మరొకటి. ముగ్గు పొడి అయిపోయేంత వరకు వేలిని పైకి తీయరు. సామాన్యంగా మొదటి మూడు వ్రేళ్ళ మధ్యనుండి రెండు గీతలు తిన్నగా, వంపులు తిరుగుతూ ఏర్పడుతాయి. ఆ గీతలననుసరించి ప్రక్కనే రెండవ మారు రెండు గీతలు వేస్తారు. మొత్తం నాలుగు గీతలతో ముగ్గు చిత్రం చిత్రితమౌతుంది. ఈ నాలుగు గీతలు సమాన దూరంలో, కొలత బద్దలో కొలచినట్లుగా ఉంటాయి. ఎంత పెద్ద ముగ్గునైన వ్రేళ్ల మధ్యనుండి పొడిని రాల్చుతూ సమాన దూరంలో చక్కటి గీతలను వేస్తుంటారు. వీరి ముగ్గు చిత్రాలు, నిపుణుడైన చిత్రకారుడు, గణిత శాస్త్రజ్ఞుడు వివిధ పరికరాలతో (కొలతబద్ద, వృత్తలేఖిని) చిత్రించినట్లుగా చూపరులకు కనపడుతుంటాయి.

నాలుగు గీతల ముగ్గులు వేసే నైపుణ్యం అలవడితే అర నిముషంలో అతి తేలికగా పెద్దగా, నిండుగా ముగ్గును చిత్రించవచ్చు. అగ్రవర్ణాల్లో పెద్దవాళ్ళు ఈ ముగ్గులనెక్కువగా వేస్తుంటారు. నేటి తరం వారికి ఈ ముగ్గులు వేయడం రాదు. తొందరగా వేయ వచ్చుని కాబోలు శ్రామిక స్త్రీలు గీతల ముగ్గులనే వేస్తుంటారు. ఈ ముగ్గుల్ని శ్రామిక స్త్రీల కాలాన్ని వ్యర్థం కానివ్వవు. వాకిలికి అందాన్ని, నిండుదనాన్ని ఈ ముగ్గులు ప్రసాదిస్తుంటాయి.

కొంతమంది గీతల ముగ్గు చుట్టూరా, మధ్యలోనూ వ్రేళ్ళ మధ్యనుండి పొడిని విడుస్తూ చిన్న చిన్న గీతలుగా వేస్తారు. వీటిని గీట్లు గీయడం అంటారు. ఈ గీట్ల వల్ల ముగ్గుకొక వింత అందం చేకూరుతుంది.



గీటు ముగ్గు

ఆంధ్ర ప్రాంతంలో గీతలముగ్గును "పాతముగ్గు" అని అంటారు. తెలంగాణా ప్రాంతంలో 'గోటు' ముగ్గు అంటారు.

ముగ్గులను కుడి చేతి బొటన వ్రేలు, చూపుడు వ్రేలితో వేసే విధానంలో మూడు రకాలున్నాయి. 1. గీతల ముగ్గులు 2. చుక్కల ముగ్గులు 3. రంగవల్లులు.

గీతల ముగ్గులు ఎక్కువగా అడ్డం, నిలువు గీతలతో మధ్య మధ్యన వంపులు తిరిగి వివిధ రూపాలను పొందుతుంటాయి.



చుక్కల ముగ్గులు : చూపుడు, బొటన వ్రేళ్ళతో సన్నటి, చిన్నటి చుక్కలను పెట్టి వాటిని కలుపుతూ అనేక ఆకారాలను రూపొందించెడి ముగ్గులను చుక్కల ముగ్గులంటారు. చుక్కల ముగ్గులో రెండు విధానాలున్నాయి. 1. ముత్యాల ముగ్గులు 2. రత్నాల ముగ్గులు చుక్కల చుట్టూరా ముత్యాలవలె రూపు దిద్దుకునే ముగ్గులను ముత్యాల ముగ్గులని పేర్కొనవచ్చును. ముత్యాల ముగ్గుల మధ్యన చుక్కలు కన్పిస్తుంటాయి. ఈ ముగ్గులు ముత్యాలహారానికి గ్రుచ్చిన ముత్యాల వలె ఒప్పారుతుంటాయి. బహు ముఖాలతో, వివిధ కోణాలతో కన్పించే ముగ్గులు రత్నాల ముగ్గులు. ఈ ముగ్గుల్లో చుక్కలు స్పష్టంగా కాన్పించవు. రేఖాగణితం ప్రకారంగా గీతలన్నీ గీచినట్లుగా గోచరిస్తాయి. రత్నాల కోణాల వలె ముగ్గుల్లోని కోణాలు మన చూపులను ఆకట్టుకుంటాయి కాబట్టి వీటిని రత్నాల ముగ్గులని అంటారు.

48472



ముత్యాల ముగ్గులు



రత్నాల ముగ్గు



కొన్ని చుక్కల ముగ్గుల్లో చుక్కలను సంఖ్యా ప్రకారంగా ఒకదానిపై మరొక దాన్ని పెడ్తారు. మరికొన్నింటిలో రెండు చుక్కల మధ్యన రెండవ వరుసలో చుక్కలను పెట్టుకుంటూ పోతారు. కొన్ని ముగ్గుల్లో ఒక్కొక్క వరుసలో రెండు వైపుల ఒక్కొక్క చుక్కను తగ్గిస్తుంటారు. వేయబోయే చిత్ర రూపాలననుసరించి చుక్కలను పెంచుతుంటారు, తగ్గిస్తుంటారు. మూడు చుక్కల ముగ్గును ముప్పై విధాలుగా వేసే నేర్పరులు మన మగువలు.





చుక్కలన్నింటినీ సమానదూరంలో, ఒకే పరిమాణంలో పెట్టడంలోనే స్త్రీల ప్రజ్ఞ ప్రస్ఫుటమవుతుంది. చుక్కల సంఖ్య

ముగ్గుల రూపాలూ, మగువల మనోఫలకంపైన చిత్రింపబడి ఉంటాయి. సమయ సందర్భాలననుసరించి, తమ ఇచ్ఛననుసరించి, చుక్కల సంఖ్యను, ముగ్గుల రూపాలను స్మరణకు తెచ్చుకొని వాకిళ్ళలో తీర్చిదిద్దుకుంటారు. ఈ రోజుల్లో అక్షరజ్ఞానులైతే పుస్తకాల్లో వేసుకుంటారు.

చుక్కల ముగ్గులను అగ్రవర్ణ స్త్రీలు అధికంగా వేస్తుంటారు. శ్రామిక స్త్రీలు గీతల ముగ్గులనెక్కువగా వేస్తుంటారు. కారణం చుక్కల ముగ్గుకు సమయం ఎక్కువగా వెచ్చించవలసి ఉంటుంది. అందుకే వారు " చుక్కల ముగ్గును వేయడానికి మాకు తీరుబడి ఉండదు ఏదో ఒక గీత గీస్తాం" అంటారు.

మామూలు రోజుల్లో వాకిట్లో చిన్న ముగ్గును వేసి చుట్టూరా నాలుగు వైపుల అంచుల ముగ్గులను వేస్తుంటారు. ఈ అంచుల ముగ్గులు గీతల్లోనూ చుక్కల్లోనూ ఉంటాయి. ఈ అంచు ముగ్గులతో వాకిలి నిండుగా కనపడుతుంది. మధ్యలోని చిన్న ముగ్గుకు కూడ సమగ్రత, సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. పండుగల్లో వాకిలి మధ్యన కానీ, ద్వారం ముందుకానీ పెద్ద ముగ్గులను వేసి చుట్టూరా చిన్న ముగ్గులను చిత్రించి వాకిలిని నింపివేస్తారు. ఈ ముగ్గులు గురువు చుట్టూరా ఆసీనులైన శిష్యుల మాదిరిగా గోచరిస్తాయి.

ధనుర్మాసం మగువలకు కళారాధనా మాసం. ఈ మాసాంతం వరకు వారు తమకు వచ్చిన ముగ్గులన్నింటినీ అందంగా వాకిట్లో తీర్చిదిద్దుతారు. ఇంటి ముంగిట ముగ్గులు, ఇల్లాలు ఇంటిలో వస్తువులను క్రమంగా, అందంగా అమర్చుకున్నట్లుగా అలరారుతుంటాయి. వాకిలి వైశాల్యాన్ని బట్టి చిన్న ముగ్గును పెద్దదిగా పెంచుతారు, పెద్ద ముగ్గును చిన్నగా వేస్తారు. సమయాన్ని

బట్టి, సందర్భాన్ని బట్టి ఎదుటివారి మనస్తత్వాన్ని బట్టి ప్రవర్తించాలనేడి ప్రేం సర్దుబాటు స్వభావాలు ముగ్గుల చిత్రీకరణలో కూడ ప్రతిబింబిస్తున్నాయి.

ఈ యాంత్రికయుగంలో ముగ్గులను వేయడానికి ముగ్గు గొట్టాలను కనిపెట్టారు. ఉపయోగిస్తున్నారు. ముగ్గును వేయలేని వారికి, సహనం లేనివారికి, సమయంలేని వారికి ఇవి ప్రయోజనకరాలు. వెదురు గొట్టాలకు గానీ, రేకు గొట్టాలకు గానీ, రంధ్రాలు చేస్తారు. ఒకవైపు పూర్తిగా మూసి వేస్తారు మరొక వైపు తీయడానికి, పెట్టడానికి మూత ఉంటుంది గొట్టాన్ని పట్టుకోవడానికి వీలుగా handle ఉంటుంది. ముగ్గుపొడిని గొట్టం లోపల నింపి నేలపైన తమ కిష్టమైన నమూనాలో తిప్పుతుంటే, అర నిమిషంలో అద్భుతమైన ముగ్గులు ఏర్పడుతాయి. ఈ గొట్టాలను ముగ్గు కర్రలు, చిగురు గొట్టాలు, ముగ్గు గొట్టాలు, చిగురు కర్రలు అని అంటారు. ఆదిలాబాదు జిల్లాలో పొడుగ్గా, చిన్నగా ఉన్న తోలుసంచికి వివిధ నమూనాల్లో రంధ్రాలను చేస్తారు. వాటిలో ముగ్గు పొడిని నింపి గోడల క్రింది భాగాన కొడుతుంటారు. గోడలపైన వివిధ నమూనాలతో రూపాలు ఏర్పడి కంటికింపుగా ఉంటాయి.

ముగ్గుల్లో మూడవ విభాగం రంగవల్లులు. రంగులతో రూపొందేది కాబట్టి ముగ్గు రంగవల్లి అనే నామాన్ని దాల్చింది. వీటిలో రంగు పొడులను వాడుతారు. పూజా మందిరంలో వ్రత సమయాల్లో కలశం, ప్రతిమ, చిత్రపటం క్రింద బియ్యం పిండితో ముగ్గును చిత్రించి మధ్యలో పసుపు, కుంకుమ, బియ్యంపిండి, ఎండిన ఆకుల పొడిని నింపుతారు. వ్రత సమయాల్లో ప్రప్రథమం 'రంగవల్యాభిరలంకృత్య' అని పఠిస్తారు. రంగులు లేకున్నూ కొంతమంది ముగ్గులను రంగవల్లులుగా పేర్కొంటారు. రంగవల్లి

అంటే రంగులతో తీర్చిదిద్దిన లతలు, అందమైన లతలు అనే అర్థాలు ఉన్నాయి. రంగావళి అంటే రంగుల సమూహం. రంగవల్లియే రంగోలిగా మారి ఉండవచ్చు. "రంగోలి" పదంలోని రంగ అంటే భగవంతుడనీ, ఒలి అంటే ఆనందపరచు, అనుగ్రహపరచు అనే అర్థాలున్నాయి.[22] భగవంతుని అనుగ్రహం కొరకు, ఆనందం కొరకు రూపొందిన కళ ముగ్గుల చిత్రీకరణ. స్త్రీల దృష్టిలో కళారాధనయే భగవదారాధన. ప్రాచీన కావ్యాల్లో, సాహిత్యంలో రంగవల్లుల ప్రస్తావన అధికంగా ఉంది. కాని నేడు తెలుగు వారు ముగ్గులనే వ్యవహరిస్తారు.

ఈ విధంగా తెలుగు స్త్రీలు, చిత్రకారుని కుంచె మాదిరిగా చేతివ్రేళ్లను కదిలిస్తూ తమ కళానైపుణ్యానికి ప్రతిబింబాలుగా గీతలలోనైనా, చుక్కలలోనైనా, రంగుల పొడులతో ముగ్గు చిత్రాలను చిత్రిస్తుంటారు.

సాహిత్యంలో ముగ్గులు : పండితుల కంటె ప్రాచీన చరిత్ర కలది జానపద విజ్ఞానం. అందుకే జానపద విజ్ఞానాంశాలు ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకూ ప్రతిబింబిస్తున్నాయి. నాటి నన్నెచోడుని కాలంనుండి నేటి ఆధునిక కవిత్వం వరకూ మగువలు వేసే ముగ్గులు మనతో ముచ్చట్లు పెడుతూనే ఉన్నాయి.

"ముక్తాఫలంబుల ముగ్గులెట్టు" -కుమార సంభవం
3-106

చిత్ర వర్ణాతిశయ మాత్మ రత్న చిత్రి
తాంగ రంగవల్లి మరంగాంగణముల
గలిగి విశ్వంబునకు తన వెలుగు వెలుగ
సేయు దేజోమయంబగు శివపురంబు

కుమార సంభవం - 7- 154

మాత్మ రత్న చిత్రితాంగ రంగవల్లితో వెలిగే శివపురం జగతికే వెలుగు.

ఆంధ్ర మహాభారతంలో నన్నయ, ఆదిపర్వంలో పాండవులు జననీ సహితంగా వారణావతంబు జేరునప్పుడు పౌరులు -

"అంగళుల నొప్పె గర్పూర రంగవల్లు
లంగనలు గయివేసి యుత్తుంగ హర్మ్య
తలములెక్కిరి తత్పురీ విలసనంబు
జూచు పాండుకుమారుల జూచువేడ్క-ఆదిపర్వం -6-149

అని వర్ణించినారు. ఆముక్తమాల్యద కర్త కూడ రంగవల్లుల ప్రస్తావనను (1-55) ప్రస్తావించినాడు. వైజయంతీ విలాసంకర్త 2 అ-112 పద్యంలో రంగవల్లిని వర్ణించినాడు. యయాతి చరిత్రకారుడు "ముగ్గులు పువ్వులకు విండుతెలివి వింప" అని, సహజ పుష్ప సౌందర్యానికే ముగ్గులు విండుదనాన్ని చేకూర్చినాయి అని రమణీయంగా వర్ణించినాడు. (యయాతి చరిత్ర -2-49) సంస్కృత కావ్యాల్లో కూడ రంగవల్లులలోని పుష్పసౌందర్యానికి ఆకర్షింపబడ్డ భ్రమరాలు అవి వాస్తవాలని భ్రమించి రంగవల్లులపై వ్రాలినవనే వర్ణనలున్నాయి.

క్రీడాభిరామంలో -

చందనంబున గలయంపి చల్లినారు
ముగ్గులిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినారింద్రు రజమున రంగవల్లి
కంజముల దోరంబులు గట్టినారు - మాచల్దేవి చిత్రశాల వైభవ వర్ణన ఇది. ఆమె చిత్రశాల కాశ్మీర ముగ్గులతో, ఇందురజంతో వేసిన రంగవల్లితో విరాజిల్లింది.

శ్రీనాథుని చేత పెనుపండుగగా పేర్కొనబడిన సంక్రాంతికి బాలికలు ముగ్గులను వేసి గొబ్బెమ్మలను నిలిపి పాటలు పాడుతూ, చుట్టూ తిరుగుతుంటారు. ఈ ఆటను, పాటను గొబ్బిళ్ళు, గొబ్బి

పదాలుగా పిలుస్తారు. గొబ్బి దేవతను, గోమయంతో అలికి పెట్టిన ముగ్గుపైనవే ప్రతిష్ఠించాలనే నియమం ఉంది. కావ్యాల్లోని గొబ్బి ప్రస్తావనతో పాటు ఆ కాలంలో ముగ్గుల చిత్రీకరణ కూడ ఉండి ఉంటుందని ఊహించవచ్చు. గొబ్బిళ్ళ ప్రస్తావన భాగవతంలోనూ, విష్ణుపురాణంలోనూ, శుక సప్తతి, హంసవింశతి లోనూ కనపడుతుంది.

కొంకుల్ పాచ్చి కలంచుచున్ గిరులపై
గొబ్బిళ్ల గోరాడుచున్ . . - భాగవతం -8-35

కుప్పిగంతులు పిడి గ్రుద్దులాటలు
పిల్లదేవులు గొబ్బిళ్ల గూనలాలు-విష్ణుపురాణం -7- 202

శిశుకు సందములు గొబ్బిళ్ళ పాటలు కొప్పు
సవరించు నేర్పు చేసన్నవగలు- శుకసప్తతి - 2-434

గొట దొర్లుడు కాయ గొబ్బిళ్ల మోపిళ్ల
నీగ పోగిన బంతి దూకులాట -హంసవింశతి - 3-147

పాల్కురికి సోమనాధుని బసవ పురాణమందు గొబ్బి పదాల ప్రస్తావన ఉంది.

"మదిమబ్బి సంహార మాయాస్తవంబు, పదములు తుమ్మెద పదముల్ ప్రభాత పదములు పర్వత పదములానంద పదములు శంకర పదములు నివాళి. పదములు వాలేశు పదములు గొబ్బి పదములు వెన్నెల పదములు " -

శుక సప్తతిలో కదరీ పతి "అలికి ముగ్గులు పెట్టినట్ట తిన్నెలను పేర్కొన్నాడు. పదకర్తల శృంగార సంకీర్తనల్లో ముగ్గుల ప్రస్తావన ఉంది.

"పెక్కుటిల్లు నవ్వులనే పెట్టె ముగ్గులు
యెక్కడ వరాకు నీకు యిక జూడరాదా
దగ్గరికి యిద్దరము కరవాయి వచ్చిగాక
యెగ్గులు నెమ్ములు బట్టనేవే నాకు
బగ్గన శ్రీ వేంకటాద్రిపతి నన్ను గూడెనిక
ముగ్గ పిండి అట్లుకు మొదలయ్యీనా"
"ముగ్గులుపెట్టు"—

ప్రాచీన కవులనే గాక ఆధునిక కవులను కూడ ఆకర్షించిన రంగవల్లులు కవిత్వంలో చోటు చేసుకున్నాయి. అభినవ తిక్కన శ్రీ తుమ్మల సీతారామ మూర్తి చౌదరి గారు ఆంధ్ర జాతీయతా ప్రాశస్త్యాన్ని గూర్చి వర్ణిస్తూ, తెలుగునారీ కళాధీన బుద్ధిని ప్రశంసించినారు.

"ఆంధ్ర జాతీయ శౌర్యాభిలిప్త
ఈ రంగవల్లికలేమి తెల్పెడినయా
తెలుగునారీ కళాధీన బుద్ధి
- - - - - - - - - - - - -
మారు వడ్డించెడి మరదలి కెంగేలు
పిసికి వలదనె వొక్క పెంకె బావ
వంగి ముగ్గులు దిద్దు వధువుపై" -

ఆధునిక ఆంధ్ర కవితాయుగ ప్రఖ్యాతుడు శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు సంక్రాంతి సంబరాన్ని వర్ణిస్తూ ముగ్గుల అరుగుల అందాలను అభివర్ణించారు.

"బాజా దులిపిన పూరియిండ్లను
వెల్ల వేసిన వీధిగోడలు
అలికి ముగ్గులనిడిన యరుగులు

ఆందగించెను పల్లెలన్ - మిశ్రమంజరి

పల్లె పదాలకు కావ్య రూపాన్ని కల్పించిన శ్రీనాథ మహాకవి పల్నాటి వీర చరిత్రలో

"కస్తూరి చేతను కలయంగనలికి
ముత్యాల తోడత ముగ్గులు బెట్టి
కర్పూరముదకంబు కలిపిముందటన్

ఈ వర్ణన ఆనాటి పలనాటి కొలువునూ, ప్రజల జీవిత వైభవాలనూ ప్రతిబింబిస్తుంది. ఆనాడు కర్పూరముదకంబు చల్లి, కస్తూరి చేత అలికి, ముత్యాలతో ముగ్గులను దిద్దేడివారు. కస్తూరితో, ముత్యాలతో వాకిలిని పరిమళ భరితం చేయడం, అలంకరించడం జానపద కథాగేయాల్లో కూడా గోచరిస్తుంది. "గుహభరతుల అగ్ని ప్రవేశం" లో శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చే సందర్భంలో పౌరులు,

కస్తూరి దెప్పించి కలయంగ కలిపి
కస్తూరి చిలికించి ప్రాంగణములెల్ల
కర్పూర ఖండాలు కలియ ముత్యాలు
ముగ్గులొప్పగ బెట్రి ముంగిళ్లలోనూ
- - - - ---
అజగజతురగములు రాజహంసలను
రతిమల్లె తీగెలూ రంగవల్లులనూ -

మిథిలా నగరాధీశుడు జనకుడు తన కూతురు జానకి చేత ముగ్గులను వేయించేవాడట.

సంతాన పరుడమ్మ జనకమహాముని తా
ముద్దుకూతురిని తాజేరబిలిచి

ఆవుపేడాదెచ్చి అయినిళ్లు అలికి
గోవుపేడా దెచ్చి గోపురాలలికి
ముత్యాలు చెడగొట్టి ముగ్గు వేయించి
పగడాలు చెడగొట్టి పట్టలేయించే -

జనక మహారాజు, బాధ్యతాయుతమైన తండ్రి వలె కూతురుకి అలికి, ముగ్గులు వేయమని బోధించి, వేయించినాడు. జానపద సాహిత్యంలోకి అడుగిడిన రాజులు, రాణులు కూడ జానపదుల ప్రవర్తనలనే అలవర్చుకుంటారు.

మురిపెంతో వేసిన అందమైన ముగ్గు ఇంటికి, ఇల్లాలికి అందం, ఆభరణం.

ఇల్లు చూడు ఇల్లందం చూడు
ఇంటిలోని ఇల్లాలిని చూడు
ముగ్గు చూడు ముగ్గందం చూడు
ముగ్గులో ఉన్న మురిపెం చూడు -

ఇంటి ముంగిటనే గాక, తులసి బృందావనం ముందు కూడ ముగ్గు పెట్టితే పాపాలు తొలుగుతాయని పెద్దల అభిప్రాయం, శాసనం.

వేమారు ఉదయమున గోమయమును గొంపోయి
ప్రేమతో తులసి ముందర అలికి
రమణీయముగా ముగ్గులిడిన
రమణుల పాపములు తూలగొట్టు -" స్త్రీల పాటలు "

" సూర్యోదయంబందు గోమయందెచ్చి అలికిన అత్యంత పాపములు పోవు ముగ్గున పద్మములు పెట్టెరెవరయినా మూడు

లోకంబుల ముక్తులై ఉంద్రు పద్మాన పంచవన్నెల గూర్చిరెవరయిన లెక్కలేని పుణ్యఫలమనుభవింత్రు" -"చిలుక ముగ్గుల పాట"

పద్యాల నుండి, పదాల నుండి ముగ్గులు సామెతల్లోకి కూడ ప్రవేశించాయి.

ఇంటి లక్ష్మిని వాకిలి చెబుతుంది"
ముగ్గులేనింటి ముందు బిచ్చగత్తె కూడ నిలువదు"
"ముగ్గు ఒలికినా అందమే "
"ముగ్గులు పెట్టలేరు కానీ వంకలు పెట్టగలరు "
"ముగ్గులో లేకుండా పోయాడు"
"ముగ్గు బుట్ట" - నెరసిన తలకు ఈ సామెతను వాడుతారు.
ముగ్గు పొడుపు కథల్లో కూడ పొడిచింది.
"అర్రవై కొమ్మల వటావృక్షం పడితే లేవదు" -పెద్దముగ్గు.

ముగ్గు పుట్టుక గురించి జానపద సాహిత్యంలో ఒక పురాణ గాథ ఉంది. అతి ప్రాచీన కాలంలో ఆకాశం భూమిపైన ఉన్నవారి చేతికి అందేటట్టు క్రిందికి వంగి ఉండేది. ఒక ముసలమ్మ తన ఇంటి ముందు అలికి ముగ్గులు పెట్టి లేవబోవగా, వంగిన ఆకాశం తలకు తగిలి గాయమౌతుంది. ఆమె కోపంతో చేతిలోని చీపురుతో కొట్టగా ముసలమ్మ, ఆమె పిల్లలు, ఇల్లు, వాకిలితో ఆకాశం అందరాని ఎత్తుకు ఎగిరిపోయింది. పిల్లలు, సూర్యచంద్రులైనారు, వాకిట్లోని ముగ్గులు చుక్కలైనాయి. ముసలమ్మ ఆకాశంలో చెట్టు క్రింద దిగాలుపడి కూర్చుండి పోయింది.[28]

రంగవల్లి శుభసూచకం. దురదృష్టాన్ని తొలగించి అదృష్టాన్ని తెస్తుందనే విశ్వాసం భారత మహిళల్లో ఉంది. ఈ విశ్వాసాలను నిరూపించే కథలను కూడ వారు చెప్పుతుంటారు. పూర్వకాలంలో

ఒక గృహస్థు ప్రతిమాసం మొదటిరోజు సూర్యదేవాలయం ముందు శుభ్రపరచి భార్యతో సహా రంగోలిని వేస్తుండేవాడు. మరుజన్మలో వారే సత్రాజిత్తు దంపతులుగా జన్మించారు. సోమవతి అనే స్త్రీ కష్టాలకడలిలో మునిగిపోయి, ఇరుగు పొరుగువారి సలహాననుసరించి ప్రతిరోజు దేవుని విగ్రహం ముందు రంగోలిని వేసి దేవుణ్ణి పూజించేది. కొన్ని రోజులకు ఆమె కష్టాలు కడతేరి శేషజీవితాన్ని సుఖంగా గడిపింది.

రమణీమణుల కోరికలను రంగవల్లులు తీరుస్తాయనే కథ ఒకటి ప్రచారంలో ఉంది. ఒక బీద వృద్ధురాలికి భగవంతునికి పళ్లను, కూరగాయలను నైవేద్యంగా అర్పించాలనే కోరిక ఉండేది. కోరిక తీరడానికి దారిద్ర్యం అడ్డుగా ఉండేది. అయినా ఆమె ప్రతిరోజు భగవంతుని ఆలయం ముందు పళ్ళను, రకరకాల పిండి వంటలను రంగవల్లుల్లో చిత్రించి తృప్తి చెందేది. భగవంతుడు ఆమె రంగవల్లుల చిత్రీకరణకు సంతసించి, సాక్షాత్కరించి ఆశీర్వదించి అనంతసంపదను ప్రసాదించాడు.

ముగ్గుల చిత్రీకరణ ఏకాగ్రతను కలిగిస్తుంది. ప్రశాంతతను చేకూరుస్తుంది. ఈ అంశాన్ని ఆధారం చేసుకొని కథలు కల్పితమైనాయి. శ్రీకృష్ణుడు వ్రేపల్లెను వదలి మధురకు వెళ్ళిపోయిన తర్వాత గోపికలు రంగవల్లులను చిత్రిస్తూ విరహతాపాన్ని తగ్గించుకొని మనస్సును శాంతిపర్చుకున్నారని ఒక కథ ఉంది.

అతిథులనాహ్వానించడానికి కూడ ఇంటి ముంగిట రంగవల్లులను తీర్చిదిద్దడం మన ప్రాచీన సంప్రదాయం. మహాభారతంలో విదురుడు శ్రీకృష్ణుణ్ణి ఇంటికి ఆహ్వానించి ముంగిట్లో రంగురంగుల రాళ్ళను పొడిచేసి రంగవల్లులను తీర్చిదిద్దినాడు. నేటికి ఉత్తర కర్ణాటకలోని కొన్ని గ్రామాల్లో పండుగ సందర్భాల్లో బియ్యంపిండి ద్రవంలోకానీ,

జాజాలో కానీ, చేతిపిడికిలిని ముంచి వాకిలి నుండి ద్వారం వద్దకు వేలి చివరి ముద్రలను నేలపైన ముద్రిస్తారు. పాండవులను ఆహ్వానించడానికి ఈ ముద్రలను ముగ్గులుగా వేసే ఆచారం ఉంది.

రండోయి పాండవులార బోంచేయరండో
అలుకులు లేని ఇంటికాడ మేమొల్లమయ్య
ముగ్గులులేని ఇంటికాడ మేమొల్లమయ్య

ఈ తెలుగు గిరిజన గేయంలో పాండవులు అలికి ముగ్గుపెట్టిన ఇంటి ఆతిథ్యాన్ని కోరుతున్నారు. ఈ విధంగా ప్రాచీన కాలంనుండీ నేటివరకు సాహిత్య ప్రక్రియ అన్నింటిలోనూ ముగ్గు సౌందర్యం, శోభిల్లుతునే ఉన్నది. ముగ్గుకు సంబంధించిన విశ్వాసాలకు కథలు, ఆధారమౌతున్నాయి.

వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాల్లోని ముగ్గులు

మన దేశంలో వివిధ ప్రాంతాల్లోని ప్రమదలు అతి ప్రాచీనకాలం నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలనూ, మతభావాలనూ, ముగ్గుల్లో ప్రతిబింబింప చేస్తూ వదిలపరుస్తున్నారు.

అన్ని ప్రాంతాల్లోనూ ముగ్గుల్లో అనేక రకాల చిత్రాలను మలచెడి వారు మగువలే. వీరి ప్రధాన ధ్యేయం ఇంటిని, పూజా ప్రదేశాలను పరిశుభ్రంగా శోభాయమానంగా సింగారించడానికి అందమైన ముగ్గులను వేయడం.

వివిధ ప్రాంతాల్లో ముగ్గులను వేసే విధానాల్లో, ఆచారాల్లో , ఆకారాల్లో స్వల్పవైవిధ్యం గోచరించినమా, వాటి మూలాంశాల్లో (Motifs) సంకేతాల్లో సామ్యం కన్పిస్తుంది. మామూలు సమయాల్లో మహిళలు తమకిష్టమైన ముగ్గులను స్వేచ్ఛగా చిత్రించినమా పండుగల్లో, ఉత్సవాల్లో, శుభకార్య సందర్భాల్లో సంప్రదాయపరంగా వస్తున్న ప్రత్యేకమైన ముగ్గులనే చిత్రిస్తుంటారు. వీరు పండుగల్లో పూజింపబడే దేవతల ప్రతీకలను, శుభకార్యాలను సూచించే సూచికలను ముగ్గుల్లో వేస్తుంటారు.

భారత దేశంలోని అనేక ప్రాంతాల్లోని వడతులు వేసే ముగ్గుల అంతర్యాన్ని పరిశీలిస్తే భాషల్లో, వృత్తుల్లో, అంతస్థుల్లో భిన్నత్వం గోచరిస్తున్నా, హిందూ సంస్కృతిలో అంతర్లీనంగా ఏకత్వం ఉందని బుజువవుతుంది.

తెలుగువారి ఆచారవ్యవహారాల్లోని ముగ్గులు

తెలుగు దేశ ప్రాంతాన్ని మహారాష్ట్ర, తమిళ, కర్ణాటక, ఒరిస్సా ప్రాంతాలు చుట్టుకొని ఉన్నాయి. ఈ ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలన్నీ పరస్పర ప్రభావితాలు. తెలుగువారి ముగ్గుల్లో పరిసర రాష్ట్రాల్లోని ముగ్గుల నమూనాలు ద్యోతకమవుతాయి.

తెలుగుదేశంలో ప్రతి పల్లెలో ప్రతిదినం సూర్యోదయాస్తమయ సమయాల్లో గృహ ప్రాంగణాలు రమణీమణుల రంగవల్లులతో అలరారుతుంటాయి. ఉదయం పేడనీటిని చల్లి ముగ్గులు వేస్తారు. సాయంత్రం నీటిని మాత్రం చల్లి ముగ్గులను చిత్రిస్తుంటారు. ప్రభాత వేళలో ప్రభవించిన భానుడు క్రమక్రమంగా నభోమండలం పైకి అధిరోహిస్తాడు. అందుకే అతివలు ప్రత్యూషకు ముందే ద్వారం ముందు పొడవైన పెద్ద ముగ్గులతో వాకిలిని తీర్చిదిద్దుతారు. సాయంకాల సంధ్యాసమయంలో సూర్యాస్తమయానికి సూచనగా చిన్న ముగ్గులను కానీ ,వలయాకారపు ముగ్గులను కానీ వేస్తుంటారు. అనంతపురం మండలంలో ప్రొద్దు పొడవక పూర్వం పొడవైన ముగ్గులను వేసి సాయంకాలం అడ్డంగా చిన్నగా ఉండే ముగ్గులను చిత్రిస్తుంటారు. పరిశుభ్రమైన వాకిలిలో స్వాగతమార్గాలైన పొడవైన, పెద్ద ముగ్గులతో ఆకర్షితమైన లక్ష్మీదేవి గృహప్రవేశం చేస్తుంది. తిరిగి లక్ష్మీదేవి ఇంటిని విడిచిపెట్టకూడదని అడ్డుగా అడ్డంగా ముగ్గులను వేస్తారు.[24] బందరు ప్రాంతంలో ప్రతి సాయంత్రం పల్లె పడతులు చంద్రరేఖను చిత్రిస్తారు. సూర్యాస్తమయం తర్వాత వెలుతురును ప్రసరించేవాడు చలువరేడు కాబట్టి కృతజ్ఞతా భావంతో అతని ప్రతీకను చిత్రించడం భావ్యం అని పల్లె స్త్రీల అభిప్రాయం.[25]

నెలపొడుపునాడు చంద్రరేఖను చిత్రించి మధ్యలో చుక్కనుకానీ, నక్షత్రాన్ని కానీ లిఖిస్తారు. చంద్రకళల అభివృద్ధిని ముగ్గుల్లో సూచిస్తారు. పాడ్యమి నుండి చంద్రుని తరుగుదలను ముగ్గుల్లోనే ప్రతిబింబింపజేసి, అమావాస్యనాడు సోముణ్ణి చిత్రించకుండ నక్షత్రాన్ని వేస్తారు.

వాకిట్లో సున్నం పొడితో ముగ్గు వేసిననూ పండుగ సమయాల్లో పూజా మందిరాల్లో బియ్యంపిండితోనే వేస్తుంటారు పూజా మందిరాల్లో దేవుని పటంముందు బియ్యం పిండినే ఉపయోగిస్తారు. పూజామందిరాల్లో పద్మం అనేక దళాల్లో రూపాల్లో సాక్షాత్కరిస్తుంది. కమలరూపం ముగ్గుల్లో ఉండవచ్చు కానీ, పద్మపు ముగ్గు మాత్రం పూజామందిరం, పవిత్ర స్థలాల్లోనే వేయాలి, దీన్ని వాకిట్లో అందరూ నడిచే ప్రదేశాల్లో వేయకూడదనే నిషేధం ఉంది.[28] జానపద పడతులకు పద్మం పవిత్రమైంది. అందుకే పంచదళ, షట్ దళ, ద్వాదశ, షోడశ దళ పద్మాలను పూజాగదిలో దేవుని విగ్రహం ముందు ముగ్గుల్లో చిత్రిస్తుంటారు.

అష్టదళపద్మం, షట్‌దళపద్మం, షోడశదళపద్మం.



పంచదళపద్మం, ద్వాదశదళపద్మం.

ఈ రాజీవం రేకుల మధ్య పసుపును, కుంకుమను, తెల్లటి వరిపిండిని, ఎండిన పచ్చటి ఆకులపొడిని నింపి రమణీయంగా రూపొందిస్తారు.

మన దేశంలో పురుషులు పుణ్య తీర్థాలను సందర్శిస్తూ, వేదపురాణాలను పఠిస్తూ, మునిపుంగవుల ముక్తి బోధలను వింటూ, వానప్రస్థాశ్రమం, సన్యాస ఆశ్రమాల ద్వారా మోక్షమార్గాలను వెదుక్కుంటారు. స్త్రీలు మాత్రం గృహస్థాశ్రమం లోనే సాహిత్యం, సంగీతం, చిత్రకళల్లో భగవద్భక్తిని కీర్తిస్తూ, శక్తి ప్రతీకలను చిత్రిస్తూ మోక్షప్రాప్తికి పాటుపడుతుంటారు. వనితలు వారంలోని ప్రతిదినం ప్రత్యేకంగా ఒక భగవంతునికి గానీ దేవతకు గానీ అర్పిస్తారు. ఒక్కో రోజు ఒక్కో దేవతను పూజించి ఒక్కో విధమైన ముగ్గును వేసి, ఉపవసించి, పరితృప్తిని పొందుతారు. పూజలు, ఉపవాస నియమాలు, ముగ్గులు మహిళల మానసిక, శారీరక ఆరోగ్యాలనే గాక చిత్రకళా విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

తెలుగు స్త్రీలు సోమవారం శ్రీకంఠుణ్ణి, మంగళవారం మంగళగౌరీదేవిని లేదా ఆంజనేయ స్వామిని, బుధవారం శ్రీరాముణ్ణి, గురువారం రాఘవేంద్రస్వామిని లేదా సాయిబాబాను, శనివారం వేంకటేశ్వరస్వామి లేదా శనీశ్వరుణ్ణి, ఆదివారం ఆదిత్యుణ్ణి లేదా సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధిస్తుంటారు. ఆయావారాలకు ఆయా దేవతల కొన్ని ప్రతీకలను పూజాగదుల్లోని ముగ్గుల్లో అలరింపచేస్తుంటారు. సోమవారం శివపీఠం, మంగళవారం కాళీపీఠం, బుధవారం స్వస్తిక్, గురువారం నక్షత్రం, శుక్రవారం లేదా లక్ష్మీవారం కమలం, హృదయకమలం, శనివారం తార, ఆదివారం రెండు త్రికోణాలను ముగ్గులుగా పూజామందిరాల్లో చిత్రిస్తుంటారు.[27]

సోమవారం, మంగళవారం, బుధవారం, గురువారం,





లక్ష్మీవారం, శనివారం, ఆదివారం.

ఆదివారం, సోమవారం, మంగళవారం, బుధవారం



మరికొంతమంది క్రింది విధంగా వివిధ వారపు దినాల్లో వివిధ ముగ్గులను వేస్తుంటారు.

గురువారం, శుక్రవారం, శనివారం



వెనుకటి రోజుల్లో మగవారు ప్రాతఃకాలమే స్నానంచేసి పూజామందిరం లోనికి వచ్చి ముగ్గును చూసి వారాన్ని తెలుసుకుంటుండేవారు. మారుమూల గ్రామాల్లో తప్ప ఈ రోజుల్లో ముగ్గులు క్రమంగా అంతరించిపోవడం వల్ల క్యాలెండరును చూసి వారాన్ని గుర్తిస్తున్నారు.

దేవుని పీటముందు విష్ణుపాదాలు, శంఖచక్రాలు, గుర్తులను ముగ్గుల్లో వేస్తుంటారు.[30] ఇవి గీతల్లోనే రూపుదిద్దుకునే రేఖాచిత్రాలు.



విష్ణుపాదాలు, చక్రాలు, శంఖాలు, గోపాదాలు

జానపద వనితలు జగద్రక్షకుడైన విష్ణుభగవానుని పాదాల వరుసనే పాడినీ, పశుసంపదనూ ప్రసాదించే గృహరక్షకురాలైన గోమాత పాదాలను కూడా చిత్రిస్తుంటారు.

తెలుగు స్త్రీలకు పూజా మందిరం తర్వాత పవిత్రమైంది పెరట్లోని తులసీ బృందావనం. "అలికిపెట్టిన ఇల్లు, పెరటి తోటలోని తులసికోట, ప్రమిదదీపం" ఈ మూడు మగువలకు మంగళప్రదాలు. ప్రతిరోజూ తులసి చెట్టు దగ్గర శుభ్రపరచి ముగ్గు వేస్తుంటారు. తులసిని పూజించి ప్రదక్షిణాలు తిరుగుతుంటారు.

పల్లెల్లో తులసి కోట చుట్టూర ఎర్రమట్టితో కొంతమేర అలికి దానిపైన అంచుల ముగ్గును వేస్తుంటారు. కొందరు నాలుగు గీతలను వరుసగా గీచి ఒక వలయం వేసి మళ్ళీ నాలుగు గీతలను గీస్తుంటారు.

పచ్చటి తులసి చెట్టు చుట్టూరా ఎర్రటిమట్టి, తెల్లటి ముగ్గు కన్నులకొక రమణీయ దృశ్యం.

తులసి చెట్టు గాలి, ఆకు, వేరు ఉత్తమ ఓషధీగుణాలను కల్గి ఉన్నాయి. అందువల్లనే ఈ చెట్టు కన్యలకు ఐదువలకు, విధవలకు పూజార్హమైంది. తులసిచెట్టు ముందు ముగ్గు వేయడం , ప్రదక్షిణాలు చేయడం ఆరోగ్యాన్ని ఆధారంగా చేసుకొని ఆవిర్భవించిన ఆచారం.

ప్రతిరోజూ సామాన్యమైన ముగ్గులను వేసినా, శుక్రవారం మాత్రం తులసిచెట్టు ముందు సూర్య పద్మాన్ని చిత్రిస్తారు. పద్మాన్ని బియ్యం పిండితో వేసి వలయంలోని రేకులను పసుపు కుంకుమలతో అలంకరిస్తారు.



కార్తీక పౌర్ణమినాడు జానపద కాంతలు తులసి కోటముగ్గులతో అలంకరించి చుట్టూర దీపాలను వెలిగిస్తారు. తులసికోట ముగ్గును చుక్కలతో గానీ, రేఖలతో గానీ చిత్రిస్తారు





, ఇంటిలోని ధాన్యపుగాదెల చుట్టూర ఎర్రమట్టితో అలికి అలివలు ముగ్గులను పెడుతుంటారు. భోజనాలు చేసే ప్రదేశంలో, చల్లచిలికే ప్రదేశంలో, విసుర్రాయి విసరే దగ్గర, కూరాడి కుండ దగ్గర, మంచినీటి కుండదగ్గర, పొయ్యి గోడల చుట్టూ ఎర్ర మట్టితో అలికి ముగ్గు గీతను గీస్తారు. ఈ ప్రదేశాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండడం ఆరోగ్యకరం. అందుకే అనునిత్యం ఈ స్థలాలను శుభ్రపరచి సూక్ష్మజీవులను నశింపచేసే ముగ్గును వేయడం పల్లెపడతులు ప్రాచీన కాలంనుండి ఆచరిస్తున్న ఆచారం. అందం, ఆరోగ్యం, శుభ్రం - వీటి సమ్మేళనమే ముగ్గు వేసే ఆచారంలోని ఆంతర్యం.

రోజును బట్టి, సమయాన్ని బట్టి, స్థలాన్ని బట్టియే కాకుండా మాసాల ననుసరించి కూడా ప్రత్యేకమైన ముగ్గులను పెట్టుతుంటారు. కార్తీకమాసంలో కృత్తిక పద్మాన్ని ముగ్గులో వేస్తారు. ఏడు చుక్కలునిలువు, ఏడుచుక్కలు అడ్డంగా పెట్టి వేసెడి ఈ ముగ్గు సప్తర్షులకు ప్రతీక ముగ్గు మధ్యన ఉన్న అరవిందం సూర్యునికి సంకేతం. కమలం క్రింది త్రికోణంలోని చిన్న వలయం సప్తర్షుల భార్య కృత్తికాదేవి చిహ్నం.[30]



కృత్తికపద్మం, దీపంముగ్గు

కార్తీకమాసంలోనే శివకేశవాలయంలో తులసికోట దగ్గర దీపారాధన చేయవలెనని కార్తీక పురాణం బోధిస్తుంది. తులసికోట దగ్గర దీపారాధనయేకాక దీపాల ముగ్గులను మహిళలు పెడుతుంటారు. కార్తీక మాసంలోనే స్త్రీలు ఉపవాసముండి చంద్రునిముగ్గు వేసి పాలు పొంగిస్తుంటారు.

ధనుర్మాసంలో గీతల ముగ్గులను వేయాలనే నియమం ఉంది. ఈ మాసంలో వృత్తాకారంలో చుక్కలతో గీతలతో ముగ్గులను వేయడం పల్లెపడుచులకు పరిపాటి.

ప్రాచీనకాలం నుండి ముగ్గులద్వారా పండుగ సందర్భాన్ని సూచించడం మన తెలుగు మహిళల సంప్రదాయం.

నాగపంచమి - ప్రతి వత్సరం శ్రావణ శుద్ధ పంచమి దివసం నాగుల పండుగగా జరుపుతారు. ఈ పండుగ గురించి వ్రతచూడామణిలో "సర్పములను ప్రతి గృహము యొక్క ద్వారముపై గోమయముతో వ్రాసి శ్రావణ శుక్ల పంచమీ దివసమున పూజింపవలెను. చతుర్థినాడుపవాస వ్రతము ఆచరించి పంచమినాడు బంగారుది కాని, వెండిది కాని, కొయ్యదికాని, తుదకు మట్టిది కాని ఒక పంచముఖముల సర్పమును చేయించి, పూజించి బ్రాహ్మణులను తృప్తి పరచవలెను" అని వ్రత విధానం వర్ణింపబడింది. ఆంధ్ర వనితలు నాగుల చిత్రాలను వాకిట్లో

పాము పుట్టదగ్గర, తులసిచెట్టు దగ్గర నాగపంచమిరోజు ముగ్గుల్లో చిత్రిస్తుంటారు. ఆనాడు ఉపవసించి సర్పారాధన కావిస్తారు. వీరు వేసెడి తల్లీపిల్లల పాముల ముగ్గు మహిళల మాతృమమతను ప్రతిబింబింపచేస్తుంది.

పాముముగ్గు, తల్లీపిల్లల పాముముగ్గు

జన్మాష్టమి - శ్రావణ బహుళ అష్టమి శ్రీ కృష్ణపరమాత్మ జన్మదినోత్సవం. భవిష్యత్పురాణంలో శ్రీకృష్ణుని జన్మదినోత్సవాన్ని ప్రతివారు జరపాలనీ, జరుపనివాడు క్రూరరాక్షసుడై జన్మిస్తాడని శాసింపబడింది. కృష్ణాష్టమినాడు ప్రజలు కృష్ణుని ఆరాధించి సాయంకాలం ఆలయవిగ్రహాన్ని ఊరేగిస్తారు. బాలకృష్ణుడు యాదవుల ఇళ్ళలోని పాలుపెరుగు వెన్న దొంగలించిన అల్లరి చేష్టలను స్మరించుకుంటూ, యువకులు వీధుల్లో ఉట్టి కట్టి వాటిని కొడుతుంటారు.

జానపద మాతృమూర్తులు ప్రతి జన్మాష్టమినాడు కృష్ణ పరమాత్మను అడుగులు వేయనేర్చిన పసిబాలునిగానే భావించి, అర్చిస్తారు. వారి మనోభావాలు జన్మాష్టమి నాడు వేసే ముగ్గుల్లో ప్రతిబింబిస్తుంటాయి. కృష్ణాష్టమినాడు బాలకృష్ణుని చిన్ని పాదాలను ముగ్గుల్లో చిత్రిస్తారు. వాకిట్లోనుండి కుడిపాదంతో పరుగుపరుగున ప్రవేశిస్తున్నట్టున్న ముగ్గులోని కృష్ణుని పాదగుర్తులుపూజామందిరంలోని విగ్రహం వద్దకు వచ్చి ఆగిపోతాయి.అచ్చట కృష్ణుడు విగ్రహంలో విలీనమై పోతాడని పవిత్ర నమ్మకం. పాదాల ముగ్గును చూచిన ప్రేక్షకులకు బాలకృష్ణుడు చెంగుచెంగున ఇంట్లోకి ప్రవేశించి తనరూపాన్నే పూజామందిరంలోని చిత్రపటంలోచూచి అచ్చెరువు పొంది ఆగి పోయాడేమో అనే భ్రమ కలుగుతుంది. ఈ పాదాలను వాకిట్లో గానీ, పూజామందిరంలో గానీ త్రొక్కకుండజాగ్రత్తపడతారు.కొందరు పవిత్రాలైన కృష్ణుని

పాదచిహ్నాలను పసిపిల్లలు తొక్కి అపవిత్రం చేస్తారని వాకిట్లో వేయరు.

కృష్ణుని పాదాలు, కృష్ణుని ఊయల



స్త్రీల కల్పనా రమణీయతకు, చిత్రకళాపటిమకు పురాణ పరిజ్ఞానానికి, భక్తితత్పరతకు ఈ చిన్ని పాద చిహ్నాలు చక్కటి ఉదాహరణలు. ముగ్గులు స్త్రీల మనోభావాలకు, విజ్ఞానానికి దర్పణాలు, అందుకే అవి స్త్రీల చిత్రలిపులు

కృష్ణాష్టమినాడే బాలకృష్ణుడు ఊగడానికి ఉయ్యాల ముగ్గు వేస్తారు. భగవద్గీతను బోధించిన భగవానుడు, నరకాసురుణ్ణి సంహరించిన పరాక్రమశాలైన రమావిభుడు జానపద స్త్రీలకు ఊయల్లో ఊగే పసిపాపడు. "భక్తులు ఏరూపంలో పూజిస్తే భగవంతుడు ఆ రూపంలోనే ప్రసన్నుడౌతాడు." ఈ స్త్రీల మనస్తత్వాన్ని గ్రహించిన పాల్కురికి సోమనాథుడు "బెజ్జమహాదేవి కథను" రచించినాడు. స్త్రీ జీవితపరమావధి మాతృత్వం. కృష్ణుణ్ణి వారు పసిబాలునిగా తలంచి మాతృమూర్తిగా ముగ్గుల్లోనే సేవిస్తున్నారు. కృష్ణుడు ఊగడానికి చిన్న ఊయలను ముగ్గుల్లో చిత్రించి అతన్ని సేవించినట్లుగా తరుణులు తనివితీర తృప్తి చెందుతారు.

గణేశ చతుర్థి- విఘ్నేశ్వరుని పండుగను భాద్రపద శుద్ధచవితినాడు జరుపుతారు. తెలుగుదేశంలోని ఆదిలాబాదు ప్రాంతంలో గజపాదం వేస్తారు. జాజుతో వలయ రేఖను చిత్రించి, దానిలోపల తెల్లటి సున్నంపొడితో మరొక వలయాన్ని వేస్తారు.[37]

ఆంధ్రప్రాంతంలో గజాననునికిగుర్తుగా గజపాదంముగ్గును వేస్తారు.

గజపాదం



తెలంగాణా ప్రాంతంలో వినాయక చవితినాడు అర్ధచంద్రాకారపు ముగ్గును చిత్రిస్తారు. ఆ రోజు ఇంట్లోని వారు వినాయకుణ్ణి చూడకూడదనే నిషేధాన్ని సూచించడానికి, ఈ ముగ్గు వేయడంలోని ఆంతర్యం కావచ్చు.

నవరాత్రులు :- ఆశ్వయుజ మాసంలోని నవరాత్రులు దుర్గాదేవి ఆరాధనోత్సవ దినాలు. శ్రీరామ చంద్రుడు దుర్గాదేవిని ఆరాధించి ఆమె ఆశీర్వాదాలను అందుకున్న తదుపరి తొమ్మిదిరోజులు యుద్ధం చేసి పదవరోజు దశకంఠుణ్ణి దునుమ కలిగినాడు. నాటి నుండి నవరాత్రులను, విజయదశమిని పండుగగా జరుపుకుంటారు. తొమ్మిది చుక్కలు నిలువు, తొమ్మిది చుక్కలు అడ్డం మధ్యన స్వస్తిక్ తో ఈ రోజుల్లో ముగ్గును వేస్తారు. ఈ తొమ్మిది చుక్కలు నవరాత్రులకు, దుర్గాదేవి నవనామాలకు సంకేతాలు కావచ్చు. తొమ్మిది చుక్కలతో వేసే ముగ్గుల్లో ఒకటి .



తొమ్మిది చుక్కల ముగ్గు

తెలంగాణా ప్రాంతంలో తరుణుల ప్రత్యేక పండుగ, పెనుపండుగ బతుకమ్మ. తొమ్మిది దినాలూ పూలతో బతుకమ్మను పేర్చి పీటపైన పెట్టి పాటలు పాడుతూ వృత్తాకారంలో తిరుగుతుంటారు. సాయంసమయాల్లో వాకిట్లో ముగ్గులు వేసి, వాటిపైన పీటను పెట్టి, దానిపైన బతుకమ్మను పెడతారు. ఈ ముగ్గుల్లో చతురస్రాకారపు గీతల ముగ్గులెక్కువగా కనిపిస్తాయి.

దీపావళి - విజయదశమి తరువాత ఆశ్వయుజ కృష్ణచతుర్దశిని దీపావళిగా జరుపుకుంటాం. భవిష్యత్పురాణోత్తర భాగంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుతో బలిచక్రవర్తి గౌరవార్థం దీపావళి లేదా దీపాలికోత్సవం జరుపవలెనని వివరించారు.[32]

విష్ణునా వసుధాలబ్ధా ప్రీతేన బలయే పునః
ఉపకారకరో దత్తాశ్చాసురాణాం మహోత్సవః

దీపావళినాడు దీపంముగ్గులనే వేయాలనే నియమం ఉన్నట్లుగా జానపదస్త్రీలు సమాచారం ఇవ్వలేదు. కాని యువతులు ఈ రోజుల్లో వస్తున్న ముగ్గుల పుస్తకాల్లోని "Wish you happy Diwali" అనే అక్షరాలతో కూడిన ముగ్గులతో వాకిళ్ళను అలరిస్తున్నారు.

మాఘశుక్ల సప్తమి దివసం రథసప్తమి పండుగగా జరుపుతారు. ఈపండుగ ప్రాచీన కాలంలోని సూర్యారాధనకు సంబంధించింది. ఈ పండుగనాడు సూర్యుని గుర్తుగా రథం ముగ్గును వేస్తారు. కొన్ని రథాలకు ఏక చక్రమే ఉంటుంది. కొన్నింటికి రెండు మూడు ఉంటాయి.

ద్విచక్ర రథం, ఏకచక్ర రథం



సూర్యుని రథం ఏకచక్రయుక్తమనీ, అది సప్తాశ్వాలతో పయనిస్తుందనే పురాణాల ప్రవచనాలు ముగ్గుల్లో ప్రతిబింబిస్తాయి.

సంక్రాంతి - స్త్రీల ముగ్గుల పండుగ సంక్రాంతి. ధనుర్మాసం ఆరంభమైన రోజునుండి ప్రతినిత్యం మహిళలు మనోరంజకమైన రంగవల్లులను ఇంటా బయటా తీర్చి దిద్దుతారు. సంక్రాంతి చలికి వెందులు గడగడ వడకుతూనే, ప్రత్యూషపవనాంకురాలు వీచకపూర్వమే ప్రాంగణాలను శుభ్రపరచి ప్రభాతవేళకు ముగ్గులతో అలంకరించి ధాన్యలక్ష్మికి స్వాగతం పలుకుతారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రే ముగ్గులను పెట్టుకుంటారు.

సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించిన మాసం ధనుర్మాసం. ఈ మాసపు శుద్ధ పాడ్యమినాడు మృగశిర నక్షత్రం ఆకాశంలో గోచరిస్తుంది. కాబట్టి నక్షత్రం పేరుతో మృగశిర, మార్గశిర మాసమైంది. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో మాసాల్లోకెల్లా మార్గశిర మాసం అత్యుత్తమమనీ, అది తానే అనీ బోధించాడు. "మాసానాం మార్గశీర్షోహం" ధనుర్మాసాంతానికి దక్షిణాయనం పూర్తై ఉత్తరాయణం ప్రారంభమౌతుంది. సూర్యుడు మకరరాశిలో సంక్రమణం చేసిన నాటినుండి ఉత్తరాయణం ఆరంభమౌతుంది. ఉత్తరాయణ కాలం పుణ్యలోకాలకొక ద్వారం. సూర్యుని ఉత్తరాయణ ప్రవేశ

సూచకంగా రథం ముగ్గును, ఇంట్లోకి వస్తున్నట్లు కనుమునాడు వెళ్లి పోతున్నట్లు ముగ్గులను చిత్రిస్తారు. కనుమనాడు ఒక ఇంటి ముందున్న రథాన్ని మరొక వాకిలిలోని రథంతో కలిపేస్తుంటారు. వీటివల్ల ప్రజలు నరకంలో పడిపోక, పుణ్యలోకాలకు పయనిస్తారని పల్లీయుల ప్రగాఢమైన విశ్వాసం. వీధిలోని రథాలను కలిపే సంప్రదాయం ఇరుగు పొరుగు వారి సఖ్యతకు, ఐక్యతకు దోహదం అవుతుంది.

సంక్రాంతి మూడు రోజులు ముగ్గుల్లో కలశాలను, భోగికుండలను, పద్మాలను, చాపలను, పాములను చిత్రిస్తుంటారు. శంకరుడు రథంలో వస్తాడని, అతడి ఆభరణాలు సర్పాలు, కాబట్టి రథాన్ని, పాముల ముగ్గులను వేస్తారు. పరమేశ్వరుడు కూర్చోవడానికి చాప ముగ్గు వేస్తారు. నీరు త్రాగడానికి కుండల రూపాలను ముగ్గుల్లో మలుస్తారు.





కుండలు, చాప గుమ్మడిపండు

సంక్రాంతి సమయంలో గుమ్మడి పండును దానమిస్తారు. అందుకే గుమ్మడి పండు ముగ్గును వేస్తుంటారు. ముక్కనుమ పండుగ ముగిసిన తర్వాత బొమ్మలనోము నోముతారు. బొమ్మలు పెట్టిన ఊయల క్రింద హంసలు, సింహాలను వేస్తారు. బొమ్మ లక్ష్మీదేవి చిహ్నంకాగా హంసలు సింహాలు ఆ శక్తికి వాహనాలు.

ధనుర్మాసంలో వేసే నాగబంధంముగ్గులోని మెలికలు తిరిగిన పాములు, ధనుర్మాస ఋతు ధర్మానికి నిదర్శనాలు. హేమంత ఋతువులో ప్రజలు చలికీ, మంచుకూ పాములవలె మెలికలు తిరుగుతారని ఈ

ముగ్గు సూచిస్తుంది.



మెలికలు తిరిగిన పాములు

వసంతోత్సవం - ఫాల్గుణశుక్ల పౌర్ణమి రోజును వసంతోత్సవం, కామదేవోత్సవం, హెూలీ అని పండుగ చేసుకుంటారు.

"చైత్రోత్సవే సకలలోక మనోనివాసం
కామం వసంత మలయాద్రి మరుత్సహాయం
రత్యాసహార్చ్య పురుషః ప్రవరాచ యోషిత్
సౌభాగ్యరూప సుతసౌఖ్యయుతా సదాస్యాత్ "33.

సకలలోక మనోనివాసుడగు మన్మథుని, వసంతుని, రతీదేవిని చైత్రోత్సవ మందు పూజించువారు సౌభాగ్యరూప సుతసౌఖ్య యుతులై ఉంటారని ఈ శ్లోకం వివరిస్తుంది. మన్మథ విజృంభణకు అనువైంది వసంతకాలం. వసంతుడు మన్మథుడు ప్రాణసఖులు. మన్మథుని వాహనం చిలుక. వసంతకాలంలో చిలుక రంతెక్కువ కాబట్టి వసంతర్తువు ఉత్సవానికి వనితలు చిలుక ముగ్గును వాకిట్లో వేస్తారు. వాహనాన్ని చిత్రించి వాహనాధీశుని ఆగమనాన్ని సూచిస్తారు.



పండుగల్లోనే కాకుండ ఇంట్లో వివాహాది శుభకార్యాలు జరిగినప్పుడు, శుభకార్యాన్ని సూచించే ముగ్గులను వేస్తుంటారు. వివాహ సందర్భంలో వధూవరులు కూర్చునే పీటలక్రింద ముగ్గును వేస్తారు. ఈముగ్గునే పీటపట్టి అంటారు. పెళ్ళి అయిన తర్వాత సంవత్సరం వరకు ఈ ముగ్గును ఇంటి ముంగిట్లో పెళ్ళైన ఇల్లు అని సూచించడానికి వేస్తుంటారు. ఈ ముగ్గున్న వాకిలిని, పెళ్ళైన వాకిలి అని పిలుస్తారు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఈ పీటపట్టిని వేస్తుంటారు. [34] గద్దెల పీట ముగ్గును కూడ శుభకార్యపు దినాల్లో చిత్రిస్తారు.



పీటపట్ట గద్దెంపట్ట

తమిళ సంప్రదాయ ప్రభావాన్ని పొందిన వైష్ణవ బ్రాహ్మణులు కొందరు శుక్రవారంనాడు, వివాహాది శుభకార్య సందర్భాలలో ప్రత్యేక ముగ్గును చిత్రిస్తుంటారు.





రాజమండ్రి ప్రాంతంలో వేసెడి ముగ్గు

ఈ ముగ్గును మామిడి తోరణం కట్టిన ప్రతి పండుగకు, శుభకార్యాలకు ముంగిట్లో నట్టింట్లో వేస్తుంటారు. వీరు ఇంటి పైకప్పు మధ్య భాగంలో కూడా ఈ నమూనాను చిత్రించుకుంటారు. రాజమండ్రి ప్రాంతంలో ప్రతి శుభకార్యానికీ, శుక్ర, మంగళవారాల్లో, వాకిట్లోనూ, తులసి కోట దగ్గరా చతురస్రాకారంలో ముగ్గును చిత్రిస్తుంటారు.

ఆంధ్ర ప్రాంతంలోని బ్రాహ్మణుల ఇళ్ళల్లో బువ్వంబంతి రోజు వియ్యాల వారిని ఆటకట్టించడానికి పరిహాస పూర్వకంగా ప్రత్యేక ముగ్గులను వేస్తుంటారు. మగపెళ్ళివారు, ఆడపెళ్లివారిని కట్నకానుకల కొరకు, లాంఛనాల కొరకు, ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించినట్లు చేస్తారు. వారిని ఎదిరించే ధైర్యం, విమర్శించే హక్కు ఆడపెళ్ళి వారికి ఉండదు. "సిగ్మండ్ ఫ్రాయిడ్" అనే మనస్తత్వ శాస్త్రజ్ఞుడు మానవుని మనస్సులో అంతర్లీనంగా అణచిపెట్టబడిన భావాలూ, సభ్య సమాజంలో వెలువరించలేని కోరికలూ కలల్లో ప్రతిబింబిస్తాయని సిద్ధాంతీకరించినాడు. ఈ సిద్ధాంతం స్త్రీల ముగ్గులకు అక్షరాలా అన్వయిస్తుంది. వధువు పక్షం వారు వివాహం జరిగిన తర్వాత బువ్వంబంతి రోజు వియ్యాల వారి స్వభావాన్ని సూచించే పాములు, తేళ్ళ ముగ్గులను, భోజన ప్రదేశాల్లో చిత్రిస్తారు.[35] * ఆచారంలో ఒక అంశం ముగ్గుల చిత్రీకరణ కాబట్టి వరుని పక్షం వారు వాటిని

అపచారంగా, అపహాసించే విధంగా భావించరు. వాటిని చూసి మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు. ఈ విధంగా మనస్సులోని అక్కసును తేలిగ్గా తీర్చుకోవడానికి ముగ్గులు మగువలకు పరోక్షంగా దోహదం చేస్తాయి.



పసిపాప నామకరణోత్సవం నాడు ఇంటిని అలికి ఉయ్యాల ముగ్గును వేసి ఉయ్యాల్లో పాపడిని పరుండపెడతారు. ముగ్గుల పుస్తకాల్లో ఉండే కళ్యాణమంటప ముగ్గులను వివాహ సందర్భంలో వాకిట్లో వేస్తుంటారు. అంతేకాక "Happy New Year" "Happy Diwali" "Happy Pongal" ముగ్గులను కూడా ఆయా పండుగ సందర్భాలను పురస్కరించుకొని పుస్తకాల ఆధారంగా చిత్రించి ఇళ్లను అలంకరించుకుంటారు. ఈరోజుల్లో నూతనసంవత్సరదినం, ముగ్గుల వాకిళ్ళు వీధిలో పోయేవారిని "Happy New Year " అని పలకరిస్తుంటాయి.

జానపద విజ్ఞానం నిత్యనూతనం. పాతను వదిలపరున్నా, కాలానుగుణంగా సంభవించే నూతన మార్పులను సంతరించుకోవడం జానపద విజ్ఞాన ప్రధాన లక్షణం. పండితుల లిఖిత విజ్ఞానం, పామరుల మౌఖిక విజ్ఞానంలోనికి - జానపద విజ్ఞానం పండిత విజ్ఞానంలోనికి నిరంతరం చక్రభ్రమణంగా పరిభ్రమిస్తుంటాయి. ప్రాచీనకాలం నుండీ లిఖిత, మౌఖికవిజ్ఞానాలు పరస్పర ప్రభావితాలు, పరస్పరాధారాలు.

51 A C 48472



ఆంధ్ర రమణీమణుల వ్రేళ్ళ నుండి రూపుదిద్దుకునే రంగవల్లులు ఆధునిక యుగానికి అనువుగా అనేక రూపాల్లో పుస్తకాల్లో ప్రచురితమౌతున్నాయి. పుస్తకాల్లో నుండి ముగ్గులు మళ్ళీ మగువల చేతుల్లోకి జారుతూ గృహాంగణాలను అలరిస్తున్నాయి.

ప్రతిరోజు ప్రతి శుభకార్యానికి ముగ్గువేసే హిందువులు అశుభకార్యాలకు వేయరు. పల్లెల్లో ముగ్గు లేని తెలుగువారి వాకిలి అశుభాన్ని సూచిస్తుంది. ఇంట్లో ఎవ్వరైనా చనిపోతే కర్మకాండ ముగిసేవరకు ముగ్గును వేయరు. కర్మకాండ ముగిసే వరకు చనిపోయినవారి ఆత్మ ఇంటిపరిసరాల్లోనే తిరుగుతుందని మనవారి నమ్మకం. ఒకవేళ ఇంటి ముంగిట ముగ్గువేస్తే ఆత్మలు ఇంట్లోకి ప్రవేశించి ఆహారాన్ని (బలిని) కోరుతుందనే నమ్మకం తెలుగువారిలో ఉంది. అందుకే అశుభకార్యాలకు ముగ్గు నిషేధం. కాని తెలుగు దేశంలో గ్రామ దేవతలను కొలిచెడి బైండ్లవారిలో మనిషి చనిపోయిన తదుపరి ముగ్గులు వేసే ఆచారం ఉంది. ఈ ముగ్గులు క్షుద్ర అమ్మల్లో ఉన్న నమూనాలతో వేస్తారు. వీటికి బియ్యంపిండి, పసుపు, కుంకుమ, వేపాకు పొడిని వాడుతారు. ఈ ముగ్గులపైన శవాన్ని, అతని భార్యను కూర్చోబెట్టిన తర్వాత శవాన్ని శ్మశానానికి తీసుకొని పోతారు. పదకొండు రోజుల వరకు శవాన్ని పెట్టిన ప్రదేశంలో ముగ్గులను వేస్తారు. [30]

గొల్లవారు పితృదేవతలకు బియ్యం ఇచ్చేటప్పుడు (పండుగకు) ఇంట్లో ముగ్గులను వేస్తారు. ఆ ముగ్గులతో పితృ దేవతలు సంతసం

చెందుతారు అని వారి విశ్వాసం. మధ్యప్రదేశ్ లోని ఆటవిక తెగలవారు కూడ పితృదేవతల గౌరవార్థం బియ్యం పిండిని నీటితో కలిపి చిన్నటి, సన్నటి పుల్లలతో చిత్రాలను చిత్రిస్తారు. [37]

ఈ విధంగా ఆంధ్ర రాష్ట్రంలోని రమణులు తీర్చిదిద్దెడి ముగ్గుల్లో మతం, సౌందర్యారాధనం, కళా నైపుణ్యం, ఆరోగ్య సూత్రాలు మిళితమై అతి ప్రాచీన కాలంనుండి తెలుగు సంస్కృతికి ప్రతీకలుగా విరాజిల్లుతున్నాయి.

తమిళదేశ ప్రాంతంలోని కోలం

తమిళప్రాంతవాసులు ముగ్గును కోలం అంటారు. తెలుగువారి వలెనే తమిళ స్త్రీలు ముగ్గుపొడితో, మట్టినేలపైన 'కోలం'లను చిత్రిస్తుంటారు. పండుగల్లో , పెళ్ళిలో, నామకరణ మహోత్సవం సందర్భాల్లో పిండితో కోలం వేస్తారు. సిమెంట్ గచ్చుపైన, రాళ్ళపైన బియ్యంపిండిని నీటిలో నానబెట్టినూరి, నీటిలో కలిపి చిక్కటి ద్రవంగా తయారుచేసి చిత్రాలను చిత్రిస్తారు. కోలంను నల్లరంగుతో తప్ప మిగతా ఏ రంగులోనైన వేయవచ్చు. నలుపు దుష్ట శక్తులను, శనిని ఆహ్వానిస్తుంది. అందుకే నలుపును ముగ్గుల్లో ఉపయోగించరు.

తమిళుల 'కోలం' అనే పదానికి అలంకారం, సౌందర్యం, రమ్యం, ఆకారం, రూపం, చిత్తాకర్షణ కలిగించే రేఖలు, వేషం అనే అర్థాలున్నాయి. తమిళ జానపద సాహిత్యంలో అందమైన కోలంను వేసే కన్యలను రాజకుమారులు, ప్రేమించి పెళ్ళి చేసుకున్న కథలున్నాయి. 'కోలం'ను సక్రమంగా వేయలేని స్త్రీ , భావిజీవితాన్ని కూడ సక్రమంగా గడపలేదని జానపదుల విశ్వాసం. తమిళుల కోలంలో, రెండు విధాలున్నాయి. "పుళ్ళికోలం"(చుక్కల కోలం),

వరై కోలం (గీతల కోలం). పర్వదినాల్లో గీతల కోలం 'మాకోలం' "పండికై కోలం " వేస్తారు.

స్త్రీలు తమ కోరికలను భగవంతునికి కోలం ద్వార నివేదించుకుంటారు. పెళ్ళి కావడానికి కన్యలు "మణకోలం" ను, సంతాన హీనులు, సంతానం కోసం "కృష్ణతొట్టిల్" ను వేస్తుంటారు. శుభప్రాప్తి కొరకు "గణపతి కోలం", దుఃఖ నివారణకు సిలముడి, అరిష్ట నివారణకు "కత్తరక్క", "పవిత్రమురగల్" కోలంలను చిత్రిస్తారు. పితృువులు మోక్ష ప్రాప్తికొరకు దేవాలయ ప్రాంగణంలో అశ్వత్థ వృక్షం క్రింద, తులసి కోట దగ్గర కోలంలను భక్తితో తీర్చి దిద్దుతుంటారు.

స్థలాన్ని బట్టి కూడ కోలంలు రూపాలను మార్చుకుంటాయి. చెరువుల దగ్గర 'తెప్పకోలం', 'రోజామలర్' (గులాబి ముగ్గు), వెళ్ళై తామర (తెల్లతామర) హంసలకోలం చిత్రిస్తుంటారు. తులసికోట దగ్గర తులసి మాడం (తులసి కోట ముగ్గు) పవిళమల్లె (పారిజాత పువ్వు) ను వేస్తుంటారు.

పండుగల్లో ప్రత్యేకమైన కోలంలను వేసి ఇంటిని అలంకరిస్తారు. గణపతి పండుగకు గణపతి మండలం వేసి మధ్యన గణపతి విగ్రహంపెట్టి పూజిస్తారు. నవరాత్రుల్లో బొమ్మల కొలువు ముందు కోలంలను అందంగా వేస్తారు. **

తెలుగువారి మాదిరిగానే శుక్రవారం హృదయకమలం, ఐశ్వర్యకోలంలను తమిళులు పూజామందిరంలో వేస్తారు. తమిళులకు పొంగల్ పండుగ ప్రభాకరుని పండుగ. మార్గశిర మాసమంతా సూర్య చిహ్నాలు, సూర్యపూజకు సంబంధించిన వస్తువులను వాకిట్లో చిత్రిస్తారు. పొన్ అంటే బంగారం. బంగారు కాంతులను ప్రసరించే

విభాకరుడు తమిళులకు ఆరాధనీయుడు. పొంగల్ సమయంలో వేసెడి కోలం మధ్య గుమ్మడి పూలతో అలంకరించిన పేడ ముద్దలను పెడుతుంటారు. వీటిని వినాయకుని ప్రతీకలుగా పరిగణిస్తారు. సంక్రాంతి మొదటి రోజు పొంగల్ నాడు పాలు పొంగించే ప్రదేశంలో కూడ కోలం చిత్రిస్తారు. సూర్యుని వెలుతురు ప్రసరించే ప్రదేశాల్లో కోలంను వేయడం సూర్యారాధన చిహ్నం అని వారి భావం. సంక్రాంతి రెండో రోజు మాట్ పొంగల్ నాడు (గోపూజాదివసం) గోవు ఆకారం, గోపాదాలను కోలంలో చిత్రిస్తారు. "కానపొంగల్" - పెళ్లికొడుకును అన్వేషించే రోజు. సముద్ర తీరానికి మగపిల్లలు, ఆడపిల్లలు వెళ్ళుతారు. మగపిల్లలు ఈత కొట్టాలి. వీరి శక్తిని మెచ్చుకొని ఆడపిల్లలు వరులను ఎన్నుకుంటారు. ఆ రోజు ఇల్లు విడిచే సమయంలో 'మణకోలం' చిత్రీకరించి పెళ్ళికావాలని మొక్కు కుంటారు.

మార్గ" మాసంలో వేసే కోలంలో చెట్లు, జంతువులు, పక్షులు, పువ్వులు అనేక రకాలుగా విరాజిల్లుతుంటాయి. రథసప్తమి రోజు సూర్యునికి సంకేతంగా తేరు చిత్రాన్ని కోలంలో చిత్రిస్తారు. సూర్య రథానికి ఏక చక్రం, ఏడు గుర్రాలకు గుర్తులుగా ఏడు గీతలుంటాయి. రథం మధ్యన కానీ, రథంపైన కానీ సూర్యబింబాన్ని చిత్రిస్తారు. రథంలో తొమ్మిది గళ్ళు గీచి వాటిని నవధాన్యాలతో నింపుతారు. సప్తాశ్వవాహనుని కరుణ వల్లనే పంటలు పండుతాయనే స్త్రీల అభిప్రాయం ఈ కోలం ద్వారా విదితమౌతుంది.



ఏడుగుర్రాల రథం.



6 వసంతావ్యంతో కూడిన తొమ్మిదిగళ్ల సూర్యరథం.

కామ దహనం తర్వాత శివుడు పార్వతిని ప్రేమించిన రోజును ఆరుద్రోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఉత్సవం చిదంబరంలో మహావైభవంగా తొమ్మిది రోజులు జరుగుతుంది. తొమ్మిదవ రోజు నటరాజస్వామి శివకామ సుందరితో కలిసి రథంలో ఊరేగుతారు. ఈ ఉత్సవ సమయంలో ఇంటి ముంగిట రథాల కోలంను వేస్తారు. రథం మధ్యన శివలింగం ఉంటుంది. కార్తీక పౌర్ణమినాడు 'దీపాలకోలం' 'తులసికోలం" "మాకోలం" వేసి మధ్యన దీపాలను పెట్టుతారు. ఈ శుభదినమే పార్వతీదేవి శివునికొరకు తపస్సు ప్రారంభించిందని, మురుగన్ కొరకు "వల్లి' తపస్సుచేసి అతన్ని పొందిందని కథను చెప్పుతారు. మురుగన్ చిహ్నంగా "వేల్" (విల్లు) మయిల్ (నెమలి) శివలింగం, కోలంలో వెలుస్తాయి. శివరాత్రినాడు శివలింగం, బిల్వపత్రాలు కోలంలో కనపడతాయి.

నాగపంచమి పండుగకు వివిధ పాముల "కరినాగం"ను వేస్తుంటారు. వాకిట్లోనూ, దేవాలయాల్లోనూ పాముల కోలంను వివిధ రకాలుగా చిత్రిస్తుంటారు. ఈ కోలంలు చుక్కల్లోనూ, గీతల్లోనూ ఉంటాయి.

కృష్ణాష్టమినాడు చిన్నపిల్లవాని ఉయ్యాలను, పాదాలను, శంఖ, చక్ర, పద్మాలను చిత్రిస్తారు. ఆరు చుక్కలతో వేసెడి కోలం షణ్ముఖునికి ప్రతీక. ప్రతి శుభకార్యానికి మణి కోలం వేస్తారు.

దీపంకోలం,



మణకోలం



తమిళులు చుక్కల ముగ్గుల్లో వివిధ పశు, పక్ష్యాదులనే కాక దేవతల ప్రతీకలను, సంగీత స్వరాలను, వీణ మొదలైన వాయిద్యాల రూపాలను రూపొందిస్తారు.



వ్యవసాయానికి సంబంధించిన పండుగలన్నింటికి వృత్తాకారంలో కోలం చిత్రాలను చిత్రిస్తారు. 'కుండకోలం' కొత్త ధాన్యానికి గుర్తు. కనుపొంగల్ నాడు తమిళులు ఎర్రటి పచ్చటి అన్నాన్ని, పెరుగన్నాన్ని,

చక్కెరపొంగలిని, చెరకుగడ ముక్కలను ఆకుల్లో పెట్టి చెరువుదగ్గర చిన్నచిన్న ముగ్గులు వేసి, వాటిపైన పెట్టి "కాకకుర్వి కళ్యాణం' అని పక్షులను పిలుస్తారు.[40] కాకుల, పక్షుల శుభాన్ని కోరుతూ ఇంటికి వెళ్లిపోతారు. కాకులు భూలోకవాసులకు, పితృలోకవాసులకు దూతలని వారి అభిప్రాయం. అందుకే తమిళ స్త్రీలు కాకులు, పక్షుల మీది అభిమానంతో వాటికి ఆహారం పెట్టి పరితృప్తిని పొందుతారు. అల్పమైన ప్రాణిని కూడ ఆదరించే స్వభావాన్ని పెంపొందించుకోవాలనే తలంపుతో తరుణులు ఈ ఆచారాన్ని అవలంబించి ఉండవచ్చు.

దేవాలయాల్లో ఉత్సవ సమయాల్లో తెలుగువారంటే అధికమైన శ్రద్ధతో ద్వారాల దగ్గర, విగ్రహాల ముందు పెద్దపెద్దఅందమైన కోలం చిత్రాలను చిత్రిస్తారు. నల్లటి రాళ్ళపైన తెల్లటికోలం కంటికింపుగా ఉంటుంది. నూతనత్వం కొరకు కోలంను ప్రతిరోజు మారుస్తుంటారు. తమిళప్రాంతంలోని దేవాలయాలు శిల్పం, సంగీతం, సాహిత్యం మొదలైన కళలతో పాటు ముగ్గుకళను కూడా ప్రోత్సహించి పోషించాయి. శివ, పార్వతి, మురుగన్ దేవాలయ ప్రాంగణాల్లో అనేకమంది కన్యలు "కోలం" వేసి మధ్యలో స్వస్తిక్‌ను చిత్రించి జ్యోతిని వెలిగించి పూజిసలుపుతారు. మద్రాసులో "మేల్ మరువత్తూరు" "ఆదిపరాశక్తి దేవాలయం","మాంకాడ్ దేవస్థానం" ఈ సేవకు ప్రసిద్ధి పొందినాయి. "అవినయ కొత్తు" అనే నాట్య ప్రదర్శనలో స్త్రీలు కాలివ్రేళ్ళతో ముగ్గుపొడిని చల్లుతూ చిత్రాలను చిత్రిస్తుంటారు. తమిళ స్త్రీలు తమ నృత్య నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి "కోలం"ను ఒక సాధనంగా ఎంచుకుంటారు.* [39]

తమిళులు కూడ ఇంట్లో మరణం సంభవిస్తే కోలం వేయరు. చెట్టినాడు ప్రాంతంలో ప్రతి కోలం చుట్టురెండు వరుసల చుక్కలను పెడితే, శుభ సూచకం. ఒకే వరుస చుక్క పెడితే అశుభ సూచకం.

వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాల్లోని ముగ్గులు



a) పడికోలం, శుభకార్యాలకు వేసెడి కోలం

b) సీతముడి, కృష్ణునిముడి, లక్ష్మీదేవి పాదాలు

c) పెళ్ళిపీటల క్రిందవేసెడి కోలం

d) మణికోలం కన్యలు వివాహం కొరకు వేసెడి కోలం, గోకులాష్టమి రథం

తులసికోట

e) రుద్రముడి, గౌరీదేవి పూజకు వేసే కోలం

f) గణపతి మండలం, కార్తీకదీపకోలం g) నాగకోలం h) పద్మరథం

ఈ ఆధునిక కాలంలో తమిళ, కర్ణాటక ప్రాంతాల్లో రంగవల్లులను నేలపైన, గోడలపైన, గడపలపైననే కాక నీటిలో కూడ వేయడం ఆవిర్భవించి ప్రేక్షకుల మన్ననలను పొందుతున్నది. ఈ కళ కూడా స్త్రీల చేతి వ్రేళ్ళతోనే రూపొందుతుంది. పెద్ద పళ్ళెంలో సగం వరకు నీటిని నింపి, దీనిలో రెండు చెంచాల కొబ్బరినూనెవేసి చేతి వ్రేలితో కలపాలి. అప్పుడు నూనె అంతా నీటిమీద తేలుతుంది. పదినిమిషాల తర్వాత ఈ నీటిపైన దీపపు మసిని చిలకరించాలి. మసి, నీటిలో మునగక తేలుతుంది. నూనె కలిపిన నీరు మసితో నల్లబడుతుంది. ఈ రంగుపైన తెల్లటి ముగ్గుపొడిని, కావలసిన ఆకృతిలో గీయవచ్చు. తెల్లటి ముగ్గుపొడినే కాకుండా, రంగుల పొడిని కూడా ఉపయోగిస్తారు. గాలి వీస్తే మాత్రం నీరు కదులుతుంది. చిత్రం చెదురుతుంది. అందుకే గాలి వీచని చోటులో ఈ చిత్రాలను, నీటిపైన చిత్రిస్తారు. ప్రదర్శనా యోగ్యమైన ఈ కళ ఎక్కువ ప్రచారాన్ని పొందడం లేదు.

కర్ణాటక ప్రాంతంలోని రంగోలి

తెలుగు, తమిళుల మాదిరిగానే కర్ణాటప్రాంతవాసులు దుష్టశక్తులను తరుమడానికి ఇంటిని పవిత్రం చేసే దేవతలకు స్వాగతం పలకడానికి రంగోలిని చిత్రిస్తుంటారు. భానుదయాస్తమయ సమయాల్లో రంగోలిని చిత్రిస్తారు. సాయంకాలం లక్ష్మీదేవి ఇంటిని విడచివెళ్ళి పోకూడదనే తలంపుతో ద్వారం దగ్గర రంగోలిని అడ్డంగా వేస్తారు. లక్ష్మికి చిహ్నంగా వివిధ నమూనాల్లో పద్మాలను మలుస్తారు.

తెలుగు తమిళ ప్రాంతాల్లోని ఆచారవ్యవహారాలు, ముగ్గులు, కర్ణాటక ప్రాంతంలో కూడా కనిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగకు వివిధ రకాలైన రంగోళి చిత్రాలను చిత్రిస్తుంటారు. నాగపంచమి రోజు "నగర పంచమి నాగప్ప" రంగోలిని వేస్తారు. పంచవర్ణాలతో

నాగమండలాన్ని అలంకరిస్తారు. ఈ మండలాల్లో పాములు 4,8,12,16 ముడులతో ముడి వేసుకొని ఉంటాయి. నాగులచవితి, పంచమి, షష్ఠి రోజుల్లో పామువచ్చినట్లు పూజనందుకున్నట్లు వెళ్తున్నట్లు చిత్రిస్తారు. దీపావళినాడు "బలిచక్ర వర్తికోట", దీపాల రంగోలిని వేస్తారు శివరాత్రినాడు రుద్రజడ, బిల్వపత్రరంగోలిని వినాయకచవితిరోజు గణపతిమండలం, రామనవమినాడు రామసింహాసనం, ఉగాదినాడు చెరకు, వేపాకుల చిత్రాలతో రంగోలిని చిత్రిస్తారు గౌరీపండుగకు, "గౌరీ ~ ్రద రంగోలి" పంచపద్మ రంగోలి, అనంత నారాయణవ్రత సమయంలో "అనంతగంటు" రంగోలి చిత్రిస్తారు.

బలిచక్రవర్తికోట

గోపద్మవ్రత సందర్భంలో వేసెడి రంగోలి



నాగచవితి, నాగపంచమి నాగషష్ఠి
సర్పదేవత ఆగమనం సర్పారాధన సర్పదేవత వీడ్కోలు



వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాల్లోని ముగ్గులు



ఆశ్లేష బలి మండలం

గణపతి మండలం

బిల్వదళం రంగోలి   రామ సింహాసన రంగోలి

శుభకార్యాన్ని సూచించే కొబ్బరికాయల రంగోలి

అనంతగంటు రంగోలి   అనంత నారాయణ వ్రత రంగోలి

కాలు దీపం   గౌరీ పట్టెద రంగోలి   నగపంచమి రంగోలి

గోపద్మ వ్రతం సందర్భంలో కర్ణాటక రమణులు తులసి ముందు రంగోలిని వేస్తారు. విష్ణువు వైకుంఠాన్ని విడచి తులసి దగ్గరకు వస్తాడని వ్రతకథ చెప్తుంది. రంగోలిలో విష్ణువు తులసిని వదలిపోకుండ ఉండడానికి రంగోలిలోని వైకుంఠ ద్వారాన్ని మూసివేస్తారు. బలి పాడ్యమి రోజు కన్యలు రంగోలిని వేస్తే వారికి తొందరగా పెళ్ళి అవుతుందని విశ్వసిస్తారు. పెళ్లి పీటల క్రింద, శోభనం గదిముందు రమణులు ప్రత్యేకమైన రంగోలిని చిత్రిస్తారు.

కేరళలోని కోలం

కేరళలో ముగ్గును కోలం అని అంటారు. 'కోల' అంటే అలంకారం, చిత్రకళ, రంగులచిత్రం రూపం అనే అర్థాలున్నాయి. రంగులపొడితో, పూలతో "కోలం" వేస్తుంటారు. ఓణం పండుగరోజు మహాబలికి స్వాగతం పలకడానికి పూలతో కోలం వేసి మధ్యలో దీపం పెడతారు.

కేరళలో భూతారాధన, సర్పారాధన అధికం. భూతాలను ఆవాహన చేయడానికి వేసే కోలంను "భూతకోలం" అని అంటారు. భూతకోలంలను వేసే వారిని పరవపంబదరు అని అంటారు. వీరు వేసే ఒక భూతం రూపానికీ మరొక భూతరూపానికీ మధ్య భేదం, ప్రత్యేకత ఉంటుంది. నాగమండలాలను పుళ్ళువర్ కులానికి చెందిన వారు వేస్తుంటారు. ఈ నాగమండలాలు వలయాకారం, చతురస్రాకారం, దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. అనేక పడగలతో, చాచిన పొడవైన చీలిన నాలుకలతో, ఒకదానితో మరొకటి పెన వేసుకున్న పాములు భీషణాకారాలో చూచేవారికి భయాన్ని కల్గిస్తాయి. వాటిని చూచే ప్రేక్షకునికి నాగలోకంలో ఉన్నట్లు భ్రమకలుగుతుంది. ప్రాచీన పురాణ, కావ్యాల్లో వర్ణింపబడిన అష్ట నవ పడగల నాగులేకాక, అనంత, వాసుకి,

తక్షక, కర్కోటక, పద్మ, మహాపద్మ, శంఖపాల, శేష, దధిముఖ, మణినాగ మొదలైన నాగుల రూపాలను మండలాల్లో చిత్రించి వాటి కథలను, పురాణాలను చెప్పే అధికారం పుళ్లువర్ తెగకు చెందిన పూజారులకే ఉంటుంది. వీరికి ఈ అధికారం ప్రాప్తించడానికి ఒక కథను చెప్పుతుంటారు. అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహించే సమయంలో వాసుకి సర్పం అగ్ని జ్వాలల నుండి ఎగిరి కేరళలోని "కుట్టనాడు"లో పడింది. అక్కడ నీటిని తెస్తున్న "పుళ్ళువర్" స్త్రీలు దాహంతో తపిస్తున్న వాసుకిని చూచి నీటిని తాగించారు. వాసుకి కృతజ్ఞతతో వారింటిలో కొన్ని రోజులు నివసించి, పూజలందుకొని నాగ మండలాలను వేయడానికీ, సర్పపురాణాలను చెప్పడానికీ, పాటలు పాడడానికీ అధికారాన్ని ప్రసాదించాడు.[40] నాగ ఉత్సవ సమయాల్లో ఈ కులంవారే పూజారులుగా ఉంటారు. అతికొద్ది సమయంలో వీరు పొడవైన రంగులతో నిండిన నాగరూపాలను నియమ నిష్ఠలతో, భక్తితో చిత్రించి పూజిస్తారు. రాత్రినుండి తెల్లవారే వరకు నాగకన్య, నాగరాజు వేషాలతో మండలాల చుట్టూరా నాట్యం చేస్తారు.

ఒరిస్సాలోని ఝుటి

ఒరిస్సాలో ముగ్గుల చిత్రాలను 'ఝుటి' అంటారు. తెలుగు స్త్రీల మాదిరి ఒరిస్సా వనితలు ప్రతిరోజు 'ఝుటి'ని చిత్రించరు. వాకిలిని ఊడ్చి గోమయపు నీరు చిలకరించి వదలి వేస్తారు. మార్గశిర మాసంలోనూ, శుభకార్యాల్లోనూ, పూజల్లోనూ, పండుగల్లోనూ చిత్రాలను వేస్తుంటారు. ఈ చిత్రాలను తెలుగువారి వలె వాకిలి నిండా వేయక నియమిత ప్రదేశంలో వృత్తాకారంలో జేగురుపూత పూసి అది ఆరిన తర్వాత దానిపైన ఝుటి చిత్రం వేస్తారు. బియ్యం నానబెట్టి మెత్తగా రుబ్బి అందులో దూది పింజను ముంచి నొక్కుతూ ఉంగరపు

వ్రేలితో చిత్రాలను చిత్రిస్తారు.

మార్గశిర మాసంలో ప్రతి గురువారం లక్ష్మిపూజ చేస్తారు. ఈ మాసం నాటికి పంటచేలు పండి కోతకు సిద్ధంగా ఉంటాయి. ఈ మొదటి గురువారం లక్ష్మిపూజ చేసిన తర్వాతనే కోతలను ప్రారంభిస్తారు. పొలాల్లోని ధాన్యాన్ని ఇంటికి తెచ్చి ధాన్యలక్ష్మి పూజ చేస్తారు. గృహలక్ష్మి ఆరాధన తర్వాత ధాన్యలక్ష్మి గృహప్రవేశం కావిస్తుంది. పూజచేసే ప్రదేశాన్ని జేగురుతో వృత్తాకారంలో,చతురస్రాకారంలో అలికి దానిపైన వివిధ రకాల చిత్రాలను లిఖిస్తారు. ఈ చిత్రాలపైన ధాన్యం గంపలను పెట్టి పూజిస్తారు. పూజ చేసే ప్రదేశంలో గోడపైన కూడ చిత్రాలను వేస్తారు. [41]

ఉత్కళ వనితలు చిత్రించే ముగ్గుల్లో అష్టదళ పద్మం, శంఖం, చక్రం, కుంభం, స్వస్తిక్, లక్ష్మిపాదాలు, పెరుగుకడవ, గాదె, తులసికోట, వరివెన్నులు అలరారుతుంటాయి. వీటిలో అధిక ప్రాధాన్యతను పొందేవి అష్టదళ పద్మాలు. పద్మాలనే అనేక రూపాల్లో రేకులతో చిత్రిస్తుంటారు.



లక్ష్మీదేవి పాదాలు, వరి వెన్ను అష్టదళపద్మం స్వస్తిక్ పెరుగు కడవ

స్త్రీలు కోరుకునేవి సంపద, సౌభాగ్యం, పాడిపంటలు. సౌభాగ్యానికీ, సంపదకూ ప్రతీకలుగా పద్మాన్ని, పాడికి పెరుగుకడవ, పంటలకు వరివెన్నును చిత్రిస్తారు.

బెంగాల్‌లోని అల్పనలు

బెంగాలీ పడతులు వ్రతసందర్భాల్లోనూ, పండుగల్లోనూ, ఉత్సవసమయాల్లోనూ గృహ ప్రాంగణాలను అల్పనలతో అలంకరిస్తుంటారు. ఒరిస్సా స్త్రీలవలెనే చిక్కటి బియ్యపు పిండి ద్రవంతో ముంచిన దూదినిగానీ, బట్టనుగాని అరచేతిలో పట్టుకొని నొక్కి ద్రవాన్ని మెల్లిగా జారవిడుస్తూ ఉంగరపు వ్రేలితో వివిధ నమూనాలను చిత్రిస్తుంటారు. అల్పనలకు బియ్యంపిండినే వాడినమా, అలంకరణ కొరకు రంగులపొడిని, ఎండిన ఆకుల పొడిని కూడ వాడుతుంటారు

లక్ష్మీపూజ సందర్భంలో లక్ష్మీదేవి పాదగుర్తులను, పద్మాలను, ధాన్యపు కంకిని, గబ్బిలం (లక్ష్మివాహనం) పసుపు పెట్టె మొదలైన సౌభాగ్య సంపద సూచక చిత్రాలేకాక, నాగలి, కొడవలి, ధాన్యాన్ని కొలిచే పాత్ర, రూపాలు అల్పనలో అలరారుతుంటాయి. వృద్ధిని సూచించే చేప చిత్రాన్ని లక్ష్మీపూజ సందర్భంలోనే కాక, ఇతర శుభ సమయాల్లో కూడ వేస్తుంటారు. [42] సముద్రతీరంలోని బెంగాల్ ప్రజలకు చేప ప్రధానమైన, ప్రీతికరమైన ఆహారం. అందుకే కాబోలు చేప చిత్రాలతో ఉన్న అల్పనలను వారు శుభానికి చిహ్నంగా చిత్రిస్తారు.

పెళ్ళిలో వధూవరులు కూర్చునే స్థలాన్ని కూడ అల్పనలతో అలంకరిస్తారు. పెళ్ళిపీటలను పోలిన అల్పనలను దీర్ఘ చతురస్రాకారంలోకానీ, చతురస్రాకారంలోకానీ అర్ధచంద్రాకారంలోకానీ వేస్తారు. వీటి మధ్యన శంఖాలను, చేపలను చిత్రిస్తారు.



చేపముగ్గు బెంగాలీలు శుభకార్యానికి వేసే అల్పన







పెళ్ళినాటి అల్పన

పెళ్ళినాటి అల్పన   లక్ష్మీదేవి పూజకు వేసే అల్పన

సూర్య సంబంధమైన మాఘమండల వ్రతం సందర్భంలో చిత్రభానుని చిత్రాన్ని కానీ, సంకేతాన్ని కానీ, చిత్రిస్తారు. మాఘమాసంలోని తారావ్రత సందర్భంలో బెంగాలీ బాలికలు అనేక తారలతో కూడిన అల్పనలను వరండాల్లో వేస్తారు. ఆకాశంలో నక్షత్రాలు ఉదయించగానే ప్రతి నక్షత్రపు అల్పనపై ఒక్కొక్క గడ్డిపరకను వేసి వాటినన్నింటిని కలిపి ఇంట్లోకి వెళ్ళిపోతారు. తిరిగి ఆ రాత్రి వారు ఆకాశంలోని నక్షత్రాలను చూడరు. మాఘమాసంలోనే బెంగాలీ బాలికలు పెద్ద పెద్ద సంక్లిష్టమైన అల్పనల్లో ఇంట్లోకి కావలసిన వస్తువులన్నింటిని లిఖించి, అవన్నీ తమకు వైవాహిక జీవితంలో లభించాలని కోరుకుంటారు. ఈ అల్పన చిత్రణ వల్ల గృహిణి కాబోయే బాలిక సంసారానికి అవసరమయ్యే వస్తువులన్నింటిని

ఒక ప్రణాళిక ప్రకారం సమకూర్చడంలో, వాటిని సర్దడంలో అనుభవాన్ని సంపాదించుకుంటుంది. బెంగాలీ బాలికల అల్పనలు వారి భావి జీవితానికి పునాదిరాళ్ళు.

మానసాదేవి పండుగకు పాములను నేలపైన, కుండలపైన అల్పన చిత్రాల్లో చిత్రీకరిస్తారు [43]* పాము మానసదేవి ప్రతీక.

మహారాష్ట్ర ప్రాంతంలోని రంగోలి

మహారాష్ట్ర మహిళలు 'శిర్ బోడ' అనే స్ఫటికం నంటి రాతిపొడితో రంగోలిని ఇంటి ముంగిట్లో, పూజామందిరంలో వేస్తుంటారు. వీరు గీతలతోనూ, చుక్కలతోనూ రంగోలిని చిత్రించినా, గుండ్రటి ముత్యాలవంటి ముగ్గులనెక్కువగా చిత్రించరు. రేఖాగణిత చిత్రాలను పోలిన చిత్రాలను వేస్తుంటారు. రంగోలి మధ్యలో అలంకరణ కొరకు రంగు రంగుల పొడిని నింపుతారు.



రేఖాగణిత చిత్రాలు

పూజామందిరంలో కమలాన్ని అనేక రకాలుగా వేస్తుంటారు.

హృదయ కమలం రంగోలిని పవిత్రంగా భావించి పూజాగదిలోనే చిత్రిస్తారు. రంగోలిలో అనేక రకాల కమలాలను చిత్రిస్తుంటారు.

దీపావళినాడు దీపానికి గుర్తుగా ఆకాశదివ రంగోలిని వేయడం ఆచారం. 44 * ఇందులో నక్షత్రకమలాలుంటాయి.



ఆకాశదివ

పద్మం మాదిరిగానే శంఖాలు, స్వస్తిక్ లు అనేక నమూనాలతో రంగోలిలో రూపు దిద్దుకుంటాయి. 'తబక్' అనే రంగోలి కమలాలతో కూడి వలయాకారంలో ఉంటుంది. స్వస్తిక్ లతోనే నాగలి నమూనాలో వాంగర్ రంగోలిని వేస్తారు. 45 * వనితలకు వ్యవసాయంపైన కల శ్రద్ధాసక్తులను ఈ రంగోలి విశదపరుస్తుంది.

మధ్యప్రదేశ్‌లోని ఎపన్ లేదా మండనలు

మధ్యప్రదేశ్ లోని మహిళలు ఇంటిముందు శుభ్రంచేసి తర్వాత పేడతో అలికి మండనాలను తీర్చిదిద్దుతారు. వీరి మండనల్లో స్వస్తికలు, పద్మాలు, త్రికోణాలు, చతుర్భుజాలు గోచరిస్తుంటాయి. చెట్లు, నాగలి మొదలైన వ్యవసాయ సంబంధమైన చిత్రాలను కూడ చిత్రిస్తుంటారు. హోలీ,దీపావళి, దసరా, నాగపంచమి రోజుల్లో స్త్రీలు మండనలను ఎక్కువగా వేస్తుంటారు. వీటిలో మామిడి కాయలు,

జొన్నకంకులు, లక్ష్మీదేవి పాదగుర్తులు, 6,8 దళాల పువ్వులుంటాయి. ఈ చిత్రాలను వలయాలతో కానీ, చుక్కలతో కానీ, అలంవంటి గీతంతో కానీ, చిత్రిస్తారు. వివాహ సమయంలో చౌక్ చిత్రాన్ని చిత్రిస్తారు. ఈ బొమ్మ మధ్యలో X గుర్తు చుట్టూ వలయాలు ఉంటాయి. శ్రావణ మాసంలోని శ్రావణ శుక్లనవమినాడు స్త్రీలు పొలంనుండి తీసుకొనివచ్చిన మట్టిని ఆకుల దొప్పల్లో నింపి విత్తనాలను వేసి గదిలో పెడతారు. ఈ దొప్పలను పెట్టిన ప్రదేశంలో, చిక్కటి బియ్యంపిండి ద్రవంతో, ఇల్లు, ఊయల, ముంగిస, కుండనెత్తుకున్న స్త్రీ చిత్రాలను చిత్రిస్తారు. దొప్పల్లో మొలకలు వచ్చిన తరువాత పదిహేను రోజులకు వాటిని వాటి దొప్పలను నీటిలో విడచిపెట్టుతారు. ఈ చిత్రాల్లోని ఇల్లు , ఊయల, కుండ- కుటుంబాన్ని, సంతానాన్ని, ధాన్యాన్ని సూచించే సూచికలు. స్త్రీలు కోరుకునే కోరికలు.

మాల్వా ప్రాంతంలోని శ్రీగౌడ అనే బ్రాహ్మణుల వివాహ గృహప్రాంగణం ఉదయం, సాయంకాలం రెండు విధాల మండనలతో అలరారుతుం బంది. ఈ మండనం త్రికోణాకారంలో ఉంటుంది. ఉదయం చిత్రంలో ఉదయిస్తున్న సూర్యుడు, .ఎగరడానికి సిద్ధమైన పక్షి, వికసించిన కుసుమం, దానిచుట్టూ భ్రమిస్తున్న భ్రమరాలు కనపడుతాయి. చిత్రం మధ్యలోని షడ్భుజాకారం నూతన దంపతుల గదిని సూచిస్తుంది. వధూవరుల బాధ్యతలు విభిన్నమైనవని మధ్యగీత తెలుపుతుంది. వరుడు నాగలిని, పశువులను తీసుకొని పొలానికి పోవాలనీ, వధువు గాజులు, అందెలు, పూవులను అలంకరించుకొని ఇంట్లోనే ఉండాలనీ చిత్రం వ్యక్తం చేస్తున్నది. సాయంకాలం సమయంలోని చిత్రంలో రాత్రిని సూచించే దీపాలు, చంద్రుడు, ఇంటికి అరుదెంచిన పశుపక్ష్యాదులు, పూలతో అలంకృతమైన వధూవరుల

గది, వారి పాద ముద్రలు చిత్రితమవుతాయి. ఉదయం చిత్రంలోని పూవు సాయంకాలం వాడినట్లు కిందకు వాలుతుంది. భ్రమరాలు సాయంకాల చిత్రంలో అదృశ్యమవుతాయి. చిత్రం క్రిందవైపున గల పాదాలు సాయంకాలంచిత్రంలో అలసటను సూచిస్తాయి.

రేఖలలోనే సమయాన్నీ, సందర్భాన్నీ, ప్రకృతినీ, వధూవరుల బాధ్యతలనూ, అందంగా, అనుభవ పరిజ్ఞానంతో చిత్రించే అతివల చిత్రకళానైపుణ్యం అమోఘం.



ఉదయం చిత్రం



సాయంకాల చిత్రం

మాల్వా ప్రాంతంలోనే బాలికలు సెప్టెంబరు నెలలో శ్రాద్ధ పక్షాలు మొదలైన రోజునుండి గోడలపైన ఆవుపేడతో చిత్రాలను చిత్రిస్తారు. ఆ చిత్రాలను పూల రేకులతో కానీ, పన్నితో కానీ అలంకరిస్తారు. వీటినే 'సంజి' చిత్రాలని అంటారు. ఒక్కో రోజుకు ఒక్కో విధంగా పదిహేను చిత్రాలను చిత్రిస్తుంటారు. ఈ చిత్రాల్లో బండి, గుర్రం, ఏనుగు, నెమలి, పెండ్లి ఊరేగింపు, రోలు, రోకలి, పెళ్ళి

కూతురు పెళ్ళి కొడుకు చిత్రాలెక్కువగా రేఖాగణిత చిత్రాలవలె ఉంటాయి. 48





బుందేల్‌ఖండ్ ప్రాంతంలో దీపావళి పండుగకు గోడలపైన రమ, రమాపతి, నాగనాగిని, సూర్యచంద్రులు, సప్తర్షులు, శ్రావణకుమారుడు మొదలైన వారి రేఖా చిత్రాలను చిత్రిస్తారు.

రాజస్థాన్ ప్రాంతంలోని మండనాలు

నిర్ణీత ప్రదేశాల్లో ఎర్రమట్టి, పేడనీటితో అలికి, సున్నము నీటిలో కలిపి, దూదిపింజతో కానీ, పుల్లతో కానీ, వ్రేళ్ళతో కానీ చిత్రాలను చిత్రిస్తారు. వీటిని మండనాలు అని అంటారు. "గృహిణి సౌభాగ్యానికి, సంపదకు చిహ్నాలు మండనాలు" అని రాజస్థాన్ ప్రజల అభిప్రాయం. దీపావళి, సంక్రాంతి, హోళీ, గంగోర్, రక్షాబంధనం మొదలైన పండుగల్లో ప్రత్యేకమైన మండనాలను చిత్రిస్తుంటారు. వీరు గీతలతో మండనాలను ఎక్కువగా చిత్రిస్తారు. చుక్కలతో వేసినవూ అని మండనంలో కనపడవు.

రాజస్థానీయులకు దీపావళి లక్ష్మీదేవి పండుగ. దీపావళి రోజే విష్ణువు లక్ష్మిని పత్నిగా పరిగ్రహించి, తనతోపాటు ఆమె పూజలను అందుకుంటుందనే వరాన్ని ఇస్తాడు. రాముని పట్టాభిషేకమహోత్సవం, మహావీరుని జన్మదినోత్సవం కూడా దీపావళి దినమే. అందుకే దీపావళి పండుగనాడు మహిళలు మహోత్సాహంతో ఇంటి ముంగిళ్ళను

మండనాలతో అలంకరిస్తారు. ✡ ఈ గుర్తును లక్ష్మీదేవి ప్రతీకగా వేసి చుట్టూర పద్మాలను చిత్రిస్తారు. మండనాల్లో అష్టదళ పద్మాలు అధికంగా ఉంటాయి. స్వస్తిక్ లతో కూడ మండనాలను రూపొందిస్తారు. రాజస్థాన్ లోని 'పవార్' తెగవారు దీపావళికి లక్ష్మీదేవి పాదాలను ఇంట్లోకి వస్తున్నట్లు చిత్రిస్తారు. దీపాల చిత్రాలను, కలం, సిరాబుడ్డి చిత్రాలనూ దీపావళికి వేస్తారు.

హోలి పండుగకు పడ్రంగి, పల్లెల్లో ప్రతి యింటియజమానికి తల్వార్ ను, దండను తెచ్చిస్తాడు లేదా ప్రతి గృహస్థు వీటిని కొనుక్కుంటాడు. వీటి రూపాలను రాజస్థాన్ మహిళలు మండనాల్లో చిత్రిస్తారు. మామిడికాయలు ఈ కాలంనాటికి వస్తుంటాయి కాబట్టి వీటి చిత్రాలనూ కూడ మండనాల్లో వేస్తారు. ధనస్సును , మకుటాన్ని నక్షత్రాన్ని, శివుని ఢమరుకాన్ని కూడ చిత్రిస్తుంటారు.



ఆయుధాల చిత్రాలు

హోలీ తర్వాత చైత్రమాసంలో గంగౌరీ పండుగను జరుపుతారు. ఈ పండుగకు అనేక మండనాలు వేసి, ఆనాటి ప్రత్యేక పిండివంటల రూపాలను కూడా చిత్రిస్తారు.

సంక్రాంతి సమయంలో ధాన్యం వస్తుంది. క్రొత్త ధాన్యానికి , సూర్యునికి గుర్తుగా కుండను చిత్రిస్తారు. సంక్రాంత్-కా-కుండ మండనలో 3,5,7,9,11,13,15 సంఖ్యలో కుండలను వేస్తారు.

స్థలాన్ని బట్టి కుండల సంఖ్యను పెంచుతుంటారు. సంక్రాంతికి వేసే ముగ్గులన్నీ వృత్తాకారంలోనే ఉంటాయి.



సంక్రాంత్ కా కుండ,



హోలికాధువ

రాఖీ పండుగకు రాఖీని, కొబ్బరికాయను, స్వస్తిక్‌ను, తల్లిదండ్రులను మోసుకెళుతున్న శ్రావణకుమారుని చిత్రాలను చిత్రిస్తారు. నామకరణ మహోత్సవం, యజ్ఞోపవీతం, వివాహ సమయాల్లో వృత్తాకారంలో సూరజ్-కా-చౌక్ చౌకి చిత్రాలను చిత్రిస్తారు. ఋతువులను అనుసరించి కూడ మండనలను వేస్తారు. వేసవిలో విసనకర్ర, దిగుడుబావి చిత్రాలనూ, వర్షాకాలంలో నీటి లయలను సూచించే లహరియ మండనలను వేస్తారు. చలికాలంలో వంకాయలధికం కాబట్టి 'బెంగన్ల బింట' మండనను చిత్రిస్తారు. [47]







సూరజ్ కా చౌక్, రాఖీమండనం, శ్రావణకుమారుడు

బీహార్ ప్రాంతంలోని చిత్రాలు రేఖాగణిత చిత్రాలను పోలి ఉంటాయి. పండుగ సమయాల్లో లక్ష్మీదేవి పాదాలు ఇంటిలోనికి ప్రవేశిస్తున్నట్లు చిత్రిస్తారు. పద్మం అనేక రేకులతో అనేక ముగ్గుల మధ్యన ఒప్పారుతుంటాయి. కొన్ని పద్మాల మధ్యన పాదం గుర్తులను చిత్రిస్తారు. రాజస్థాన్,ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో "భాయిదూజ్" పండుగనాడు కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకమైన రంగోలిని చిత్రిస్తుంటారు. అన్నాచెల్లెల్లు తమ ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి ఈ పండుగను జరుపుతారు. కార్తీక మాసంలోని దీపావళి అమావాస్య రెండవరోజునాడు ఈ పండుగ వస్తుంది. ఆరోజు సోదరి, సోదరుణ్ణి తన ఇంటికి ఆహ్వానించి మిఠాయిలను తినిపిస్తుంది. సోదరుడు ఆమెకు కట్నకానుకలను సమర్పిస్తాడు. ఆరోజు సోదరి స్నానం చేసి, బియ్యం పిండి ద్రవంలో ముంచిన గుడ్డపేలికతోగానీ, బ్రష్‌తోగానీ రంగోలిని వాకిలినిండా వేస్తుంది. ఈ రంగోలి, పండుగ ప్రత్యేకతను సూచిస్తుంది. దీనిలో 5 చతుర్భుజాలుంటాయి. స్త్రీ-పురుషులను సూచించే రేఖా చిత్రాలుంటాయి. ఈ రంగోలిలో పశుపక్ష్యాదుల రూపాలు, పూలు, లతల రూపాలు జతలు జతలుగా చిత్రితమై ఉంటాయి.


పవిత్ర


భాయిదూజ్

దారంతో చేసిన హారాలు, పసుపు కుంకుమలను రంగోలిలో పెట్టుతారు. సోదరి ఈ రంగోలి చుట్టూరా తిరుగుతూ "రాజా రాజ్యాన్ని,

పండితుడు వేదాన్ని, నేను సోదరుణ్ణి పూజిస్తాను" అని పాడుతూ, చేతిలో బిల్వ కొమ్మలను పట్టుకొని దాని ముళ్ళను తీసి పారవేస్తుంది. తన సోదరుని జీవితంలో ముళ్ళలాంటి కష్టాలుండకూడదని సోదరి కోరిక. స్వంత సోదరిలేని వాడు చిన్నమ్మ లేదా పెద్దమ్మ కూతుళ్ళ దగ్గరికైనా పోయి పండుగ జరుపుకోవడం ఆచారం.

హిమాచల్ ప్రదేశ్ ప్రాంతంలోని 'ఎప్పన్'

చదరం ఆకారంలో ఎర్రమట్టితో అలికి దానిపైన దేవతల ప్రతీకలను, జంతువులను, పక్షులను, వివిధ రకాల పుష్పాలను చిత్రిస్తుంటారు. ** స్వస్తిక్‌లు, సర్పాలు,చేపలు, తాబేలు, కుండ చిత్రాలను కూడ వేస్తుంటారు. వీరు చిత్రించే నమూనాలు అర్థ చంద్రాకారంలో, వలయాకారంలో, గోపురాకారంలో, ముడి రూపంలో ఉంటాయి. వాకిట్లోనూ, వరండాలోనూ, వివాహ మంటపంలోనూ చిత్రాలను చిత్రించి, పూలరేకులతోనూ, ఆకులతోనూ అందంగా అలంకరిస్తారు. వధువు గృహ ప్రవేశ సందర్భంలో, సంతానం కలిగిన సమయంలో ప్రత్యేకమైన ఎప్పన్ చిత్రాలను చిత్రిస్తారు. ఇంట్లో ఎవ్వరైన మరణిస్తే ఎప్పన్‌ను వెయ్యరు.

భిన్నత్వంలో ఏకత్వం

ఇంతవరకు మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లోని స్త్రీల చిత్రరచనలను పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలన వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రమణీమణులు రంగవల్లులను వేసే విధానంలో, పేర్లలో వైవిధ్యం గోచరించినను, రూపాల్లో సామ్యం అనంతం అని స్పష్టమౌతుంది. అన్ని ప్రాంతాల్లోని పద్మం, స్వస్తిక్, పాదగుర్తులు అతివలందరికీ మంగళప్రదాలు. నక్షత్రాలు, సూర్యుని సంకేతాలు, త్రిభుజాలు, షడ్భుజాలు అన్ని ప్రాంతాల్లోని స్త్రీలు రచించే చిత్రాల్లో కనపడుతాయి

వివిధ ప్రాంతాల్లో వనితలు వేసే ముగ్గుల్లోని చిత్రాల ప్రయోజనం, పరమార్థం ఒకటే. ప్రయోజనం పరిశుభ్రత, సౌందర్య ప్రదర్శనం. పరమార్థం సమయ సందర్భంలోని ప్రత్యేకతలను, స్త్రీ మనోభావాలను సూచించడం. ఏ ప్రాంతానికి చెందిన స్త్రీ అయినా తన మనోగతాభిప్రాయాలను సౌందర్య ప్రధానంగా, సందర్భానుసారంగా, సంప్రదాయపరంగా ముగ్గులనే చిత్రలిపిలో లిఖిస్తున్నదనే అంశం విశదంగా వివిధ రాష్ట్రాల్లోని రంగవల్లుల పరిశీలన వల్ల నిరూపితమౌతుంది. హిమాచల్ ప్రదేశ్ నుండి కన్యాకుమారి వరకు వ్యాపించిన స్త్రీల ముగ్గులను పరిశీలిస్తే వాటి లక్ష్య, లక్షణాల్లో, చిత్రీకరణల్లో సామ్యాలనేకం కనిపిస్తాయి. భారతదేశంలో వివిధ భాషలు, జాతులు, మతాలున్నా భిన్నత్వంలో ఏకత్వాన్ని ముగ్గుల చిత్రీకరణ బుజావు పరుస్తున్నది. భారతీయ స్త్రీలందరూ సమయం, సందర్భం, పండుగ, ఉత్సవ, శుభకార్యాలను సూచించే చిత్రాలను, దేవతా ప్రతీకలను ముగ్గుల్లో చిత్రిస్తారు.

స్త్రీలు తమ కోరికలను తీర్చుకోవడానికి, భగవంతునికి నివేదించుకునే విన్నపాలుగా కూడ, రంగోలిని తీర్చుతారు. భక్తునికి, భగవంతునికి మధ్య మాధ్యమ సాధనంగా(Media) రంగోలిని భావిస్తారు. కళ్యాణప్రాప్తికి, ఐశ్వర్య ప్రాప్తికి, మోక్షప్రాప్తికి, ధాన్యసంపదకూ, పశుసంపదకూ, రంగోలిని చిత్రిస్తారు.

ప్రకృతిలోని పశుపక్ష్యాదులను, పూలను, తీగలను, కాయలను, పళ్ళను, గృహోపకరణాలను, వృత్తిపరికరాలను, పౌరాణిక ఇతివృత్తాలను సూచించే చిత్రాలను చిత్రిస్తారు. అయితే వీటి ఆకారాలను కొన్నింటిని మాత్రమే రంగోలిలో చూడగానే పోల్చగలము. కొన్ని రంగోలి పేర్లకూ, చిత్రాలకూ సంబంధం ఉండదు. కొన్నింటి ప్రతీకలను మాత్రం రంగోలిలో చూడగలము.

సౌందర్యంలోనే శివాన్ని సందర్శించే సంప్రదాయం భారతీయ సంప్రదాయం. ముగ్గు చిత్రాల సౌందర్యంలోనే స్త్రీల భగవదారాధన ఉంటుంది. దేవతల రూపాలు ఉండవు కాని వారి ప్రతీకలు ముగ్గుల్లో ఉంటాయి. లక్ష్మికి ప్రతీకగా దేశమంతటా పద్మం వేస్తారు. భగవంతుని ఆగమనానికి గుర్తుగా పాదాల గుర్తులను చిత్రీకరిస్తారు. శుభానికి, సూర్యునికి సంకేతంగా 'స్వస్తిక్'ను చిత్రిస్తారు. వలయం, చక్రం, రథం,సూర్యుని చిహ్నాలు. స్త్రీలు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు. దేశమంతటా పంటలు ఇంటికి చేరినప్పుడే రంగోలిని ఎక్కువగా వేస్తారు. ఈ సందర్భంలో వేసే ముగ్గులు వలయాకారంలో ఉంటాయి. వలయం కడుపునిండడాన్ని సూచిస్తుంది. శుభకార్యాలకు వేసే ముగ్గులెక్కువగా చతురస్రాకారంలో ఉంటాయి. ఇవి స్థిరత్వాన్ని సూచిస్తాయి. అంటే శుభం స్థిరంగా నిలిచిపోవాలనే కోరికను ముగ్గుల్లో సూచిస్తారు.

దేశమంతటా రంగవల్లి చిత్రీకరణ స్త్రీల ప్రత్యేక కళ అయినా, గ్రామదేవతల ఉత్సవాల్లో, భూతారాధనలో, సర్పారాధనోత్సవాల్లో పురుషులే పూజారులుగా ఉండి పెద్ద ముగ్గులను, మండలాలను వేస్తుంటారు.

భారతదేశమంతటా రంగోలి రేఖ,స్త్రీల సంప్రదాయ పరిరక్షక రేఖ, దుష్టశక్తులను దరికి చేరనివ్వని రక్షరేఖ, చిత్రకళాభివ్యక్తీకరణ రేఖ, ఆరోగ్యప్రసాదిత రేఖ, కోరికలను పూరించే రేఖ, సౌందర్య రేఖ.

ముగ్గులు - వివిధ శాస్త్రాంశాలు

ముగ్గులు స్త్రీలకు సాంప్రదాయిక విజ్ఞాన నిధులు. తరతరాల వారికివి విద్యాపీఠాలు. అందంగా వాకిళ్ళను అలరించే ముగ్గులు అతివల వివిధ శాస్త్రాంశాల పరిజ్ఞానానికి, చిత్రలేఖనాకళాభిజ్ఞతకు ప్రతీకలు. తల్లులు తమ బాలికలకు చిన్నతనంనుండియే ముగ్గులను వేయమని ప్రోత్సాహిస్తూ శిక్షణ ఇస్తారు. బాలికలు కూడ ముగ్గుల్లోని సౌందర్యానికి ఆకర్షితులై చలిలో, వాకిట్లో తల్లితోపాటే కూర్చుని ముగ్గులను పరికించి, పరిశీలించి, చిత్రీకరణకు ప్రయత్నించి సఫలీకృతులౌతారు. జానపద విజ్ఞానంలోని ప్రతికళను బాలికలు బలవంతంగా ఇచ్ఛావ్యతిరేకంగా అభ్యసించరు. పాటలు పాడడం, కథాకథనం, ముగ్గులు వేయడం, అల్లికలు, కుట్లు మొదలైన కళలన్నింటినీ బాలికలు తమ ఇచ్ఛాపూర్వకంగా, ఆసక్తితో అధ్యయనం చేసి ప్రవీణులై మళ్ళీ తమ సంతానానికి వాటిపైన శ్రద్ధాసక్తులను కలిగిస్తుంటారు. అందుకే వీటిలో సహజత్వం, వాస్తవికతలు ప్రతిబింబిస్తాయి.

ముగ్గుల ఉత్పత్తి వికాసాలు గృహాంగణాలే కాబట్టి ఇవి గృహ సంబంధమైన, స్త్రీ సంబంధమైన విజ్ఞానాన్ని వ్యక్తం చేస్తుంటాయి. అంతియేకాక ఇవి స్త్రీల రేఖాగణిత, గణిత, క్రీడ, వైద్య శాస్త్ర పరిజ్ఞానాలకు నిదర్శనాలు. పండిత శ్రేష్ఠుల చిత్ర కవిత్వంలోని చిత్రాలకూ, ముగ్గు చిత్రాలకూ సామ్యం అనంతం. ఈ అధ్యాయంలో ముగ్గుల్లో గోచరిస్తున్న వివిధ శాస్త్రాంశాలను పేర్కొనడం జరుగుతుంది.

<u>ముగ్గులు - రేఖాగణిత శాస్త్రం</u> : రేఖాగణిత సౌందర్యం రత్నాల ముగ్గుల్లో రమణీయంగా ప్రతిబింబిస్తుంది. ముగ్గుల్లో వృత్తాలు, చదరాలు, దీర్ఘ చతురస్రాలు, చతుర్భుజాలు, షడ్భుజాలు, త్రికోణాలు,

అష్ట కోణాలు ప్రధాన స్థానాన్ని వహిస్తాయి. వీటితోనే ముగ్గులు రూపొందుతుంటాయి. ఒకే ముగ్గులో వలయం, త్రికోణం, చతుర్భుజం, దీర్ఘచతుర్భుజం, రేఖాగణిత శాస్త్రంలో మాదిరి సమభుజాలు, కోణాలు చిత్రింపబడుతాయి. వీటిని చిత్రించడానికి గణిత శాస్త్రజ్ఞులు ఉపయోగించే పరికరాలు పల్లెపడతులకు తెలియవు. కాని వారు తమ చేతి వ్రేళ్ళనే పరికరాలవలె ఉపయోగించుకుంటారు. క్రింది చిత్రాలను పరిశీలిస్తే ముగ్గుల్లోని రేఖాగణిత శాస్త్రాంశాలు విదితమౌతాయి.



రేఖాగణిత చిత్రాలు

<u>ముగ్గులు - గణిత శాస్త్రం</u>: గణిత శాస్త్రానికి ఆధారభూతమైన కూడిక, గుణింతం, తీసివేతలను సూచించే + , × , — గుర్తులు కొన్ని ముగ్గుల రూపకల్పనకు మూలాధారాలు. ఈ గుర్తులతోనే పక్షుల రూపాలు కూడ రూపొందుతాయి.



+ గుర్తుతో రూపొందిన ముగ్గులు

అనేక ముగ్గులకు మూలాంశమైన స్వస్తిక్ × లేదా + గుర్తులోనే ఏర్పడుతుంది.





× గుర్తులతో రూపొందిన ముగ్గులు

<u>ముగ్గులు - అక్షరాలు</u>: స్త్రీలందరూ అక్షరజ్ఞానులు, పండిత శిఖామణులు కాకపోవచ్చు. కాని వారి చిత్రలిపిలోని అక్షరాలు మనని చదివింప చేస్తాయి. "ఆంధ్రాక్షరంబులు ముద్దులొలుకు గుండ్రని ముత్తియములు" అని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి వక్కాణ. ముత్యాల వంటి ఆంధ్రాక్షరాలను ఆధారం చేసుకొని ముత్యాల ముగ్గులను, గీతల ముగ్గులను రూపొందిస్తుంటారు. ఇవి ఎక్కువగా అంచుల ముగ్గుల్లో కనిపిస్తుంటాయి.

తలకట్టు లేని 'ద' అక్షరం

మధ్యన అడ్డగీత లేని 'అ' అక్షరం

తలకట్టు లేని 'ర' అక్షరం, ///' అక్షరం

తలకట్టులేని 'కౌ' లేదా 'ఔ' అక్షరం

నేడు కొన్ని కాన్వెంటు పాఠశాలల్లో పిల్లలచేత పూర్ణబిందువు, అర్ధబిందువు వంటి రేఖా చిత్రాలను చిత్రింపచేసి తర్వాత అక్షరాలను బోధించడం ప్రారంభిస్తారు. ముగ్గుల్లోని పూర్ణ, అర్ధ బిందువులు, త్రికోణ, చతుర్భుజాలు కూడ బాలికల చిత్రకళ, అక్షరాభ్యాసానికి పునాదులు.

ఒకే ముగ్గులో అనేక అక్షరాలు గోచరిస్తుంటాయి. ఈ అక్షరాల అందం పద్మంతో ఇనుమడిస్తుంది. Welcome, Happy New Year, Happy Pongal అనే శుభాకాంక్షా పూర్వక పదాలతో కూడిన ముగ్గులనేకం నేటి ఆధునిక కాలంలో ముంగిళ్ళముందు లిఖించబడుతున్నాయి.







V.S.T.M - ఇంగ్లీషు అక్షరాల ముగ్గు
తలకట్టులేని క, ద అక్షరాల ముగ్గు
Wish you happy new year 1989

ముగ్గులు - వివిధ శాస్త్రాంశాలు

ముగ్గుల్లో మహిళలు అక్షరాలను ఆలోచనా పూర్వకంగానో, అనాలోచితంగానో రూపకల్పన చేసినను, అక్షర జ్ఞానులు మాత్రం అక్షరాలను అతి సులభంగా గుర్తిస్తారు. ఈ ముగ్గులను వేసేవారు అక్షరజ్ఞానశూన్యులైనను, వృద్ధులైనను ముగ్గు అందానికి ఆకర్షితులై వాటిని నేర్చుకొని వేస్తుంటారు. ముగ్గు అక్షరాస్యులను, నిరక్షరాస్యులను సమానంగా ఆకర్షించి అలరిస్తుంది.

<u>ముగ్గులు - రసాయన శాస్త్రంలోని నిర్మాణ రూపాలు</u> : ఇళ్ళల్లో ఉండే ఇంతులకు రసాయనిక శాస్త్ర పరిజ్ఞానం ఉంటుందని నిర్ధారణగా చెప్పలేము. కాని రసాయనిక శాస్త్రంలోని బెంజిన్, క్లోరోఫిల్ నిర్మాణ రూపాలే కాక, హిమోగ్లోబిన్ రూపం కూడ ముగ్గులో కనపబడుతుంది.



బెంజిన నిర్మాణ రూపం,



ముగ్గులోని షట్భుజాకారాలు



హిమోగ్లోబిన్ నిర్మాణం, క్లోరోఫిల్ నిర్మాణం, ముగ్గు

చెట్లలోని క్లోరోఫిల్ 'ఫొటోసింథసిస్' జరగడానికి కారణం. క్లోరోఫిల్ చెట్టుకు ప్రాణం. మనిషికి రక్తంలోని హిమోగ్లోబిన్ ప్రాణాధారం. ఆచార సంప్రదాయాల్లోని ముగ్గు మంగళప్రదం, ఆరోగ్యకారణం. క్లోరోఫిల్, హిమోగ్లోబిన్, ముగ్గు, నిర్మాణ రూపాల్లోని పోలికలు యాదృచ్ఛికమే అయినా ఈ మూడింటి గుణధర్మాల్లో సామ్యం ఉండడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

తెలుగు స్త్రీలు వేసేటి అతిసామాన్యమైన, సరళమైన గీటు ముగ్గులో అణు నిర్మాణం గోచరిస్తుంది.



అణు నిర్మాణం, ముగ్గు

హిందూ స్త్రీలు రసాయనిక శాస్త్ర పరిజ్ఞానంతోనే ముగ్గులను చిత్రించినారని నిర్ధారించి చెప్పలేం. చరకుడు, శుశ్రుతుడు నాగార్జునుడు, ఆర్యదేవ మొదలైన శాస్త్రవేత్తలు వైద్య, రసవాద, గణిత, ఖగోళ శాస్త్రాల్లో ప్రావీణ్యం గడించి శాస్త్రగ్రంథాలను రచించారు. అయినా వీరి శాస్త్ర ప్రభావం మహిళల ముగ్గులపైన ప్రసరించిందని తగిన ఆధారాలు లేకుండ నిర్ణయించలేము.

<u>ముగ్గులు - చిత్ర కవిత్వంలోని చిత్రాలు</u> : చిత్రాకారంలో లిఖించే కవిత్వం చిత్రకవిత్వం. ఈ కవిత్వం కవుల కవితా ప్రతిభకూ, చిత్రకళాభిజ్ఞతకూ చక్కటి ఉదాహృతి. చిత్ర కవిత్వంలో వివిధ కవులు చిత్రించిన చిత్రాలను పరిశీలిస్తే వీటికి పుట్టిల్లు పడతుల చిత్రలిపులనే అభిప్రాయం జనిస్తుంది. ముగ్గుల్లోని చతుర్దళ, షట్ దళ,

అష్టదళ, ద్వాదశదళ, షోడశదళ, సరసీరుహాలు చిత్రకవిత్వంలో ప్రతిబింబిస్తున్నాయి. స్త్రీలు సంక్రాంతి సమయంలో గృహ ప్రాంగణాల్లో చిత్రించే రథం గుచ్ఛబంధం, ముగ్గులో, చిత్రకవిత్వంలో గోచరించి మనలను ఆశ్చర్యచకితులను కావిస్తాయి.

మగువలు విరివిగా వేసెడి చేపలు, శంఖాలు, ధనుస్సు, గంధంగిన్నె మొదలైన ముగ్గులు చిత్రకవిత్వంలో చోటు చేసుకున్నాయి. పండిత శిఖామణులు తమ రమణీమణులు తీర్చెడి రంగవల్లికలకు ఆకర్షితులై వాటినే చిత్ర కవిత్వానికి ఆధారాలుగా స్వీకరించి ఉండవచ్చు. చిత్రకవిత్వ ప్రభావమే స్త్రీల ముగ్గులపైన ప్రసరించిందని మాత్రం చెప్పలేం. చిత్రకవిత్వం సామాన్య ప్రజాదరణను పొందలేదు. నిరక్షరాస్యులైన గృహిణులు ప్రజల్లో ప్రచారం చెందని చిత్రకవిత్వం చేత ప్రభావితులై ముగ్గులను వేసినారనే అభిప్రాయం వాస్తవానికి విరుద్ధమౌతుంది. అందుకే చిత్రకవిత్వంపైన ముగ్గుల ప్రభావం ఉందని చెప్పడమే సమంజసం.

చిత్ర కవిత్వంలోని చిత్రాలు సారస్వతానికి, చిత్రకళకూ మధ్యన ఉండే సంబంధానికి తార్కాణాలు. ముగ్గులకు, చిత్రకవిత్వానికి మధ్యన ఉండే సామ్యాలు పండితుల కళకూ, పల్లెపడతుల కళకూ మధ్యన ఉండే అవినాభావ సంబంధానికి నిదర్శనాలు.



రథం



సీ॥ శ్రీ జలజాక్ష లక్ష్మీ రమణీయ
నానంద దేహ ! సత్యభిరామ!
ధీభార ! బుధవరధ్యేయ శ్రుత్యర్థామ
భావిత మద్యగ్ర్య బాణవాగ్ని
ప్రాన్ బంధహరధర్మ బద్ధ దీప్తాశ్రితో
త్కార విశ్వమూర్త్యక్షి సరసముఖ్య
తరకళా విలసిత సరస వాస్యలకృతి
విరచనాచణ పరభృతి విరహిత



తే.గీ వందిరాజాన్య నాదురత్నాకరశివ
లక్ష్మీ నారాయణాఖ్య! సల్లక్షణములు
భవదీక్షిత బిరుదు విభ్రాజమాన
ధృతి చిదానంద సారస్వతీ నమోస్తు.

సర్పబంధం

ద్యుతిధర దేవకీతనయా !
తోయభవస్తుత భూరమేశ సం
మితి గుణసార భూతి దయ
మేయ బృహజ్జన పూరుషానవా
జితి నరకా పురాతనయ !
జేయ సవిష్కార భార వాహశా
శ్వత పురుహూత పీతదవ !
పావకశస్త్ర పురాణ కోవిదా !
—అప్పకవీయం.



హ్రీం ముగ్గు



ముగ్గు

గుచ్ఛ బంధం

గాదిలితో మాలదిగా
గాదిలి కించెన్ బదిగా
గాబది కృష్ణుండదిగా
గాదిడ వాచాలిదిగా



శంఖ బంధం

"హరవర హార వారా
హరహరీ నరహరి హరశరకర హారా
గారధర ధీర చారా
హరహరీ మురహరి పరపరహారధరా"



ముగ్గులోని శంఖాలు

మత్స్య బంధం

రార కన్నయ్య హాటాహాటి
కోరజేరితివి మేరగా
గారవించి కొలంద్రోలగా
మేర యారా యెదవెంతురా



చేపల ముగ్గు







షట్పత్ర బంధం

రాపులేం పంచన నాప్తా పమోరు
దక్షభూరు డోషాజి సామేక్షణార్య
బిట్టుగా మాటి కక్లనే రెట్టిగాసు
రాధ్య నేర్వొడ్డ వేడనే యద్రిధీర -





అష్టదళ పద్మ బంధం

"సాకేత త్రాణ వేలా జవిత తనిజ ప్రాజ్మణ శ్రీ ప్రభాసా"



ధనుర్బంధము

"హరశంకర సర్వేశ త్రిపురారే మహాప్రభో
పాహి పాహి భవార్ణం మాంహరీష్టజిత మన్మథ"



(చిత్ర కవిత్వంలోని ఈ చిత్రాలన్నీ శ్రీ ధర్మేశ్వరరావుగారి "తెలుగులో చిత్ర కవిత్వము" పరిశోధనా వ్యాసం నుండి గ్రహింపబడినాయి.)

<u>ముగ్గులు – వాస్తు శిల్పం</u>.: ముగ్గులను పరిశీలిస్తే వాటిని చిత్రించిన స్త్రీలో వాస్తు శాస్త్ర పరిజ్ఞానం ఉందనే అభిప్రాయం ఏర్పడుతుంది. చదరాలతో, అర్ధ చంద్రాకారాలతో కూడిన ముగ్గులు వాస్తు శాస్త్ర నిర్మాణ నమూనాలను పోలి ఉంటాయి. ప్రాచీన కాలంలోని స్త్రీలు తాము నివసించే గృహ నిర్మాణ నమూనాలను, నగర నిర్మాణ నమూనాలను ముగ్గుల్లో చిత్రించి ఉండవచ్చు. ఈ ముగ్గులే సంప్రదాయపరంగా నేటి వరకు కొనసాగుతున్నాయని భావించవచ్చు. స్థలాన్ని బట్టి పెంచుకుంటూ పోయే కొన్ని ముగ్గులు, జనసంఖ్యను బట్టి పెరిగే పట్టణ నిర్మాణాలను అనుసరించి ముగ్గులు ఏర్పడి

ఉండవచ్చు. ఈ అభిప్రాయానికి ఉపబలకంగా రాజస్థాన్ లో స్త్రీలు వేసే మండనలను 'ఖేరా' అని కూడా పిలుస్తారు. ఖేరా అంటే నగరం అని అర్థం కూడ ఉంది. [49] తెలుగువారిలో కూడ ఇంటికి ముగ్గు పోయడం ఉంది.

ప్రాచీన శాస్త్రాల్లో వివరించిన కొన్ని గ్రామ నిర్మాణాది నమూనాలు ముగ్గుల రూపాలను పోలి ఉన్నాయి. మానసార శాస్త్రంలో దండక, సర్వతోభద్ర, నంద్యావర్త, పద్మక, భద్రక, స్వస్తిక్, ప్రస్తర, కార్ముఖ, చతుర్ముఖం అని ఎనిమిది విధాలైన గ్రామ నగరాది నిర్మాణ భేదాలు, వాటి లక్షణాలు వివరింపబడినాయి. [50] సర్వతోభద్ర నగర నిర్మాణం చతురస్రంగా ఉంటుంది. నగర మధ్యన దేవాలయం ఉండి, నగరం నాలుగు విభాగాలుగా విభజింపబడుతుంది. దేవాలయానికి నాలుగు త్రోవలుంటాయి. ఒక్కొక్క విభాగంలో ఒక్కొక్క వర్గంవారి నివాసాలుంటాయి. హరప్పా మొహంజొదారో నగరం కూడ చతురస్రాకారంలో నిర్మితమై ఉత్తరం నుండి దక్షిణానికి, తూర్పు నుండి పడమరకు, విశాలమైన త్రోవలుండెడివి. ఈ నాలుగు త్రోవలు నగర ద్వారాలుగా ఉండేవి. ఈ వర్ణనను పోలిన రూపాలు ముగ్గుల్లో అనేకం కనపడుతాయి.

పురమధ్య ప్రదేశంలో దేవాలయం ఉండి, ఉత్తరం నుండి దక్షిణానికి తూర్పునుండి పడమరకు ముఖ్యమైన వీధులతో, వృత్తాకారంలో నగరం చుట్టూర గోడ ఉంటే నంద్యవ్రత నగర నిర్మాణం అవుతుంది.

పద్మక నగర నిర్మాణ రూపం పద్మాన్ని పోలి ఉంటుంది. ఈ నిర్మాణ రూపాలు ముగ్గులతో సామ్యాన్ని పొంది ఉన్నాయి.

దేవాలయ నిర్మాణ నమూనాలతో, స్థూపనిర్మాణ నమూనాలతో కొన్ని ముగ్గుల రూపాలు పోలి ఉన్నాయి. పరస్పర ప్రభావితాలైన ఈ

రూపాల్లోని మూలరూపాన్ని కనుగొనడం అసాధ్యం.

నల్గొండలోని నాగులపాడు దేవాలయ నగర నిర్మాణ నమూనాను పోలిన నమూనా ముగ్గులో ఉంది.[1]



నాగులపాడు దేవాలయ నిర్మాణం, ముగ్గు

ప్రసిద్ధి పొందిన ఖజొరాహా దేవాలయ నిర్మాణ నమూనాను పోలిన రూపాలు ముగ్గుల్లో ఉన్నాయి. ఈ ముగ్గు నమూనాను తెలంగాణా స్త్రీలు రవికెం మీద కుట్టుకుంటారు. దీన్నే వారు పోత అని అంటారు. ఈ పోత కుట్టు నేతలో కలసి పోయినట్లుగా స్త్రీ కళానైపుణ్యాన్ని వెలార్చుతుంటుంది.



1

ఈ నమూనాలో జన సంఖ్యను బట్టి నగరాన్నీ, స్థలాన్ని బట్టి ముగ్గునూ పెంచుకోవచ్చు. ఒక్కొక్క చదరం ఒక్కొక్క వీధి.

సర్వతోభద్రనగర నిర్మాణ నమూనాను పోలిన ముగులు. 1,2,3.



2



3

మధ్యలో దేవాలయం, నాలుగు త్రోవలతో కూడిన నగర నిర్మాణ నమూనాలను 2,3, ముగ్గులు పోలి ఉన్నాయి.



వలయాకార నిర్మాణ నమూనా



పద్మక నగర నిర్మాణ రూపాన్ని పోలిన ముగ్గు



ఖజురాహో దేవాలయ నగర నిర్మాణ నమూనా.

ద్రుంముగ్గు

నాగార్జున కొండపైన వివిధ రకాల స్థూప నిర్మాణ నమూనాలు ఉన్నాయి. స్వస్తిక్‌ను మధ్యన కలిగిన స్థూప నిర్మాణ నమూనా ముగ్గులో ఉంది.



స్వస్తిక్ స్థూపం. ముగ్గు

నాగార్జున కొండపైన 6,8,10 ఆకులతో చక్రాలవలె వలయాకారంలో స్థూప నిర్మాణ చిత్రాలు, కట్టడాలున్నాయి. ముగ్గుల్లో కూడ 6,8,10 ఆకులతో కూడిన చిత్రాలున్నాయి.

తమిళ సంప్రదాయ ప్రభావితులైన తెలుగు స్త్రీలు నవగ్రహాలకు చెందిన ముగ్గులను పూజామందిరాల్లో చిత్రిస్తుంటారు. నెల్లూరు నివాసి వైష్ణవ సంప్రదాయానికి చెందిన తెలుగు స్త్రీ ఈ ముగ్గులను చిత్రించింది. తమిళ దేశంలో నవగ్రహాల ముగ్గుల్లో నవధాన్యాలను నింపి పూజ చేస్తారు.*52



సూర్యుడు. చంద్రుడు. అంగారకుడు. బుధుడు. బృహస్పతి. శుక్రుడు. శని. రాహువు. కేతువు

<u>ముగ్గులు–యోగ విజ్ఞానాంశాలు</u> : ఆధ్యాత్మికుల దృష్టిలో మానవ జీవిత పరమార్థం మోక్షసాధన. మోక్షప్రాప్తికి జ్ఞాన, భక్తి,కర్మ, వైరాగ్యాలు మార్గాలు. పరమాత్మ తత్త్వాన్ని గ్రహించడమే జ్ఞానం. అద్వైతుల దృష్టిలో ఆత్మ సాక్షాత్కారమే జ్ఞానం. పరమాత్మ తత్త్వాన్ని లేదా ఆత్మ సాక్షాత్కారాన్ని సాక్షాత్కరింప చేసేదే యోగ సాధన. యోగం చిత్తవృత్తులను నిరోధిస్తుంది. ఏకాగ్రతను కలిగిస్తుంది. ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.

యోగసాధనలోని ఏకాగ్రతా ప్రాధాన్యం ముగ్గు వేయడంలో కూడ కనపడుతుంది. చిత్రించే చిత్రంపైన ఏకాగ్రత లేకుంటే ముగ్గు రూపం అందంగా అమరదు. ముగ్గను మగువలు రెండుకాళ్ళను కొంచెం ఎడంగా పెట్టి వంగి వేస్తుంటారు. ఇది వారికి చక్కటి వ్యాయామం శరీర ఆరోగ్యానికి , సౌందర్యానికి దోహదం చేస్తుంది. చక్కటి శరీర సౌష్టవానికి కాళ్ళను కొంచెం ఎడంగా పెట్టి వంగి చేతులతో పాదాలను స్పృశించమని నేటి ఆధునిక సౌందర్య చికిత్సాలయ నిర్వాహకులు (Beauty Clinics) వివరిస్తున్నారు. ఈ ముగ్గులను వేసే వ్యాయామంవల్లనే నాటి స్త్రీల అంగ సౌష్టవం చక్కగా ఉండేదని ఊహించవచ్చు.

సప్త ధాతువులచేత కప్పబడిన ఈ దేహంలో సప్త చక్రాలు ఉన్నాయి. ఇంద్రియాలను స్వాధీన పరచుకోవడానికి, వాయువును సప్త చక్రాల్లో ప్రసరింపచేస్తే, శరీరం నందలి నాడుల్లోని మాలిన్యం తొలగిపోతుందని యోగసాధకులు వివరిస్తారు. ఈ చక్రాల్లో వివిధ పద్మ దళాలుంటాయి.



సహస్రదళ పద్మం ముగ్గు

మూలాధార చక్రంలో - 4 పద్మ దళాలు, స్వాధిష్ఠాన చక్రంలో - 6 కమలం రేకులు, మణిపూరక చక్రంలో - 10 దళాలు, అనాహత చక్రంలో - 12 దళాలు, విశుద్ధ చక్రంలో - 16 రేకులు, ఆగ్నేయ చక్రంలో - 2 దళాలు, సహస్రారంలో - 1000 రేకులుంటాయి - ఈ సంఖ్యల్లోని పద్మ దళాలతో అనేక ముగ్గులు చిత్రింపడుతుంటాయి. సహస్రదళ పద్మం కూడ ముగ్గుల్లో ఉంది.

యోగాసనాల్లో కొన్నింటికి పద్మాసనం, స్వస్తికాసనం, ధనురాసనం, చక్రాసనం, అని పేర్లున్నాయి. ఈ పేర్లను సూచించే చిత్రాలు ముగ్గుల్లో కూడ ఉన్నాయి.

యోగ సాధకులు వెన్నెముకకు ఎడమ కుడి ప్రక్కల ఇడా, పింగళ నాడులు వీటి మధ్య సుషుమ్నా నాడి ఉంటుందని వివరిస్తారు. సుషుమ్నా నాడికి క్రింది భాగంలో చివరవరకూ కుండలిని శక్తి పాములాగ చుట్టుకొని మూలాధార చక్రంలో ఉంటుంది. ఈ కుండలియే ఆత్మజ్ఞాన శక్తి ఈ శక్తి మూలాధార పద్మంలో నిద్రించి ఉంటుంది. యోగసాధన ద్వారా కుండలిని మేలుకొల్పితే అది

సుషుమ్నా మార్గంలో షట్చక్రాలను దాటి, సహస్రాకార చక్రాన్ని చేరుతుంది. కుండలినీ శక్తి సహస్రారం చేరితే ఆత్మకు స్వేచ్ఛ చేకూరి పరమాత్మలో లీనమౌతుంది. పాము వలె చుట్టచుట్టుకొని ఉన్న కుండలినీశక్తి రూపం ముగ్గుల్లో కనపడుతుంది.

స్త్రీలకు యోగ విద్య పరిజ్ఞానం ఉందో లేదో కాని; యోగులు వివరించే, సర్ప రూపాన్ని ముగ్గుల్లో చిత్రిస్తారు. సుషుప్తావస్థలోని సర్పాకృతి, మేల్కొంటున్న సర్ప రూపాలు ముగ్గుల్లో గోచరిస్తాయి.



నిద్రనుండి మేల్కొంటున్న కుండలినీ శక్తి   చుట్టుకున్న కుండలినీ శక్తి

సప్త చక్రాల్లోని పద్మ దళాలు, సహస్రారం, కుండలినీ శక్తి సర్పాకృతి, పద్మాలు ముగ్గుల్లో ప్రస్ఫుటమౌతున్నందువల్ల యోగ పరిజ్ఞానం పడతులకు ఉందేమో అనెడి ఊహ ఏర్పడుతుంది. యోగ విద్యలోని చిత్రాలు, ముగ్గులు పరస్పర ప్రభావితాలని కూడ నిరూపితమౌతున్నాయి.

<u>ముగ్గులు - వైద్యశాస్త్రం</u> : పల్లె యువతులు ప్రభాత సమయానికి పూర్వమే వాకిట్లో కలయంపి చల్లి ముగ్గులు వేసే సంప్రదాయంలో ఆయుర్వేదాంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. అప్పుడే అలికిన గోమయం కస్తూరితో సమానమని ఆయుర్వేద వైద్యుల వివరణ.

గోమయం క్రిమిహారి వాయుదోషాలను, మశుచకాది దోషాలను దరికి రానివ్వదు. దోమల బాధను నివారిస్తుంది. గోవువల్ల ప్రాప్తించే ప్రతి వస్తువు మనకు ఆరోగ్యకరం మంగళకరం. గోమయం, గోమూత్రం, గోఘృతం, గోక్షీరం, గోరోజనం హిందువులకు శుభప్రదాలు. అందుకే మత సంబంధమైన ప్రతి ఆచారంలోనూ "గోమయేనానులిప్య" అని పేర్కొంటారు. ప్రతి శుభకార్యానికి వీటిలో ఏ ఒక్కదాన్నైన వాడడం హిందువుల ఆచారం.

సూక్ష్మజీవుల సంహారిణి అయిన గోమయంతో అలికిన విశాలమైన వాకిలి తెల్లటి ముగ్గులతో నక్షత్రాలతో కూడిన నీలపుటాకాశం వలె విరాజిల్లు తుంటుంది. ముగ్గు నయనానందకరమే గాక, ఆరోగ్యకరం. ముగ్గు పొడికి సూక్ష్మక్రిములను సంహరించే శక్తి ఉంది. అందుకే అతివలు వాకిట్లో ద్వారం దగ్గరనే ముగ్గు గీతలను గీస్తుంటారు. వాకిట్లో నుండి ఇంట్లోకి సూక్ష్మక్రిములు ప్రవేశించకూడదనే ద్వారానికి అడ్డుగా పొడవైన గీతలను గీస్తారు. సూక్ష్మ జీవులను సంహరించే శక్తి ముగ్గు పొడికి ఉన్నందువల్లనే పల్లెల్లో ఇంట్లోని గోడలకు జానెడు మేర ఎర్రమట్టితో అలికి వ్రేళ్ళ మధ్యనుండి ముగ్గుపొడిని విడుస్తూ గీట్లు కొడతారు. ఇంట్లో గదుల్లోనూ, వరండాల్లో, పెరడులోనూ, మజ్జిగ చిలికే ప్రదేశంలో, కూరాడికుండ, నీటికుండ, పొయ్యి దగ్గర, భోజనాలు చేసే ప్రదేశంలో ముగ్గులను ఆరోగ్య దృష్ట్యా వేసే ఆచారం ఆవిర్భవించింది. తరతరాలనుండి వస్తున్న ఈ ఆచారం పల్లెల్లో నేటికి జీవించి ఉంది.

ప్రతిరోజూ వాకిళ్ళను ముగ్గులచేత అలరింపచేసే స్త్రీలు సంక్రాంతి పండుగకు ప్రత్యేకమైన పెద్ద పెద్ద ముగ్గులతో ముచ్చటగా అలంకరిస్తారు. ఈ సంప్రదాయంలో ఆయుర్వేదాంశం నిగూఢమై ఉంది. ధనుర్మాసం నుండి సూర్యుడు మకరరాశిలో సంక్రమించే వరకు స్త్రీలు వాకిళ్ళను,

వీధులను ముగ్గులతో నింపుతుంటారు. ధనుర్మాసాంతానికి దక్షిణాయనం పూర్తి అయి ఉత్తరాయణం ప్రవేశిస్తుంది. దక్షిణ దిక్కుకు అధిపతి యముడు. యముడు మృత్యుదేవత. దక్షిణాయనంలో నరకలోక ద్వారాలు తెరుచుకొని ఉంటాయని తెలుగు వారి నమ్మకం. ఈ నమ్మకానికి మూలం దక్షిణాయనంలోని రోగ వ్యాప్తికి తోడ్పడే వాతావరణం. దక్షిణాయనం వర్ష, శరత్, హేమంత ఋతువులతో కలిసి ఉండడం వల్ల నేల నీటితో, బురదతో, తేమతో కూడి ఉంటుంది. ఈ వాతావరణం అంటువ్యాధులను వ్యాపింప చేసే క్రిములకు సహాయకారిగా ఉంటుంది. ఈ కాలాన్ని 'యమ దంష్ట్ర కాలం' అని అంటారు. ఈ కాలంలోనే కోరల పున్నమి (మృత్యు దేవత కోరల పౌర్ణమి) అరుదెంచు తుందని, ఈ పున్నమిని దాటితే మరణగండాన్ని దాటినట్లుగానే తలుస్తారు. మృత్యువునకు మూలకారణమైన సూక్ష్మజీవులను సంహరించడానికే వాకిళ్ళను గోమయంతో అలుకుతారు. కొంతమంది గోమూత్రం, పేడతో కలిపిన నీటితో కలాపి చల్లుతారు. అవకాశం లేని వారు గోవుపేడనీళ్ళనే వాకిలిలో చల్లుతారు. ముగ్గు పొడితో ముగ్గులను వేసి వాటి మధ్య గోవు పేడతో చేసిన గొబ్బిళ్ళను పసుపు, కుంకుమలతో అలంకరించి పెడతారు.

సంక్రాంతి పండుగకు ఇంటికి వెల్లవేయించి ఎర్రటి జాజుపట్టీలను అలంకరిస్తారు. గుమ్మాలకు, కడపలకు పసుపును అలది బియ్యం పిండితో, కుంకుమతో గుండ్రని బొట్లను పెడతారు. సంక్రాంతికి స్త్రీలు చల్లెడి కలయంపి, పెట్టెడి ముగ్గులు, గొబ్బిళ్ళు - ఇవి అన్నీ సూక్ష్మక్రిముల సంహారకాలు. గొబ్బిళ్ళ మీద పెట్టెడి గుమ్మడిపూల రంగులకు ఆకర్షితమైన పురుగులు పూవుపై వాలి చనిపోతుంటాయి. సంక్రాంతి తర్వాత కనుము పశువుల పండుగ. పశువులశాలను అలికి ముగ్గులను పెడతారు.

ప్రతి రోజూ ముగ్గు పొడిని ఉపయోగించినప్పటికీ, పండుగల్లో మాత్రం బియ్యం పిండిని వాడుతుంటారు. బియ్యం పిండి పక్షులకు, చీమలకు ఆహారం. దానధర్మాలతో ప్రతి రోజు కార్యక్రమాలను ఆరంభించాలని పెద్దలు బోధిస్తుంటారు. స్త్రీ మొదటి కార్యక్రమం వాకిట్లో ముగ్గు వేయడం. ముగ్గును బియ్యం పిండితో వేస్తే పక్షులకు ఆహారాన్ని ప్రసాదించి పుణ్యం సంపాదించుకోవడంతో సమానమవుతుందని స్త్రీల అభిప్రాయం. పండుగ సమయాల్లో బియ్యం పిండితో కాక ముగ్గు పొడితో ముగ్గులను చిత్రిస్తే నరకానికి పోతారనే నమ్మకం స్త్రీలలో ప్రబలి ఉంది. [64]

ప్రతి రోజూ లేదా ప్రతి శుక్రవారం పూజామందిరంలో బియ్యం పిండితో ముగ్గును వేసి మధ్యన పసుపుకుంకుమలను నింపి అందంగా తీర్చి దిద్దుతారు. బియ్యం పిండికి మురికిని పోగొట్టి శుభ్రపరచే గుణం ఉంది. మశూచికం సోకకుండ నివారించే గుణం దీనికి ఉంది. ఆంధ్రలో ఉగాదిరోజు పిల్లలు బియ్యం పిండిని ముఖానికి పులుముకొని బుట్టలో మొలకలను తీసుకొని గుడికి వెళ్ళుతారు. రాబోయే వేసవి కాలంలో మశూచికం పిల్లలకు సోకకూడదనే అభిప్రాయంతో ఈ ఆచారం ఆవిర్భవించి ఉండవచ్చు. [65] బియ్యం పిండి వేడిని తగ్గిసుంది.

ముగ్గులను, పూజా మందిరంతో సమానమైన పవిత్రత కలిగిన తులసి కోట దగ్గర ప్రతి నిత్యం లేదా ప్రతి శుక్రవారం వేస్తారు. తులసి ఉత్తమమైన ఓషధీ గుణాలను పొంది ఉన్నది కాబట్టే తులసి చెట్టును ప్రతి ఇంటిలో పెట్టుకోవలెనని, ప్రతి రోజూ తులసి కోట చుట్టూర శుభ్రపరచి అలంకరణగా ముగ్గులు వేయవలెనని పెద్దలు శాసించినారు. తులసి గాలిని పరిశుభ్రపరుస్తుంది, ఆకలిని వృద్ధి పరుస్తుంది. రక్తాన్ని శుభ్ర పరుస్తుంది. పార్శ్వశూలలను తగ్గిస్తుంది, చర్మ రోగాలను అణచి

వేస్తుంది, మూత్రవ్యాధులను తొలగిస్తుంది, క్రిమి దోషాలను హరిస్తుంది. ముఖ్యంగా దోమలను రానివ్వదు. కుష్ఠు వ్యాధికి, పాము కాటుకు తులసి ఆకురసం, వేరు నుండి వచ్చే రసం పనిచేస్తుంది. ధన్వంతరి విఘంటువునందు తులసి గుణములను వర్ణింపబడినాయి.

'తులసీ లఘురిక్తోష్ణా రూక్షాచ కఫవాతనుత్
క్రిమి దోషం హరత్యేషా రుచిక్కృద్వహ్నిదీపనీ'

తులసి ఉష్ణాన్ని కల్గిస్తుంది, రూక్షం కలది. కఫవాతం పోగొడుతుంది. క్రిమి దోషాన్నీ హరిస్తుంది, రుచికరంగా ఉంటుంది. అగ్ని దీపనాన్ని కలిగిస్తుంది. ఉత్తమ ఓషధీ గుణాలన్నింటిని పొందిన తులసి పవిత్రమైందనీ, పతివ్రత అనీ, దీన్ని పూజించిన వారు యుగాంతరాలవరకు విష్ణుసాయుజ్యాన్ని పొందుతారని వ్రతకథలు బోధిస్తున్నాయి. జీవితాంతం ఇంట్లోనే కాలం గడిపే స్త్రీల ఆరోగ్యానికి తులసి చెట్టు గాలి ఆరోగ్యకరం. అందుకే బాలికలు, వితంతువులు, ముత్తైదువలు తులసి కోటను ముగ్గులతో అలంకరిస్తారు. వ్రతకథలను చెప్పుకుంటారు. వ్రతాన్ని శ్రద్ధగా ఆచరిస్తారు. ఆరోగ్యాన్ని అనుసరించి ఆచారం, ఆచారాన్ని సమర్థిస్తూ కథలు ఉద్భవిస్తుంటాయి. కాని కాలం క్రమించిన కొలది ఆచారం మిగిలిపోతుంది, అంతరార్థం మాయమౌతుంది.

పూజామందిరంలో, వ్రతం ఆచరించే ప్రదేశంలో, దేవుని పీటపైన, తులసి చెట్టు ముందు పద్మాన్ని చిత్రించి మధ్యన పసుపు కుంకుమలతో నింపుతుంటారు. పసుపు కొమ్ము శ్రేష్ఠమైన ఓషధి. పసుపును ముఖానికి పూసుకోవడం సౌభాగ్య చిహ్నం, చర్మరోగ నివారణం. తెలుగువారు పసుపు వేయని కూరలను వండరు.

క్రిమి సంహారి అయిన పసుపునకు 'క్రిమిఘ్న' అనే పేరు ఉంది. రంగు కల్గించునది కాబట్టి వర్ణవిధాయిని, శరీర వర్చస్సును పెంపొందింప చేస్తుంది. అందుకే పడతులకు ప్రియమైంది, పవిత్రమైంది. 'యోషిత్ప్రియా' గృహాలంకరణకూ, గృహిణి అలంకరణకు పసుపు ఉపకరిస్తుంది. అలంకరణ దృష్ట్యా, ఆరోగ్య దృష్ట్యా అతి ముఖ్యమైన పసుపును ముగ్గుల మధ్య వేస్తుంటారు.

ఈ విధంగా ముగ్గు వేయడంలో మహిళల ముఖ్యోద్దేశం అందం, ఆరోగ్యం, ఆచారంలో ప్రతిబింబింప చేయడమే అని స్పష్టమౌతుంది.

<u>ముగ్గులు - ఆటలు</u> : ముగ్గుల్లో మహిళల జీవిత విధానాలు ప్రతిబింబిస్తుంటాయి. వీరు బాల్యంలో ఆడుకునే ఆటల చిత్రాలను కూడ ముగ్గుల్లో చిత్రిస్తుంటారు.

బాలికలు, యువతులు ఇంట్లోనే కాలక్షేపం కొరకు, మనోవికాసం కొరకు శరీర వ్యాయామం కొరకు ఆటలను ఆడుతుంటారు. ఆరు సంవత్సరాల నుండి పదమూడు పదిహేను సంవత్సరాల వరకు బాలికలు వాకిళ్ళలో తొక్కుడు బిళ్ళ ఆటను ఆడుతుంటారు. ఇది పెంకు బిళ్ళను కానీ, గుండ్రని పన్నని రాయిని కానీ తన్నుతు ఒంటికాలితో ఆడెడి ఆట. ఈ ఆటను తన్నుబిల్ల, తొక్కుడు బిల్ల అని అంటారు. ప్రాచీన కాలంలో కూడ బాలికలు ఈ ఆటను ఆడినట్లు కావ్యాల్లో నిదర్శనాలు కనపడుతున్నాయి.

'డాగిలి మ్రుచ్చులాటలు గ్రచ్చకాయలు
వెన్నెల కుప్పలు తన్ను బిల్ల' - [57]
'దాగిలి మూతలు తన్నుబిల్ల యాలంకి
గుప్పిట గురిగింజ కొండకోతి' - [58]

48472

ఈ ఆటను నేలపైన 8 గళ్ళను గీచి పెంకు బిల్లను వేస్తూ ఒంటికాలితో ఆడుతుంటారు. వెనుకకు తిరిగి బిళ్లను సరియైన గడిలో వేస్తే పంట పండిందని, ఆ గడిని స్వంతం చేసుకుంటారు. పంట పండిన గడి, ధాన్యం పండిన వరిమడికి కానీ, కడుపు పండిన మాతృమూర్తికి కానీ చిహ్నం కావచ్చు.

కొంత మంది బాలికలు అటు నాలుగు, ఇటు నాలుగు గళ్లను కలుపుతూ చివరలో ఒక పెద్ద గడిని గీస్తారు. ఈ తొమ్మిది గళ్లను ఆధ్యాత్మికవాదులు నవరంధ్రాలతోనూ, సందుల్లో చిక్కు కొనకూడని బిల్లను మనస్సుతోనూ పోలుస్తారు.

నాగార్జున కొండ త్రవ్వకాల్లో దొరికిన పెంకుబిళ్లల ఆధారంగా ఈ ఆట ఇక్ష్వాకుల కాలంనాటికే ప్రచారంలో ఉండేదని చారిత్రక పరిశోధకుల నిర్ధారణ.



తొక్కుడుబిళ్ల - ఆటచిత్రం



ముగ్గు

అతి ప్రాచీనత్వాన్ని, ప్రచారత్వాన్నీ పొందిన ఈ ఆట ఆడడానికి గీచే గళ్ళు కూడ ముగ్గుల్లో చిత్రితమైనాయి.

తెలంగాణా మహిళల్లో అతి ప్రచారంలో ఉన్న ఆట పచ్చీసు. ఈ ఆటనే పచ్చీస్‌పాళి, పగడసాలాట, సొగటాలు అని కూడ అంటారు.

ఈ ఆట మహమ్మదీయ సంస్కృతి ప్రభావంతో తెలంగాణాలోనికి ప్రవేశించింది. ఇందులో వేసే పందాలు దస్, బారా, దూగ, తీస్, చౌద మొదలైనవి ఉర్దూ పదాలు. మొగలాయి చక్రవర్తి అక్బరుకు ప్రీతికరమైన ఆట ఇది. అతడు ఫతేపూర్ సిక్రీలో పంచమహల్ ఎదురుగా ఉన్న మైదానంలో చదునైన రాతిమీద పచ్చీసు పలకను నిర్మించాడు. పలక మధ్యలో కూర్చుని గవ్వలను వేయడానికి అనువుగా ఎత్తైన రాతి పలకను నిలిపినాడు. గళ్లలో పావులకు బదులుగా పడతులు నిలబడేవారు. పందానికి అనుగుణంగా వారు నాట్యం చేస్తూ గళ్లను దాటుతుండేవారు.[88]

తెలుగు స్త్రీలు ఇంటిముంగిట అరుగుపైన కానీ, లోగిళ్ళలో కానీ ఈ ఆటను ఆడుతుంటారు. అగ్రవర్ణ స్త్రీలు + ఆకారంలో సిల్కు వస్త్రాన్ని కత్తిరించుకొని దానిపైన పూసలతో కానీ, అందమైన కుట్టులో కానీ చదరాలను కడతారు. ఈ పచ్చీసు వస్త్రం నయనానందకరం. ఆట మనోరంజకం. ఈ ఆటను ఇద్దరు కానీ, ముగ్గురు కానీ, నలుగురు కానీ గవ్వలతో ఆడుతారు.



చెండు ముగ్గు



చదరంగం



పచ్చీసు ముగ్గు

పచ్చీసును స్త్రీలు తీరిక సమయాల్లో కాలక్షేపం కొరకు, భర్తతోకానీ, బంధువులతో కానీ, స్నేహితులతో కానీ, ఇంట్లో వారితో కానీ కలిసి ఆడుతుంటారు. ఏకాదశి, శివరాత్రుల సమయాల్లో పచ్చీసు ఆడుతూ జాగరణ చేస్తుంటారు.

పచ్చీసు ఆటలో గవ్వలను చేతిలో గిలకరించి నేలమీద దొర్లిస్తారు. చేతిలో గిలకరించేటప్పుడు, క్రింద వేసినప్పుడు గలగలమనే గవ్వల చప్పుడు వస్తుంది. ఇంట్లో గవ్వల చప్పుడెక్కువైతే దరిద్రపు దేవత గృహ ప్రవేశం చేస్తుందని స్త్రీల నమ్మకం.[60] ప్రతిరోజూ పచ్చీసు ఆడితే ఇంట్లో కలహాలు చెలరేగుతాయని తెలంగాణా స్త్రీల భయం, విశ్వాసం. గెలుపు ఓటమి వల్ల, ఆడేవారి మధ్యన పరస్పర అసూయద్వేషాలు అధికమౌతాయనే అభిప్రాయంతో ముందుచూపుతో ఎక్కువ ఆడకూడదనే ఆంక్ష విధించినారు. నిరంతరం ఆడితే ఆట వ్యసనంగా మారుతుందనీ, వ్యసనం దరిద్రానికి మార్గమవుతుందనీ, పెద్దమ్మ ఇంట్లోకి వస్తుందని భయపెడుతుంటారు. తెలంగాణాలో పెళ్ళైన తర్వాత ఆడపడుచులకు కట్నకానుకలతోపాటు పచ్చీసునూ, పిల్కు వస్త్రంపై కుట్టి పుట్టింటివారు బహూకరిస్తారు.[61]

పుట్టినింట్లోనూ, మెట్టినింట్లోనూ కాలక్షేపాన్నీ, మానసికోల్లాసాన్నీ కలిగించే పచ్చీసు చిత్రాన్ని పడతులు ముగ్గుల్లో చిత్రించి ఆ ఆటపైన

తమకు కల మక్కువను ప్రదర్శిస్తారు.

పల్లెల్లో బాలికలు ఆడుకొనే తాడు ఆటను ఆధునిక కాలంలో శరీర సౌష్టవానికి, వ్యాయామానికి సూచిస్తున్నారు. బాలికలు తాడు ఆట ఆడే చిత్రం ముగ్గుల్లో చిత్రిస్తుంటారు. ఈ ముగ్గు చిత్రం ముగ్గుల పుస్తకాల్లో చిత్రితమైంది. ఈ చిత్రాన్ని స్వీకరించిన స్త్రీలు ముగ్గుల్లోని బాలికల గౌన్లకు, తాడుకు రంగులను వేసి అందంగా వాకిళ్ళలో తీర్చిదిద్దుతుంటారు.



తాడు ఆటముగ్గు

గ్రామాల్లో రబ్బరు బంతులు రాకముందు చెండాటను బాలబాలికలు ఆడేవారు. గచ్చకాయల చుట్టూరా కానీ, చిన్న చిన్న రాళ్ల చుట్టూరా కానీ గుడ్డలను గట్టిగా చుట్టి బంతిఆకారంలో చెండును తయారు చేసేవారు. దానితో బంతి ఆటను ఆడినట్లు ఆడేవారు. రెడ్డిరాజుల కాలంలో యువకులు ఆడిన ఆటలు కందుక కేళి (ఇది చెండు ఆట) అని తెలిపి శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు "బట్టలను గోళాకారం చేసి దానిపైన గట్టి లావుదారంతో జాలెను అల్లి ఆడెడివారు

కావచ్చు" ని అభిప్రాయపడినారు.[63] చెండును తయారు చేసేవారు తల్లులే కాబట్టి గృహాలంకరణ కొరకు వేసే ముగ్గుల్లో కూడ చెండు చిత్రం స్థానాన్ని సంపాదించుకుంది.

పులిజూదం ఆంధ్ర ప్రాంతమంతటా విరివిగా పల్లీయుల మధ్యన ప్రచారంలో ఉన్న ఆట. పెద్ద గులకరాతి ముక్కను పులికి, చిన్న గులక రాతి ముక్కలను మేకలకు ప్రత్యామ్నాయంగా పెట్టి ఆడుతుంటారు.మేకలతో పులులను కట్టివేసిననూ లేదా మేకలను పులి చంపిననూ ఆట ముగుస్తుంది. పులివంటి గ్రామాధికారి లేదా పెత్తందారీ దౌర్జన్యాలను అరికట్టలేని అర్భకులైన పల్లీయులు కనిపెట్టిన క్రీడ కావచ్చు ఇది.

ఈ ఆట కొరకు గీచెడి చిత్రాలెక్కువగా దీర్ఘచతురస్రాకారంలో కానీ, త్రికోణాకారంలో కానీ, షట్కోణాకారంలో కానీ ఉంటాయి. ముగ్గుల్లో కూడా ఈ రూపాలు కనపడుతుంటాయి. ఒక త్రికోణం క్రిందివైపు మరొక త్రికోణం పై వైపునకు గీచి మేకల ఆటను ఆడుతుంటారు. ఈ ఆటను ఒక్కడే కాలక్షేపం కొరకు ఆడుకుంటాడు. తొమ్మిది కాయలను పెట్టుకొని వాటిని జరుపుతూ చంపుకుంటూ ఆడుతుంటాడు. ఈ ఆటకొరకు గీచెడి చిత్రం క్రింద అనేక ముగ్గుల్లో కనపడే త్రికోణ చిత్రం.



పులిజూదం : జెరి ఆట : ముగ్గుచిత్రం

గుంటూరుసీమలో దాడి ఆటను ఆడుతుంటారు. రాయలసీమ, కడప మండలంలో ఈ ఆటనే బేరి అని అంటారు. ఒకే వరుసలో మూడు కాయలు చేరితే 'బేరి' అంటారు. పల్నాటిసీమలో అంజనం అని పిలుస్తారు. మాచర్ల-చెన్నకేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని అరుగుమీద చెక్కబడిన గుంటలు ఈ ఆటకు సంబంధించినవియే కావచ్చు అని డా. పి. సుబ్రహ్మణ్యం గారు భావించినారు. బేరి ఆటకు గీచే చిత్రంలోని చుక్కలు, ముగ్గుల్లోని చుక్కలను పోలి ఉంటాయి. ముగ్గులో బేరి క్రీడా చిత్రాన్ని పోలిన చిత్రం ఒకటి ఉంది.

ఈ విధంగా స్త్రీల విజ్ఞానానికి సంబంధించిన అనేక విషయాలు ముగ్గుల్లో ప్రతిబింబిస్తున్నాయి. ముగ్గుల్లో నిక్షిప్తమైన వివిధ శాస్త్రాంశాలను వెలువరించి విశదపరచడానికి నిశితమైన పరిశీలన, పరిశోధన అవసరం.

ధర్మశాస్త్రాలు వేదాధ్యయనాన్ని స్త్రీలకు నిషేధించినా, వారు ముగ్గుల్లో తమ వేద పరిజ్ఞానాన్ని, ప్రతిబింబింప చేసినారు.

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా, ------- అభిచాకశీతి"

ఈ వేదమంత్రం అర్థం - "ఒకే వృక్షం పైన ఉన్న రెండు పక్షుల్లో ఒకటి పండును తింటుంది. మరొకటి దేన్నీ అంటక, ప్రకాశిస్తుంది." దీనిలోని తాత్త్విక భావం - "చెట్టు సంసారమైతే, పండును తింటున్న పక్షి జీవుడు. తినని పక్షి ఈశ్వరుడు". విశాఖపట్టణ వాస్తవ్యురాలు బ్రాహ్మణవృద్ధురాలు (పద్మావతమ్మ 65 సం॥) ముగ్గులో ఒకే కొమ్మకున్న రెండు పిట్టల్లో ఒకటి పండును తింటున్నట్టు మరొకటి దిక్కులు చూస్తున్నట్టు చిత్రించి, అర్థాన్ని వివరించింది. ప్రాచీన కాలంలో నిరంతరం వేదమంత్రాలతో, గురుబోధలతో బ్రాహ్మణపండితుల ఇళ్ళు ప్రతిధ్వనిస్తుండేవి. వాటిని విని ఆకళింపు చేసుకున్న గృహిణులు, మంత్రార్థాలకు ముగ్గుల్లో రూపకల్పన కావించి, తరతరాలవారికి అందచేసిన ధన్యులు.

స్త్రీల చిత్రలిపి- సంకేతాలు

ముగ్గులు స్త్రీ మనస్తత్వానికి, జీవిత విధానానికి ప్రతీకలు. మన మత వ్యవస్థకు, సామాజిక వ్యవస్థకు ఇవి ప్రతిబింబాలు. ప్రాథమిక దశలోని మత భావాలకు, సంస్కృతి ప్రాచీనతకు ముగ్గులు సంకేతాలు. రాతియుగం నుండి అణుయుగం వరకు సామాజికంగా, మతపరంగా, ఆర్థికపరంగా సంభవించిన మార్పులను ముగ్గుల్లోని సంకేతార్థాల ఆధారంగా కొంత వరకు ఊహింపవచ్చు.

మహిళలను సంకేతాలను గూర్చి ప్రశ్నిస్తే అనంతమైన వాటిలో అతి తక్కువ ముగ్గుల్లోని సంకేతాలనే తెలిపినారు. ప్రాచీనకాలంలోని స్త్రీ ఏదో ఒక సంకేతార్థంతోనే ముగ్గును ప్రారంభించి ఉండవచ్చు. కాలం క్రమించిన కొలది సంకేతార్థాలు నమసిపోయి ముగ్గుల రూపాలు, ఆచార సంప్రదాయాలు మాత్రం మిగిలినాయి. ఈనాడు మనకళ్ళముందున్న ముగ్గులను పరిశోధనా దృష్టితో పరిశీలిస్తే ప్రతి ముగ్గు చిత్రకారిణి మనోభావాలకు, ఆచార సంప్రదాయాలకు, జీవిత విధానానికి అద్దం పట్టినట్లుగా ఉంటుంది.

ప్రారంభంలో దుష్టశక్తులను పారద్రోలడానికే ముగ్గును చిత్రించినమా కాలక్రమేణ ముగ్గు శుభసూచకంగా, ఆచారంగా పరిణమించింది. ఆరోగ్య దృష్ట్యా గోమయంతో అలికిన ముదురు ఆకుపచ్చ వాకిలి, వెలితిగా ఉండి మనస్సుకు చీకాకును కలిగిస్తుంది. దానిపై తెల్లటి గీతలతో, చుక్కలతో గీచిన ముగ్గు ఇంటి ముంగిటికి సౌందర్యాన్నిస్తుంది. సంపూర్ణత్వాన్ని సిద్ధింపచేస్తుంది. చూపరులకు పవిత్రతను స్ఫురింపచేస్తుంది. సూర్యకాంతికి తెలుపుకు అవినాభావసంబంధం ఉంది. గీతలు దుష్టశక్తుల గృహప్రవేశాన్ని

విరోధించడానికి ఏర్పడినవి కావచ్చని మొదటి అధ్యాయంలో వివరించబడింది.

చుక్కల ముగ్గుల్లో, చిత్రానికి ప్రధానమైన బిందువు లేదా చుక్క నీలాకాశంలోని నక్షత్రాలను తలపింపచేస్తుంది. ఆధ్యాత్మిక వాదులకు బిందువు ధ్యానానికి ముఖ్యమైన ఆధారం. స్త్రీలకు కూడ ఏకాగ్రతా దృష్టితో రచించే చిత్రాలకు బిందువు ఆధారమౌతుంది. చిత్రరూప కల్పనకు దోహదం చేస్తుంది. వేదాంతుల పరిభాషలో బిందువు విశ్వానికి మూల భూతం. రూప రహితమైన బిందువు నుండి రూపం ఏర్పడుతుంది. నిరాకార నిర్గుణుడైన భగవంతుని నుండి వివిధ రూపాలతో కూడిన సృష్టి సృష్టింపబడింది. ముగ్గు కూడ రూపరహితమైన చుక్క చుట్టూరా రూపాన్ని ఏర్పరచుకుంటుంది.

తంత్ర శాస్త్రంలో బిందువు, శక్తి యొక్క పరారూపం, అది అంతిమరూపం. అతి సూక్ష్మమైన శక్తివంతమైన బిందువు నుండి సంక్లిష్టమైన, వైవిధ్య పూరితమైన, చైతన్య భరితమైన వివిధ రూపాలను పొందిన సృష్టి సృష్టింపబడుతుంది. [83] తాంత్రికులకు బిందువు Supreme reality . శ్రీలలితా సహస్రనామాల్లో లలితాదేవికి "బిందు తర్పణసంతుష్టి" అనే నామం ఉంది. [84] శ్రీచక్రంలోని లోపలి వలయం బిందువు. భక్తులు బిందువును మాత్రమే పూజించినా ఆమె సంతృప్తి చెంది ప్రసన్నురాలై కోరికలను తీర్చుతుందని శాక్తేయుల నమ్మకం. స్త్రీ సఫలతాశక్తికి మూలం కాబట్టి శక్తి దేవతను సృష్టికి మూల కర్తగా తాంత్రికులు, శక్తి భక్తులు స్తుతిస్తారు. సర్వ సృష్టికి మూలకారణమైన దేవతాశక్తి బీజంలో లేదా బిందువులో నిక్షిప్తమై ఉంటుంది. అదే విధంగా ముగ్గును చిత్రించే విధానానికి చుక్క మూలం.

తాంత్రిక శాస్త్రంలో ప్రాణానికి, శక్తికి, సృష్టికి మూలకారణమైన తెల్లటి బిందువు పురుషునికి, ఎరుపు చుక్క స్త్రీకి ప్రతీకలు. పల్లెటూరి వారు కూడ తెలుపు, ఎరుపు రంగులు పురుషునికి, స్త్రీకి ప్రతీకలుగానే భావిస్తారు. ఎర్రమట్టి, తెల్లటి సుద్ద మన్ను, భార్యాభర్తలని వారి భావం.[66] అందుకే గ్రామాల్లో గదుల్లో, వరండాల్లో, వాకిట్లో అరుగుల చుట్టూరా నేలపైన ఎర్రమట్టితో అలికి ముగ్గులను వేస్తుంటారు. గడపలకు పసుపును పులిమి బియ్యం పిండితో,కుంకుమతో గుండ్రటి బొట్లను అలంకరిస్తారు. ఇంటి చుట్టూరా గోడలపైన ఒక సున్నపు తెల్లపట్టీని, ఎర్రటి పట్టీని నిలువుగా పెడతారు. తెల్లటి సున్నం, ఎర్రటి కుంకుమ రెండూ కలిస్తే దుష్టశక్తులు దరిచేరవనే నమ్మకం పల్లెల్లో ఉంది.

జానపద తల్లులు తమ పసి పిల్లలకు దృష్టి దోషం తగులకూడదని నుదుట నల్లటి గుండ్రటి బొట్టును పెడతారు. చెక్కిట కూడ గుండ్రనైన నల్లటి చుక్కను తీర్చి దిద్దుతారు. పరాయివారి దృష్టి ప్రప్రథమంగా గుండ్రనైన నల్లటి చుక్క ఆకర్షించుకొని పాపడికి దృష్టిదోషం తగలనివ్వదని పల్లెపడతుల ప్రగాఢ విశ్వాసం. అందంగా అలంకృతమైన వధువు చెక్కిలిపైన కూడ నల్లటి చుక్కను దృష్టిదోషం తగులకుండ ఉండడానికే దిద్దుతారు. స్త్రీల ఈ నమ్మకాన్ని ఆధారం చేసుకొని ముగ్గులోని చుక్క కూడ, ఇంటికి ఇతరుల దృష్టిదోషం తాకకూడదనే అభిప్రాయంతో ఏర్పడవచ్చని ఊహించవచ్చు. ఇంటి ముంగిట ముగ్గు మన దృష్టిని ఆకట్టుకుంటుంది. పెళ్ళికూతురు చెక్కిట చేర్చిన చుక్క ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసిన విధంగానే చుక్కల చుట్టూ రూపుదిద్దుకున్న ముగ్గు ముంగిట అందాన్ని విరాజింపచేస్తుంది.

చుక్కల చుట్టూరా గీతను గీస్తేనే రూపం ఏర్పడుతుంది. ఈ గీత చక్కగా ఉన్ననూ, వంకర తిరిగిననూ రూప నిర్మాణానికి మూలమై నిర్మాణ అర్థాన్ని, విధానాన్ని, స్థితిని సూచిస్తుంది. ముగ్గుల్లో గీతలు, చదరాలు, చతుర్భుజాలు, షడ్భుజాలు, దీర్ఘ చతురస్రాలు, త్రికోణాలు, అష్ట కోణాలు రూపొంది రమణుల చిత్రకళా నైపుణ్యాన్ని చాటుతుంటాయి. ఇవి సౌందర్య ప్రధానాలు అయిననూ అనేక సంకేతార్థాలతో సమ్మిళితమై ఉంటాయి. ఈ సంకేతార్థాలు ఆధ్యాత్మిక, భౌతిక, తాంత్రికవాదులకు వారి వారి విశ్వాసాలననుసరించి, అభిప్రాయాలననుసరించి గోచరిస్తాయి. పల్లీయుల ఆచార సంప్రదాయాలను కూడ పరిశీలిస్తే ముగ్గుల్లోని ప్రతీకలు ప్రస్ఫుటమౌతాయి. ఆధ్యాత్మిక, భౌతిక, తాంత్రికవాదుల్లోనూ, గ్రామస్థుల్లోని జీవిత విధానాల్లో, ఆచారాల్లో, ఆలోచనా విధానాల్లో వైరుధ్యం ఉన్ననూ వీరి మూలభావాల్లో సామ్యం స్పష్టమౌతుంది. ఈ అంశం ముగ్గుల్లోని ప్రతీకల పరిశీలన వలన ప్రస్ఫుటమౌతుంది.

ముగ్గుల్లోని చతుర్భుజం స్థిరత్వానికి సూచకం. ఎంత బరువైన వస్తువైననూ చతుర్భుజాకారం కలిగిన పీటపైననే స్థిరంగా ఉండగలుగుతుంది. గ్రామాల్లో కూర్చునే పీటలు, గోనె సంచులను పెట్టే పీటలు, శుభకార్యాల్లో వధూవరులు కూర్చునే పీటలు చతుర్భుజాకారంలో ఉంటాయి. పల్లెవారు ముగ్గుల్లోని చతుర్భుజాకారాన్ని పీట అంటారు. పెళ్ళిలో వేసెడి చతురస్రాకారంలోని పీట ముగ్గు శుభ సూచకం. వైష్ణవులు శుభకార్యాల్లో వేసే ముగ్గులు చతురస్రాకారంలోనే ఉంటాయి. దీర్ఘ చతురస్రాకారం శివలింగానికి చిహ్నం.

ముగ్గుల్లో షడ్భుజాకారాలు ఎక్కువగా కనపడుతుంటాయి. షడ్భుజాలు రసాయనికశాస్త్ర నిర్మాణ రూపాల్లో ప్రధానమైనవి. స్ఫటికాలు షడ్భుజ రూపాన్ని పొంది ఉంటాయి. రాతి స్ఫటికాలు కళ్ళకు ఆకర్షణీయంగా ఉంటాయి. స్ఫటికం స్వచ్ఛతకు సంకేతం.

స్ఫటిక రాళ్ళను తాయెత్తులుగా మెడలో గానీ, ఉంగరాల్లో పొదిగించి గానీ ధరించే ఆచారం హిందువుల్లో ఉంది. కొందరు శిలాస్ఫటికంపై ఏకాగ్రదృష్టితో ధ్యానం చేస్తుంటారు. అనేక జానపద కథల మాంత్రికులు శిలాస్ఫటికం ద్వార భూత,వర్తమాన, భవిష్యత్తులకు సంబంధించిన సమాచారాలను తెలుసుకుంటారు. శిలా స్ఫటికం కాలజ్ఞానాన్ని బోధిస్తుందని జానపద కథకుల అభిప్రాయం. కథల్లో దేవతలు కూడ అద్భుత శక్తిని కలిగిన స్ఫటిక రాళ్ళను కథానాయకులకు బహూకరిస్తుంటారు.

స్ఫటిక రాళ్ళను తాయెత్తులుగా, రక్షలుగా వాడడం ఇటలీ, మలయా, ఇంగ్లాండు, ఈజిప్టు, అరేబియా, ఆస్ట్రేలియా దేశాల్లో కనపడుతుంది. [66]

వివిధ రూపాల్లోని రాళ్ళల్లో ఎర్రటి రాళ్ళు రక్తానికి, తెల్లటి రాళ్ళు చర్మానికి, స్ఫటికాలు కళ్ళకు మంచివనే నమ్మకం ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో కనపడుతుంది. తెలుగువారు నల్లటి గుండ్రనైన పూసలను దృష్టి దోషం తగులకుండా ఉండడానికి పిల్లలకూ, పశువుల మెడలకూ కడుతుంటారు. మలయా, పెన్నినువేలాలో నల్లటి రాళ్ళను పంటలు బాగా పండడానికి వాడుతుంటారు. [67]

అనేక రంగులతో, రూపాలతో, నమూనాలతో రాళ్ళు అతి ప్రాచీన కాలంనుండీ ఆధునిక యుగం వరకు ప్రజలను ప్రపంచ పర్యాప్తంగా ఆకర్షిస్తూనే ఉన్నాయి. ఈ రాళ్లలో స్ఫటిక రాళ్ళకు

ప్రాధాన్యం అధికంగా ఉంది. అందుకే వాటి నిర్మాణ నమూనాలు ముగ్గుల్లో చోటు చేసుకున్నాయని ఊహించవచ్చు.

త్రికోణాలను ఆధారంగా చేసుకొని అనేక ముగ్గులు వివిధ రూపాలను పొందుతుంటాయి. రసాయనిక శాస్త్రపరంగా త్రికోణ రూపాలకు ప్రాధాన్యం అధికం. రసాయనిక, ఖనిజాల నిర్మాణ నమూనాలు, త్రికోణ, షడ్భుజాకారాలను పొంది ఉంటాయి. కార్బన్ నుండి రూపొందే వజ్రం కఠినమైన ధృఢమైన ఖనిజం. ఇది అనేక త్రికోణ సమూహాల సమాహార నిర్మాణం. త్రికోణం మూడు సమానమైన గీతల ధృఢమైన కలయిక. అత్యధిక బలాన్ని, ఒత్తిడిని ఉపయోగించి ఈ త్రికోణాన్ని విరగ్గొట్టవచ్చు కాని దాని రూపాన్ని మార్చలేం. ఒత్తిడివల్ల చతురస్రం విషమకోణ సమబాహు చతుర్భుజంగా మారుతుంది. దీర్ఘచతురస్రాకారం సమాంతర చతుర్భుజంగా మారుతుంది. ముగ్గుల్లో రత్నాల ముగ్గు అధికం. బలప్రయోగ ఫలావానికి రూపాన్ని కోల్పోని రత్నం వజ్రంగా పిలువబడుతున్నది. ఇంద్రునికి ఆయుధమైంది. పరాక్రమవంతుడైన వృత్రాసురుణ్ని వధించింది. పర్వతాల రెక్కలను ఖండించింది. ధృఢమైన పర్వతం త్రికోణాకారంలోనే ఉంటుంది. అందుకే త్రికోణం ధృడత్వానికి, శక్తికి సంకేతంగా మారింది.

త్రికోణంలోని మూడు భుజాలు సత్త్వ,రజస్, తమస్ గుణాలకూ (active, positive, negative) త్రిమూర్తులకూ నిదర్శనాలు. ఈజిప్టు పురాణ గాథల్లో త్రికోణం చైతన్యం, జడత్వం, సంక్లిష్టత్వం - మూడింటికి చిహ్నం. . కోణాలు ఆలోచన, ఆచరణలోని వైరుధ్యాన్ని సూచిస్తాయి.

సంక్రాంతి సమయంలో ముగ్గుల్లో రెండు త్రికోణాల చుట్టూర వలయం కానీ, పద్మాలు కానీ ఉంటాయి. ఈ త్రికోణాల్లో ఒకటి పై వైపుకి, మరొకటి క్రింది వైపుకి ఉంటుంది. క్రింది వైపునకు చిత్రింప బడిన త్రికోణం శక్తి, రెండవది శివునికి సంకేతం లేదా ప్రకృతి పురుషుల కలయిక ఈ చిత్రంలో సూచింపబడుతుందని తాంత్రికుల వివరణ. తాత్త్వికులకు ఈరెండు త్రికోణాలు ఔన్నత్యానికీ, అల్పత్వానికీ - పై భాగానికీ, క్రింది భాగానికీ - ఉన్నతానికీ నిమ్నత్వానికీ నిదర్శనాలు.

తాంత్రికులకు, భౌతికవాదులకు త్రికోణం స్త్రీ సంకేతం. గర్భాధారణం, ప్రసవం, పుత్రోద్భవంలోని విధానాన్ని అర్థం చేసుకోలేక, శాస్త్రీయ పరిజ్ఞానం లేని ప్రాచీన కాలంలోని మానవుడు స్త్రీ యోనియే సంతానానికీ, భౌతికాభివృద్ధికీ మూలమని భావించాడు. భౌతికాభివృద్ధి అంటే వ్యవసాయాభివృద్ధి. ప్రపంచపర్యాప్తంగా, ప్రాచీన మానవులు స్త్రీలోని సృష్టించే శక్తికి సంకేతంగా త్రికోణాకారాన్నే సూచించినారు. మెసపొటోమియా (క్రీ.పూ.3000) ఫొనిసియా (క్రీ.పూ.2500) ఈజిప్టు (క్రీ.పూ.2000) సింధునాగరికతలోని త్రవ్వకాల్లోనే కాక, రాతియుగానికి చెందిన అనేక త్రవ్వకాల్లో వెల్వడిన, మట్టి రాతి విగ్రహాల్లోని స్త్రీ ఆకారాల్లో త్రికోణాకారమే ప్రధానంగా కనపడుతుంది. [44]

క్రైస్తవ మతం ఆది దశలోని గ్నాస్టిక్ తెగ ఆరు అంచుల త్రికోణాల కలయికను తమ గుర్తుగా గ్రహించారు. గ్రీకు అక్షరం 'Δ స్త్రీ చిహ్నం. యూరోపియన్ జిప్సీల చిత్రలిపిలోని 'Δ' స్త్రీ సంకేతంగా వాడుతారు. వారు ఇంట్లోని స్త్రీల సంఖ్యను, ఇంటిముందు చిత్రించిన త్రికోణాల సంఖ్యతో సూచిస్తారు. ప్రపంచంలో భౌతిక సంపదను, సంతానాభివృద్ధిని ప్రసాదించే స్త్రీ దేవతలెక్కువగా త్రికోణాకారంలోనే పూజింపబడుతున్నారు. స్కైతియన్లు, చైనావారు

తమ ప్రధాన స్త్రీ దేవతలను త్రికోణాకారంలోనే పూజిస్తారు. ఈజిప్టులో త్రికోణం పవిత్రతకూ, పరిశుద్ధతకూ, కన్యాత్వానికీ, సత్యానికీ ప్రతీకగా పరిగణించబడుతుంది.

లలితాసహస్రనామాల్లో యోనినిలయ, అయోని, యోనిముద్ర అనే నామాలు శక్తికి ఉన్నాయి. శ్రీ చక్రంలోని మొదటి త్రికోణం దేవికి నిలయం, శ్రీదేవిని "త్రికోణరూపిణి శక్తి" అని స్తుతిస్తారు. శక్తి త్రికోణ రూపంలో, శివుడు వలయరూపంలో ఉంటాడని శ్రుతులు వివరిస్తున్నాయి. ముద్రల్లో యోనిముద్ర కూడ ఉంది. మూల ప్రకృతికి మూలాధారమైంది ఈ ముద్ర. శివశక్తుల సమ్మేళనకు సంకేతమైన ఈ ముద్రను ఉపయోగించిన వారు పాపాలనుండి విముక్తులౌతారని శక్తి భక్తుల భావం. అస్సాంలోని కామాఖ్య గుడిలో శక్తి త్రికోణాకారంలోనే భక్తుల ఆరాధనలను అందుకుంటుంది. దక్షయజ్ఞం తదుపరి శివుడు సతీదేవి శవాన్ని తీసుకొని పోతుండగా, విష్ణువు ప్రభావం వల్ల ఆమె దేహం ముక్కలు, ముక్కలుగా వివిధ ప్రాంతాల్లో పడిపోయినాయి. అవియే "పీఠస్థానాలు"గా మారినాయి. అస్సాం కామరూప ప్రాంతంలో దేవి యోని పడిన ప్రదేశంలో ఆలయం వెలసింది. దేవిలోని అనంతమైన శక్తి ఈ ప్రాంతంలోనే ఉందని శాక్తేయుల విశ్వాసం. [69]

శాక్తేయులు ఆరాధించే శక్తియే కాక, గ్రామ దేవతలు కూడా త్రికోణాకారంలోనే పూజింపబడుతున్నారు. గ్రామ దేవతలెక్కువగా ముక్కోణపు రాళ్ళరూపంలోనే ఉంటారు. స్త్రీలు పసుపు ముద్దతో చేసే గౌరీ రూపం త్రికోణాకారం. తెలంగాణాలో నూతన వధువు ఒడిలో పెట్టే బట్టను (కనుమును) త్రికోణాకారంలో మడుస్తారు. ముత్తైదువలకు ఒడిబియ్యం పోసేటప్పుడు కూడ త్రికోణాకారంలోని

"ముడుపులను" కొంగులో పెడతారు. ఈ "ముడుపు" సౌభాగ్యానికి, సఫలంతాశక్తికి చిహ్నాలనీ, వీటివల్ల సంతాన సౌభాగ్యాలు వృద్ధిచెందుతాయని పల్లెపడతుల నమ్మకం. పల్లెటూళ్ళలోని తులసి కోటపైన రాళ్ళు, ఇళ్ళలోని గూళ్ళు త్రికోణాకారంలో ఉంటాయి. గోడలపైన, కడపలపైన వేసే చిత్రాల్లో త్రికోణాకారాలు గోచరిస్తుంటాయి. ఆటవికుల చిత్రాల్లో కూడ అసంఖ్యాకమైన త్రికోణాలు దర్శనమిస్తుంటాయి. [70]

త్రికోణాకారం స్త్రీల ముగ్గుల్లోనే కాక, సంక్రాంతికి ముగ్గుల మధ్యన పెట్టెడి గొబ్బి దేవత ఆకారంలో కూడ కనపడుతుంది. అష్టదళ పద్మం ముగ్గు మధ్యన పువ్వులతో పసుపు కుంకుమలతో గొబ్బెమ్మను అలంకరించి చుట్టూ నవధాన్యాలను, రేగుపండ్లను పోస్తారు. గొబ్బి చుట్టూ బాలికలు పాటలు పాడుతూ నృత్యం చేస్తారు.

సుబ్బి గొబ్బెమ్మా - మల్లిపువ్వంటి మగనివివ్వావె
చేమంతి పువ్వంటి చెల్లెలినివ్వావె- గుమ్మడి పువ్వంటి
కూతుర్నివ్వావె
అరటి పండంటి అత్తనివ్వావె - తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యావె
పొల్ల పువ్వంటి పొరుగు నివ్వావె - అనగ పువ్వంటి అమ్మనివ్వావె
తామర మొగ్గంటి తండ్రినివ్వావె - గుమ్మడి పండంటి
కొడుకునివ్వావె
కలువ పువ్వంటి కోడలినివ్వావె - మాలతి పువ్వంటి
మనుమలనివ్వావె
అందరానటువంటి ఐశ్వర్యమియ్యావె- ఆడవాళ్ళందరకూ
ఐదోతనమివ్వావె.

అని పాటలను పాడుతుంటారు. ఈ పాటలోని బాలికలు తమ్ముణ్ణీ, చెల్లెలినీ, భర్తనూ, కూతుర్నీ, కొడుకునూ, కోడలినీ,

సుసుమలనూ, ఐశ్వర్యాన్ని, ఐదోతనాన్ని ప్రసాదించమని గొబ్బిని ప్రార్థిస్తారు. వారి దృష్టిలో త్రికోణాకారంలోని గొబ్బి గౌరికి ప్రతిరూపం. సంతానశక్తి ప్రదాయిత. సఫలతా శక్తికి సంకేతం.

తెలంగాణా ప్రాంతంలో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినుండి మహర్నవమి వరకు ఆడవారు బతుకమ్మ పండుగ లేదా వ్రతాన్ని ఆచరిస్తారు. తంగెడు, రుద్రాక్ష, గుమ్మడి, గోరింట, బంతి మొదలైన పువ్వులతో బతుకమ్మను త్రికోణాకారంలో (గోపురాకారంలో) పేరుస్తారు. తొమ్మిది రోజులూ బతుకమ్మను పేర్చి, దాని చుట్టూ చేరి ఆడుతూ, పాడుతూ నాట్యం చేస్తారు. తొమ్మిదవ నాడు బతుకమ్మలను అన్నింటినీ నదిలోగాని, చెఱువులో గాని ఓలలాడిస్తారు. బతుకమ్మను నీళ్ళలో కలిపేటప్పుడు దిగువ పాటను పాడుతుంటారు.

నీలాటి జలధి వద్ద గౌరమ్మా
నీ నోము నీకు చెల్లె గౌరమ్మా
నీ నోము ఫలము చెప్ప గౌరమ్మా
బాలుని పెండ్లాడవే గౌరమ్మా -

బతుకమ్మ . భర్తను తద్వారా సంతానాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించే గౌరీదేవికి ప్రత్యామ్నాయ రూపం. సంతాన ప్రదాయిత అయిన గౌరీదేవి జానపదులకు సస్యదేవత. పూర్వం రేపల్లెలో వర్షాలు లేక కరువు సంభవించగా గోపకులు విష్ణువు సలహానుసరించి ధనుర్మాస వ్రతాన్ని ఆచరింపచేసినారట. [71] ధనుర్మాసంలో గొబ్బి దేవతను పూజించడమే ఈ వ్రతంలోని ప్రధాన ధ్యేయం. గోపికలు ఈ వ్రతాన్ని కృష్ణుడు భర్తగా లభించాలనీ, వర్షాలు కురవాలనే కోరికతో ఆచరించగా, కాత్యాయనీ దేవి కరుణతో అనావృష్టి తొలగి, నందగోపాలుడు వారికి భర్తగా లభించాడు. ఈ వ్రత కథలో కాత్యాయనీ

దేవి పంటలకు మూలమైన వర్షాన్ని కురిపించి సస్యలక్ష్మిగా పూజలను అందుకుంటుంది.

త్రికోణాకారంలోని గౌరీదేవిని ఆరాధిస్తే సకలైశ్వర్యాలు, అనురూపమైన వరుడు, కీర్తి ప్రతిష్ఠలను సంపాదించే సంతానం ప్రాప్తిస్తాయని గొబ్బి వ్రతాన్ని, బతుకమ్మను, ఆరాధించే స్త్రీం ప్రగాఢ విశ్వాసం. సంతానానికే గాక, ఐశ్వర్యానికి మూలమైన పంటలకు కూడ త్రికోణాకారంలోని గౌరీదేవి మూలమనే స్త్రీం నమ్మకం, ఆచార సంప్రదాయాల ద్వార విశదమౌతుంది. సఫలతా శక్తిని పొందిన భూమిపైన స్త్రీ సఫలతకు ప్రతీక అయిన త్రికోణాకారంలోని గొబ్బెమ్మను, ముగ్గులను పెట్టితే అవి పరస్పర ప్రభావితాలు అవుతాయనేది ప్రాచీనుల విశ్వాసం కావచ్చు. గోమయం భూసారాన్ని అధికం చేస్తుంది. భూసారాన్ని అధికం చేసే గోమయ ్న గొబ్బిరూపంలో భూమిపైన పెడితే భూసారం కూడ అధికం అవుతుందని స్త్రీం అభిప్రాయం కావచ్చు.

ప్రాచీనకాలంలోని మానవులు, శాస్త్రపరిజ్ఞాన శూన్యులు. గర్భాధారణం, ఫలదీకరణ శాస్త్రాలు అర్థం కాని దశలో పంటలనిచ్చే పుడమి తల్లికి, మానవ సంతతిని పెంపొందించే పడతికి అవినాభావ సంబంధం ఉంటుందనుకునేవారు.అతనిదృష్టిలో స్త్రీ గర్భాధారణశక్తి, ప్రకృతిలోని ఉత్పత్తి శక్తి పరస్పరాధారాలు, ప్రభావితాలు. ఈ అభిప్రాయంతోనే మన పురాణ కర్తలు భూమాతను, స్త్రీ మాతను సమాన దృష్టితో వర్ణించినారు. మార్కండేయ పురాణంలోని దేవి శాకంబరి ప్రాణులకు అవసరమయ్యే మొక్కలన్నీ నాదేహం నుండే ఉద్భవిస్తున్నాయని ఉద్ఘాటించింది. *[72]

తతో ఒ హమఖిలం లోకమాత్మ దేహసముద్భవై ।
భరిష్యామి సురాః శాక్తరా వృష్టే । ప్రాణధారకై ।

ప్రాచీన కావ్యాల్లో కూడ నాయికల దోహదం వల్లనే చెట్లు చిగురిస్తాయి, పుష్పిస్తాయి. స్త్రీకీ, పంటలకూ సంబంధముందనే అభిప్రాయం అతి ప్రాచీన కాలానికి చెందిన సింధు నాగరికతావశేషాలు సూచిస్తున్నాయి. హరప్పా మొహంజొదారో లోని ముద్రికపై తలక్రిందులుగా ఉన్న స్త్రీ మూర్తి గర్భాశయంలో నుండి మొక్కలు వస్తున్నట్లున్న చిత్రం ఉంది.

వ్యవసాయారంభకులు స్త్రీలే కాబట్టి వ్యవసాయిక మహత్తు వారికే ఉంటుందని ప్రాచీనుల భావం. ఈ భావాన్నే ప్రాచీన శిథిలావశేషాలు, పురాణాలు నిరూపిస్తున్నాయి. ప్రపంచ పర్యాప్తంగా వ్యవసాయిక దేవతలు స్త్రీమూర్తులుగానే పూజింపబడుతున్నారు.

స్త్రీలోని, ప్రకృతిలోని ఉత్పాదకశక్తులు పరస్పర ప్రభావితాలనెడి ప్రాచీన విశ్వాసాన్ని నేటికి మనలో నిలచిన ఆచార వ్యవహారాలు వెల్లడి చేస్తున్నాయి. సంతాన ప్రాప్తికొరకు స్త్రీలు చెట్లకు రాయిని, మట్టిపెడ్డను, కొత్తబట్టను కట్టి మొక్కుకుంటారు. పెళ్ళి అయిన వధువు ఒడిలో, బియ్యం, పండ్లు, కొబ్బరికాయలు, కూరగాయలు, త్రికోణాకారంలో మడచిన కొత్తబట్టలను పెడుతారు. విత్తనాలను వేయడం, మొక్కలను నాటడం, పంటను కోయడం వల్లె పడతుల పనులు. అనుకరణవల్ల, స్పర్శవల్ల ఉత్పాదకశక్తి స్త్రీ నుండి భూమికి, భూమినుండి స్త్రీకి సంక్రమిస్తుందనే భావంతో నవధాన్యాలతో, పండ్లతో, పసుపుకుంకుమలతో స్త్రీకి సంకేతమైన గొబ్బెమ్మను పూజించి భూమిపైన పెడతారు. భూమిపైననే ముగ్గుల మధ్యన త్రికోణాలను చిత్రిస్తారు. ఈ స్త్రీల ముగ్గుల్లోని అంతరార్థం తంత్రంలోనూ ప్రతిబింబిస్తుంది.

తంత్రంలో స్త్రీసత్వం, ప్రకృతి, ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తంత్రంలోని 'తన్' ధాతువుకు విస్తరించు లేదా వ్యాపింపచేయు అనే అర్థాలున్నాయి. సంతానాన్ని విస్తరింప చేయడమే తంత్రంలోని భౌతికార్థం. ప్రాచీన కాలంలోని తంత్రంలో సంతాన శక్తి కలిగిన స్త్రీకే అధిక ప్రాముఖ్యం ఉండేది. తంత్రంలోని 'వామాచరణ' అంటే స్త్రీ ఆచరణ అనే అర్థం ఉంది. [73] వామాచారంలోని పంచమకారాల్లో కులస్త్రీని ఆరాధించడం ఒకటి. అత్యున్నతమైన స్త్రీ శక్తిని ప్రజ్వలింప చేయడానికి తాంత్రికుడు స్త్రీగా మారాలి. యోగినులు, భైరవీలు అని పిలువబడెడి స్త్రీ యోగినుల వ్యవస్థ తాంత్రికుల్లో ఉంది. దేవి సహస్రనామాల్లో "యోగిని" కూడ ఒకటి. కొన్ని తంత్రాల్లో చండాలి, దొంబి, సవరిమొదలైన నిమ్నకులస్త్రీ పాత్రలకు ప్రాధాన్యం ఉంది. తంత్రంలోని మండలాలు, చక్రాలు, యంత్రాలు స్త్రీల ముగ్గులతో సామ్యం పొంది ఉన్నాయి. తంత్రవాదంలోని యోగ సాధనకు షట్చక్రభేదం అని అంటారు. ఆరు కోణాలుకల చక్రాలు ముగ్గుల్లో గోచరిస్తాయి. ఈ నిదర్శనాల వల్ల తంత్రానికి స్త్రీ మూలమనీ, స్త్రీ శక్తి ప్రతీకలతోనే తంత్రవాదంలోని చిత్రాలూ, ముగ్గు చిత్రాలూ ఏర్పడినాయని భావించవచ్చు. శాక్తేయులు, తాంత్రికులు యంత్రాల మధ్యన మండలాల మధ్యన దేవి విగ్రహాన్ని గానీ, ప్రతీకను గానీ, స్త్రీని గానీ కూర్చోబెట్టి పూజిస్తారు. పల్లె యువతులు త్రికోణాలతో, పద్మాలతో కూడిన ముగ్గుల మధ్యన శక్తి ప్రతీక అయిన గొబ్బెమ్మను పెట్టి ఆరాధిస్తారు. జానపద స్త్రీల భావాలు తంత్రవాదానికి మూలాలై, వారి ముగ్గులే చక్రాలు, మండలాలుగా రూపొందినాయని ఊహించవచ్చు.

రేఖాగణిత చిత్రాల తర్వాత ముగ్గుకు సౌందర్యాన్ని సమకూర్చేది పద్మం. పద్మాలు ముగ్గు మధ్యలో కానీ, చివరలో కానీ, చుట్టూర కానీ ముగ్గుల్లో మిళితమై ఉంటాయి. సంక్రాంతి సమయంలో పద్మపు

ముగ్గులేని ప్రాంగణం ఉండదు. అష్టదళపద్మం ముగ్గు చిత్రంలేని వ్రతం ఉండదు. ముగ్గుల్లో పద్మానికింతగా ప్రాధాన్యం రావడానికి కారణం - ఈ పువ్వు సౌందర్యానికీ, పవిత్రతకూ, స్వచ్ఛతకూ, సూర్యునికీ, సఫలతకూ సంకేతం కావడం.

వేదకాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు కమలం సాహిత్యంలో సౌకుమార్యానికీ, సౌందర్యానికీ ఉపమానమైంది. ఋగ్వేదంలో పుండరీక ప్రస్తావన ఉంది. అధర్వణ వేదంలో హృదయం అరవిందంతో సామ్యతను పొందింది. నేటికీ కవిత్వంలో హృదయం పద్మంతోనే పోల్చబడుతుంది. మహిళలు పూజామందిరంలో దేవతా విగ్రహాల ముందు 'హృదయ కమలం' ముగ్గును ప్రతి శుక్రవారం నాడు చిత్రిస్తారు. ఈ ఆచారం ఆంధ్రుల్లో, తమిళుల్లో, కన్నడిగుల్లో, మరాఠీ వారిలో కనపడుతుంది. వీరందరూ కమలాన్ని ఒకే నమూనాలో శుభం కొరకు, లక్ష్మీదేవికి సంకేతంగా చిత్రిస్తారు.

ఐతరేయ బ్రాహ్మణంలో అశ్విని దేవతలు పద్మమాలలను ధరించినట్లు వర్ణింపబడింది, అధర్వణ వేదంలో కుముదం వర్ణన ఉంది. పురాణాల్లో, కావ్యాల్లో,దేవతలు, కావ్యనాయికలు (నాయకులు) పద్మముఖులు, పద్మనేత్రులు, పద్మగంధులు, పద్మపాణులు, పద్మనాభులు, పద్మమాలినులు. లలితా సహస్రనామాల్లో దేవి "పుష్కరేక్షణ"

హిందూమతంలోనే కాక, బౌద్ధ, జైన మతాల్లోని సాహిత్య, శిల్ప, చిత్రకళల్లో కళా ప్రదర్శనకు కమలం అలంకారంగా ఉపకరించింది. బౌద్ధ మతంతోపాటు పద్మసౌందర్యం వివిధ కళల ద్వార విదేశాల్లోకి ప్రవేశించింది. బౌద్ధుల చిత్ర, శిల్పకళా ప్రభావంతో చైనా, జపాన్ దేశాల్లో పద్మం పవిత్రంగా, పరమ సౌందర్య సాధనంగా భావింపబడుతుంది.

వివిధ దళాలతో, వివిధ నమూనాలతో ఉండే ఉత్పలం ముగ్గులకు అలంకారం, అందం. ముగ్గుల్లోనే కాకుండ స్త్రీల చీరలపైన, కుట్టు పనుల్లోనూ, ఆభరణాల్లోనూ పద్మాల రూపాలు అందంగా తీర్చిదిద్దబడుతాయి. ఈజిప్టు,గ్రీకు, బాబిలోనియా మొదలైన దేశాలతో పాటు పద్మం ప్రపంచ పర్యాప్తంగా అలంకరణ కొరకు వాడబడుతుంది.

ఈజిప్టు, గ్రీకు దేశాలతోపాటు భారతదేశంలో కూడ పద్మాన్ని ప్రభాకరునికి ప్రతీకగానే భావిస్తారు.[74] జానపదులకు కూడ సరసీరుహం సూర్యునికి విలయం. వారి కథనం ప్రకారం సూర్యుడు ప్రొద్దంతా ఆకాశంలో తిరిగి, ప్రొద్దుగ్రుంకే సమయానికి పద్మంలోనికి ప్రవేశించి రాత్రంతా నిద్రపోతాడు. ఈ కథాకల్పనకు ఆధారం సూర్యోదయంతో వికసించి, అస్తమయంతో ముకుళించుకునే పద్మం ఈ పువ్వులోని అనేక రేకులు అనంతమైన సూర్య కిరణాలతో సామ్యం పొందినాయి.*[75] శిల్పకళ, చిత్రకళల్లోని సూర్యుని రథచక్రానికి ఎనిమిది ఆకులుంటాయి. కొన్ని ముగ్గుల్లో కూడ అధికంగా అష్టదళ పద్మాలుండడం ఒక విశేషం. కొన్ని ముగ్గుల్లోని రథం మధ్య,రథ చక్రం మధ్య పద్మం ఉంటుంది. సూర్యోపాసకులు అష్టదళ పద్మాన్ని సూర్య భగవానునికి సంకేతంగా చిత్రించి ప్రతిరోజూ పూజిస్తారు. ఈ నిదర్శనాల వల్ల పద్మం సూర్యునికి ప్రతీక అని నిర్ధారింపవచ్చు.

పద్మం నీటిలో పుట్టడం వల్ల, నీటి బిందువులు ఆకులకుగానీ పూరేకులకు గానీ అంటునందువల్ల ప్రాచీనులకు ఈ పువ్వు స్వచ్ఛతకూ, పవిత్రతకూ ప్రతీక అయ్యింది. మానవునికి ప్రాణాధారమైన నీరు ప్రాచీనులకు దేవతాసమమైంది. ఆ నీటి నుండి జనించిన పద్మం కూడ దివ్యత్వాన్ని ఆపాదించుకొని దేవతలకు ఆసనమైంది.

త్రిమూర్తులు, వారి సతీమణులు, వినాయకుడు, బుద్ధుడు, జినుడు మొదలైనవారు పద్మాలపైన ఆసీనులైనట్లు చిత్రాల్లో మనం చూస్తుంటాం. బౌద్ధుల శిల్ప, చిత్రకళల్లో బుద్ధుని పాద గుర్తులు పద్మాలు. బౌద్ధమతంలోని వజ్రయాన శాఖలోని తార, అవలోకితలు పద్మభూషితలు. టిబెట్ లోని బౌద్ధులకు "ఓంమణి పద్మేహం" అనే మంత్రం మొదటిది, ముఖ్యమైంది. జైనమతాచార్యుడైన ఆరవ జినునకు పద్మం చిహ్నం.

నీరు వ్యవసాయానికి, మానవ జీవితానికి ముఖ్యాధారం. అందుకే నీరు సఫలతకు సంకేతం. సఫలతాశక్తికి దోహదం చేసే ప్రతిదానిలోనూ మన ప్రాచీనులు స్త్రీ సత్వాన్ని ఆరోపించారు. ఈ కారణం వల్లనే మన పురాణాల్లోని నదులు స్త్రీ రూపాలను పొందాయి. వీటిలోని అంశాలు నదీమ తల్లికి అవయవాలైనాయి. పద్మం నివాసం నీరైనందువల్ల, అతి త్వరగా వ్యాపించే గుణాన్ని పొందడం వల్ల ఆ పువ్వు సఫలతకు చిహ్నమై, స్త్రీ గర్భానికి, స్త్రీ జననాంగానికి సంకేతంగా మారింది. ఈ అంశాన్ని సంస్కృత వాఙ్మయం కూడ నిరూపిస్తుంది. శతపథ బ్రాహ్మణంలో బ్రహ్మ పుండరీక పుత్రోద్భవుడు. సృష్టికి పూర్వం సృష్టి కర్త సహస్రదళ పద్మం నుండి జన్మించినాడనీ, బ్రహ్మ తండ్రి పద్మనాభుడైన విష్ణుభగవానుడనీ, పురాణాలు వివరిస్తున్నాయి. హిందూమతంలోనే గాక మహాయాన బౌద్ధ శాఖలో కూడ స్త్రీ సృష్టిలేని ఆదికాలంలోని దేవతలందరూ పద్మ సంభవులే అని కథలు చెప్పుతున్నాయి. బోధిసత్త్వుడు పద్మభవుడు, పద్మపాణి. టిబెట్ లోని మొదటి లామా పద్మసంభవుడు. ఈ కథలన్నింటివల్ల ప్రాచీనులు పద్మాన్ని స్త్రీ గర్భానికి ప్రత్యామ్నాయంగా, సృష్టికి సంకేతంగా స్వీకరించినారనే అంశం విదితమౌతుంది. మొదట సృష్టికి మూలకారణమైన పద్మం కాలక్రమేణ భాగ్యదేవత లక్ష్మికి

వాసస్థానమైంది. ఈ అభిప్రాయాన్ని ఆధారంగా తీసుకునే తమిళ దేశీయులు "ఐశ్వర్యకోలం"- దేవతా మందిరంలో చిత్రిస్తారు. ఈ ముగ్గు వల్ల ఐశ్వర్యం ప్రాప్తిస్తుందని వారి నమ్మకం.

ప్రాచీనులకు సంపద అంటే ధాన్యసంపద. సస్యసంపద కళకళలాడాలంటే భూమిలోని సఫలతాశక్తి అధికం కావాలి. ఈ శక్తి కొరకే ప్రాచీనులు సృష్టికీ,సఫలతకూ ప్రతీక అయిన పద్మం పైన లక్ష్మిని అధిష్ఠింపచేసి ఆరాధించారు.పద్మం నుండి లక్ష్మిదేవి ధనాన్ని, ధాన్యాన్ని ప్రసాదించడం మనం విగ్రహాల్లోను చిత్రాల్లోను చూస్తుంటాం.



ముగ్గుల్లోని అందమైన అరవిందాలు ఐశ్వర్యకోలం

సంక్రాంతి సమయంలో పంటలు పండి ఉంటాయి. కాబట్టి ధాన్యలక్ష్మికి ప్రతిగా పద్మాన్ని ముగ్గుల రూపంలో వేసి మధ్యన గొబ్బిని పెట్టి పూజిస్తారు. ఆవుపేడ భూమిలోని సారాన్ని అధికం చేస్తుంది కాబట్టి

అది సఫలతకు సూచిక. గోవు సర్వావయాలను దేవతలాశ్రయించ సందువల్ల తనకు ఆశ్రయం లేదని లక్ష్మీదేవి గోమయాన్ని ఆశ్రయించిందని జానపదులు కథ చెపుతారు.[76] అందుకే గోమయం తో చేసిన గొబ్బి లక్ష్మి సమానురాలు. నోముల్లో, వ్రతాల్లో అష్టదళపద్మాల ముగ్గులను వేసి వాటి మధ్య కలశం పెట్టి పూజిస్తారు. కలశంపైన దేవతా విగ్రహం ఉంటుంది.

సంక్రాంతి సమయంలో అష్టదళ పద్మం ముగ్గు మధ్యన గొబ్బి దేవతను గౌరీదేవతగా ఆరాధిస్తారు. భోగినాడు పద్మం ముగ్గును వేస్తారు పద్మం, గొబ్బి, కలశం,సంపద సఫలతా చిహ్నాలు.

లక్ష్మీదేవికి ప్రతిరూపమైన ఒక్క కమలాన్నే ముగ్గుగా నేలపై వేయకూడదని అంటారు. అందరూ నడిచే వాకిట్లో కమలం ముగ్గు వేస్తే అది త్రొక్కబడుతుందనీ, కమలాన్ని త్రొక్కితే లక్ష్మీదేవిని త్రొక్కినట్లే అని అతివల అభిప్రాయం. ముగ్గుల మధ్యన కమలం వేయవచ్చనీ పద్మరూపాలతో కూడిన అనేక ముగ్గులను వాకిట్లో చిత్రిస్తుంటారు. లక్ష్మికి ప్రతీక అయిన పద్మాన్ని పూజామందిరంలో వ్రతం పీట పైన వేస్తుంటారు. పూజామందిరంలో మూడు దళాలు, ఆరు దళాలు, ఏడు దళాలు, ఎనిమిది దళాలతో అరవిందాన్ని అలంకరిస్తారు.





శ్రీపాళపద్మం

ముగ్గుపేరు శ్రీకి, పద్మానికి మధ్యనున్న సంబంధానికి సూచిక.

పద్మంలోని అష్టదళాలు అష్టలక్ష్మీమూర్తులకు సంకేతాలు. పరాశక్తి అయిన లలితాదేవి సహస్రనామాల్లో "అష్టమూర్తి" ఒకటి. అష్టమూర్తులు లక్ష్మి, మేధా, ధరా, పుష్టి, గౌరి, తుష్టి, ప్రభ, ధృతి. పద్మానికి గల "శ్రీపర్ణం" అనే పర్యాయపదం పద్మానికి, లక్ష్మికి గల అవినాభావ సంబంధాన్ని స్పష్టం చేస్తుంది.

పవిత్రతకూ, సఫలతకూ, సౌందర్యానికీ సంకేతమైన సరసీరుహాన్ని తాంత్రికులు స్వీకరించి మండలాల్లో, చక్రాల్లో, యంత్రాల్లో చిత్రించారు. శ్రీ చక్రంలో తొమ్మిది త్రికోణాలుంటాయి. క్రింది వైపునకున్న త్రికోణాలు శక్తికీ, లేదా ప్రకృతికీ పైవైపునకున్న త్రికోణాలు పరమేశ్వరునికి లేదా పురుషునికి ప్రతీకలు అని తాంత్రికులు వివరిస్తారు. లలితాదేవిని 'సర్వ తంత్రేశి, శ్రీరాజచక్రనిలయ' అని స్తుతించడం వల్ల తాంత్రికులు శక్తికి ఒసంగిన ప్రాధాన్యం స్పష్టమౌతుంది.

శ్రీ చక్రంలోని త్రికోణాలు వివిధ నామాలతో పూజింపబడుతాయి. బాలాసుందరి, త్రిపుర సుందరి, బాలా త్రిపుర సుందరి మొదలైనవి మొదటి త్రికోణాల పేర్లు , 8 త్రికోణాల చక్రం సర్వరోగ హరణం.

ముగ్గుల్లో కూడ 3,6,8, కోణాలతో వివిధ రూపాలు కనపడుతుంటాయి. రెండు త్రికోణాల చుట్టూరా పద్మాలు, పద్మ దళాలతో అనేక ముగ్గులను మగువలు చిత్రిస్తుంటారు.

తంత్రంలోని సర్వతోభద్ర మండలం శుభాన్నీ, దుష్ట శక్తులనుండి రక్షణనూ చేకూర్చుతుందని తాంత్రికుల విశ్వాసం. ఈ మండలాన్ని మంత్రోచ్చారణతో పూజిస్తే సర్వ సంపదలు, సుఖాలు సంప్రాప్తిస్తాయని వారు విశదీకరిస్తారు. ఈ సర్వతో భద్ర మండలంలో అష్టదళ పద్మం, చుట్టూ వలయం, ఒక చతుర్భుజం, దాని చుట్టూరా

పువ్వులూ, లతలూ అల్లుకొని ఉంటాయి. ఈ మండలాన్ని పోలిన ముగ్గులను మగువలు వేస్తుంటారు.

తాంత్రికుల్లోనే గాక జైనమతానికి చెందిన సిద్ధి చక్రంలో అష్టదళాలు వృత్తాకారంలో చిత్రింపబడింది. తీర్థంకరుల ఆరాధనకు సంబంధించిన చిత్రంలో మధ్యనగం తీర్థంకరుల చిత్రం చుట్టూరా రెండు త్రికోణాలు, వాటిని ఆవరించి వలయం, వలయం చుట్టూ చతుర్భుజం చిత్రితమైంది. [77]

సంక్రాంతికి వేసే భోగి పద్మం ముగ్గులో అష్టదళ పద్మాలు, లతలు,పూలు ఉంటాయి. వీటి మధ్యన గౌరీదేవి ప్రతీక గొబ్బిదేవతను పెట్టి పూజిస్తారు. శాక్తేయులు, తాంత్రికులు చక్రాల మధ్య, మండలాల మధ్య దేవి విగ్రహాన్ని కానీ, స్త్రీనికానీ కూర్చోపెట్టి పూజిస్తారు. ఈ పోలికలను బట్టి అతిప్రాచీన కాలం నుండి వస్తున్న ముగ్గులు, మండలాలు, చక్రాలు పరస్పర ప్రభావితాలనీ, పరస్పర ఆధారాలనీ విదితమౌతుంది.



తంత్రంలోని సర్వతోభద్ర మండలం



శ్రీచక్రం



ముగ్గు

స్త్రీం ముగ్గు

సంక్రాంతి సమయంలో భోగినాడు 'వైకుంఠవాకిళ్ల' ముగ్గును చిత్రిస్తారు. తెరుచుకున్న వాకిళ్ళనుండి లక్ష్మీదేవి వస్తుందని కొంత మంది అభిప్రాయం. మరికొంతమంది సూర్యుడు కానీ, సంకురుమయ్య గానీ వస్తారని భావిస్తారు. [78] లక్ష్మీదేవి వెళ్ళి పోకుండ ముక్కనుమనాడు వాకిళ్లను మూసి వేసిన ముగ్గు వేస్తారు. ఈ లక్ష్మి ధాన్యలక్ష్మియే. వ్యవసాయారంభకురాలైన స్త్రీ, ముగ్గుల్లోనే సస్యరమకు స్వాగతం పలికి, ఇంటిలోనే ఆమెను బంధించి వేయడానికి ప్రయత్నిస్తుంది.

దక్షిణ దేశంలో ధనుర్మాసం నుండి పుష్యమాసంలోని సంక్రాంతి వరకు ముగ్గులను వలయాకారంలో, రథ రూపంలో వేస్తుంటారు. ధనుర్మాసాంతానికి సూర్యుడు దక్షిణాయాన్ని పూర్తి చేసుకొని ఉత్తరాయణంలోనికి ప్రవేశిస్తాడు. దక్షిణ దిక్కుకు యముడు అధికారి. దక్షిణాయనంలో మరణించిన వారు నరకలోకానికి పోతారని ఉత్తరాయణంలో మరణించిన వారికి స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయనీ, పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయనీ హిందువుల విశ్వాసం.

సూర్యుడు మకర రేఖనుంచి కర్కాటకరేఖ వైపుకు మరల గానే భారతీయులకూ, అరేబియా, సిరియా, రోము, గ్రీసు దేశవాసులకూ దిన ప్రమాణం పెరుగుతుంది. చలి అంతరిస్తుంది. అందుకే వీరికి సంక్రాంతి సంతోష కారణం. సంక్రాంతమంటే సూర్యుడు ద్వాదశ రాసుల్లో ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించడం. ఈ విధంగా సూర్యుని ప్రవేశాన్ని అనుసరించి 12 రాశులకు 12 నెలలు ఏర్పడినాయి. కర్కాటక సంక్రమణం మొదలుకొని (ఆషాడం నుండి పుష్యం వరకు) ఆరు నెలల వరకు దక్షిణాయనం, మకర సంక్రాంతిలో (పుష్యం నుండి ఆషాడం వరకు) ఉత్తరాయణం ప్రారంభమౌతుంది. ప్రతి మాసానికి సూర్యుడొక కొత్త రాశిలో ప్రవేశిస్తున్నమా, ఉత్తరాయణం ప్రారంభమైన సంక్రాంతి కాబట్టి

మకర సంక్రాంతికి ప్రాధాన్యం ప్రాప్తించింది.

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడంతో నిద్రించే దేవతలు మేల్కొంటారు. దేవతల కాలమానం ప్రారంభమై పుణ్యకాలం ప్రాప్తిస్తుందని హిందువుల అభిప్రాయం. మహాభారతంలో దక్షిణాయణంలో శరతల్పశయనుడైన భీష్మాచార్యుడు ఉత్తరాయణం ప్రారంభం కాగానే మృత్యువును ఆహ్వానించాడు. పితృదేవతల సద్గతులకు ఈ కాలం ముఖ్యమైంది. అందుకే దానధర్మాలతో తర్పణాలు విడుస్తారు.

భారతీయులు సూర్యోపాసకులు. సంక్రాంతి సూర్యునికి సంబంధించిన పెను పండుగ. సూర్యుడు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. పంటలకు మూలమైన వెలుతురును ప్రసరిస్తాడు. సంక్రాంతి సమయానికి తొలకరిలో వేసిన పైర్లన్నీ పండడం వల్ల ప్రకృతి అంతా రమణీయంగా రూపొందుతుంది. పల్లెపడతులు ప్రకృతి అందానికీ, పండిన పంటలకూ కృతజ్ఞతా సూచకంగా సూర్యుని వివిధ ప్రతీకలను ముగ్గుల్లో చిత్రిస్తారు.

ఉత్తరాయణంలో సూర్యుని ప్రవేశ సూచనగా రథాన్ని సంక్రాంతి పండుగకు చిత్రించడం ఆచారం. వలయం, చక్రం, స్వస్తికలు సంక్రాంతి ముగ్గుల్లో చోటు చేసుకుంటాయి. ఈ రూపాలు చుక్కలతో రూపొందినవూ గీతల ముగ్గును సంక్రాంతికి తప్పని సరిగా వేయడం ఆచారం. రేఖాగణిత శాస్త్ర ప్రకారంగా ఉండే ఈ గీతలు సూర్య కిరణాలకు ప్రతి రూపాలు. ఇవి సూర్య కిరణాల మాదిరి వంకరటింకరలు లేకుండ నిలువుగా, ఏటవాలుగా వివిధ కోణాల రూపాల్లో ఉంటాయి.

సూర్యునికి చిహ్నంగా వలయం చిత్రించడం రాతియుగం చిత్రాల్లో కన్పిస్తుంది. మిర్జాపూర్, హోశంగబాద్ రాతి గుహల్లోనూ

వలయం, దాని చుట్టూరా సూర్యకిరణాలను సూచించే గీతలు చెక్కబడి ఉన్నాయి. హరప్పా మొహంజొదారో శిథిలాల్లోని ముద్రలపైన వలయాలు,4,7, ఆకులున్న చక్రాలు కిరణాలతో కూడిన వలయాలు చిత్రించి ఉన్నాయి. క్రీ.పూ. రెండవ శతాబ్దానికి చెందిన నాణాల్లో కిరణాలను సూచించే గీతలతో వలయాలు, సూర్యుని ప్రతీకలుగానే చెక్కబడినాయి.

జానపద కథల్లో బూడిదతో గానీ కర్రతోగానీ వేసిన వలయానికి అద్భుతమైన మాంత్రిక, రక్షక శక్తులు ఉంటాయి. జానపద రామాయణంలో లక్ష్మణుడు, సీత చుట్టూరా వలయాన్ని గీచి, గీతను దాటకూడదని హెచ్చరిస్తాడు. సీత వలయాన్ని దాటి రావణాసురునికి బందీ అవుతుంది. కథల్లో పశువులకు వలయం రక్షరేఖగా వర్ణింపబడింది. పల్నాటి వీరకథలో పశువు చుట్టూరా వలయ రేఖను బ్రహ్మనాయుడు గీస్తాడు. వీరబ్రహ్మం కూడ పశువులను వలయంలో పెట్టి తపస్సమాధిలో కూర్చుంటాడు. వలయం దుష్టశక్తులను లోపలికి ప్రవేశించకుండ అడ్డగిస్తుందనే జానపదుల విశ్వాసం ఈకథల ద్వారా విదితమౌతుంది.

సూర్యగోళం వలయాకారంలో ఉంటుంది. కాబట్టి వలయాన్ని దుష్టశక్తుల విరోధకంగా భావించడానికి కారణం కావచ్చు. రాజస్థాన్ లో పుత్ర సంతానం ప్రాప్తించగానే సూర్య భగవానుని చిహ్నంగా తలుపులపైన వలయాన్ని చిత్రిస్తారు. సూర్యారాధన సమయంలోవేసెడి సూరజ్-కా-చౌక్ కూడ వలయాకారంలోనే ఉంటుంది. బెంగాల్ ప్రాంతంలో సూర్యుడు ఉత్తరాయణం ప్రవేశించిన నాటినుండి సూర్యుని ప్రతీకలుగా కిరణాలతో కూడిన వలయాలను అల్పనల్లో చిత్రిస్తారు.

తెలంగాణా ప్రాంతంలో భోగి, సంక్రాంతి రెండు రోజుల్లూ రథం ఇంట్లోకి వస్తున్నట్లు, కనుమునాడు ఇంట్లోనుండి వెళ్లిపోతున్నట్లు

చిత్రిస్తారు. ఈ రథం మధ్యన చిన్న సూర్యబింబాన్ని కానీ, పద్మాన్ని కానీ వేస్తారు. రథం సూర్యునికి, ఉత్తరాయణానికి చిహ్నం. తెలంగాణా ప్రాంతంలో రథంలో సూర్యుడు గృహ ప్రవేశం చేస్తాడనీ నమ్ముతారు. రథంలో సంకురుమయ్య అరుదెంచుతాడనీ, ప్రతి సంవత్సరం అతడు ఒక్కో జంతువును అధిరోహిస్తాడనీ, ఏ జంతువుపై వస్తాడో ఆ సంవత్సరం ఆ జంతువులు ఎక్కువగా చనిపోతాయనే విశ్వాసం ప్రజల్లో ఉంది. ఆంధ్ర ప్రాంతంలో ముక్కనుమనాడు ఇంట్లోనుండి వెళ్లిపోతున్నట్లు రథాన్ని వేసి దాన్ని పొరుగిండ్ల రథాల ముగ్గులతో కలుపుతారు.

ముగ్గుల్లో రథ గోపురం తూర్పు దిక్కువైపు, చక్రాలు పడమర వైపు, ధ్వజం ఉత్తరం వైపుంటాయి. ముగ్గుల్లోనే కాక ప్రాచీన కాలం నుండి రథం సూర్యునికి చిహ్నంగా భావింపబడుతుంది. శుంగవంశీయులు సూర్యునికి ప్రతీకగా నాలుగు గుర్రాలచేత లాగబడే రథాన్ని నాణాలపై చెక్కించారు. బుద్ధగయలో 4 గుర్రాలచేత కూడిన రథం సూర్యున్ని సూచిస్తుంది. సాహిత్యంలోనూ, చిత్రకళలోనూ, శిల్పకళలోనూ రథాన్ని, వలయాన్ని,సూర్యునికి చిహ్నంగానే గ్రహించారు.

సంక్రాంతికివేసే రథ చక్రంలో 12,8,7,6,4 ఆకులను చిత్రిస్తుంటారు. ఇవి 12 మాసాలకు, ఎనిమిది దిక్కులకు, ఇంద్ర ధనుస్సులోని ఏడు రంగులకు, ఆరు ఋతువులకు, నాలుగు దిక్కులకు సంకేతాలు. గమనం, భ్రమణం సూర్యుని ధర్మాలు కాబట్టి బెంగాల్ ప్రాంతంలో పిల్లవాడు నడిచేటప్పుడు గుర్రపు బొమ్మను సూర్యునికి సమర్పిస్తారు. అంటే గుర్రం కూడ సూర్యునికి చిహ్నం. చక్రం పరిభ్రమణానికి సంకేతం. సూర్యుడు ఆకాశంలో నిరంతరం పరిభ్రమిస్తుంటాడు కనుక చక్రం అతనికి చిహ్నమైంది.ఒరిస్సాలోని

కోణార్క్ దేవాలయంలో 8 ఆకులతో ఉన్న ఏకశిలలోని చక్రం సూర్యునికి ప్రతిగా చెక్కబడి భారతీయుల శిల్పకళాచాతుర్యాన్ని వెల్లడిస్తుంది.

సాహిత్యంలో, చిత్రకళలో, శిల్పకళలో, ప్రాచీన నాణాలపై వలయాన్ని, చక్రాన్ని, రథాన్ని సూర్యునికి సంకేతాలుగా స్వీకరించారు. సూర్యుడు కాంతికీ, శక్తికీ, సఫలతకూ, భ్రమణానికీ ప్రతీక. ఆందోళనను, భయాన్ని కలిగించే చీకటిని పారద్రోలి వెలుతురును ప్రసాదించే ప్రభాకరుడంటే ప్రాచీన యుగపు మానవుని నుండి ఆధునిక యుగంలోని మానవుని వరకు ఆరాధనా భావం ఉంది. అందుకే గుహల్లోని చిత్రాలనుండి దేవాలయాల్లోని శిల్పకళల వరకు సూర్యుని చిహ్నాలనే చిత్రించారు.

వేదకాలానికి పూర్వం అనార్య సంస్కృతిలో సూర్యుడు మానవ రూపంలో ఆరాధింప బడినట్లు ఆధారాలు లేవు. సింధునాగరికతా సంస్కృతిలోని ముద్రలపైన మృణ్మయ పాత్రలపైన, పూసలపైన సూర్యుని ప్రత్యామ్నాయాలైన వలయం, స్వస్తిక్ గుర్తులున్నాయి. వేదకాలంలో సూర్యుడు రథారోహకునిగా, ఆకాశపుత్రునిగా, ఉషాదేవి ప్రియునిగా వర్ణింపబడినాడు. "యద్ రూపః పురుషాభవతి, తద్రూపాతస్య దేవతా" అన్నట్లు రామాయణ, మహాభారత కాలంనాటికి సూర్యుడు మానవ రూపాన్ని పొందినాడు. అతనిపేరుపైన వంశాలు ఏర్పడ్డాయి. క్రీ.శ. 7వ శతాబ్ది వరకు సూర్యమతం ఏర్పడింది. సంధ్యోపాసన, సూర్య నమస్కారాలు, సూర్యారాధన ఉత్తరం నుండి దక్షిణం వరకు కనపడుతున్న ఆచారాలు.

సూర్యకాంతి వల్లనే అంకురోత్పత్తి జరిగి, మొలకలు మొలకెత్తి పంటలు పండుతాయి కాబట్టి సఫలతా శక్తికి మూలకారకుడైన భానుణ్ణి

స్త్రీల చిత్రలిపి - సంకేతాలు

భగవానునిగా భావించి పూజిస్తారు. సంక్రాంతి సమయంలో స్త్రీలు తమ పంటలకు మూల కారకుడైన సూర్యుణ్ణి, చల్లటి కాంతిని ప్రసరించే చంద్రున్ని "సంక్రాంతి నెలవంక" ముగ్గులో చిత్రించి తమ కృతజ్ఞతా భావాన్ని ప్రకటించుకుంటారు. ముగ్గు మధ్యలో చంద్రుడు నాలుగు వైపుల సూర్యుడు విరాజిల్లుతుంటారు. ముగ్గు చుట్టూరా ధాన్యాన్ని, మధ్యలో లతలను, చతురస్రాకారంలోని పరిమడులను చిత్రిస్తారు. నాలుగు వైపుల ప్రసరించే సూర్య కాంతి వల్లనే పంటలు పండుతున్నాయనే పడతుల భావాలు ఈ ముగ్గులో స్పష్టంగా గోచరిస్తున్నాయి. సంక్రాంతి సమయంలో వేసే 'గుండ్రపు నెల ముగ్గు' మధ్యలో చంద్రకళలు చుట్టూర గుండ్రటి సూర్యబింబాలు చిత్రింప బడతాయి. వలయాలు సూర్య భ్రమణాన్ని సూచిస్తాయి. ముగ్గు మధ్యలో లతలు, నాలుగు దిక్కులా పరికంకులను బోలిన రూపాలు కూడ స్త్రీలు పంటలకు మూల కారకుడు సూర్యుడనే భావాన్ని సూచించడానికే వేస్తారని ఊహించవచ్చు.సామాన్యంగా సూర్యునికి, సంక్రాంతికి సంబంధించిన ముగ్గులో ధాన్యపు గుర్తులుంటాయి. ఈ గుర్తులు రథం ముగ్గులో, తెలంగాణాలో సంక్రాంతికి వేసే కుండల ముగ్గులో కనపడుతుంటాయి. అలంకార ప్రాయమైన ఈ రంగవల్లుల్లో ప్రకృతి శాస్త్రానికి సంబంధించిన అంతరార్థాన్ని అతివలు నిక్షిప్తపరిచినారు.

ఆటవికులు, జానపదులు సఫలతా శక్తిని పొందినవాటికి సఫలతా శక్తిని ప్రసాదించే మహత్తు ఉంటుందని విశ్వసిస్తారు. గుజరాత్ లోని స్త్రీలు సంతానప్రాప్తి కొరకు అరవిందుణ్ణి అర్చిస్తారు. నూతన వధూవరులు సూర్యునికి నమస్కారాలు చేస్తారు. వారు ప్రసవానికి ముందు, తర్వాత కూడ సూర్యరశ్మిలో కూర్చుంటారు. పసిపాపలకు ప్రతి రోజూ ప్రభాతోదయ సమయ కాంతి కిరణాలను చూపెట్టాలని

తెలుగు వారిలో కూడ ఒక నమ్మకం ఉంది. ఆధునిక వైద్య శాస్త్రజ్ఞులు కూడ పసిపాపంపైన ప్రభాత సమయంలో సూర్యరశ్మిని ప్రసరింపచేస్తే కళ్ళకు మంచిదని, పచ్చకామెర్లు రావని తల్లులకు సలహా ఇస్తున్నారు. ఈ కారణం వల్లనే భిల్లులు కూడ పిల్లవాడు పుట్టగానే సూర్యరశ్మిలో కూర్చోబెట్టుతారు. గుజరాత్ లో కంటి వ్యాధులు వచ్చినపుడు సూర్యునికి మ్రొక్కుకుంటారు.

సూర్యకిరణాలకు సూక్ష్మజీవులను సంహరించే శక్తి ఉంది కాబట్టి అరవిందుడు ఆరోగ్య ప్రదాయితగా ఆరాధనలను అందుకుంటున్నాడు. ఆరోగ్యం వల్ల బలం, బలంతో భాగ్యం ప్రాప్తిస్తుంది. అందుకే బెంగాల్ లో ఆరోగ్యం కొరకు ఆదిత్యున్ని ఆరాధిస్తారు. బెంగాల్ ప్రాంతంలో కుష్టువ్యాధిని నయం చేసుకోవడానికి, కీళ్ళనొప్పులను తగ్గించుకోవడానికి తెల్లటి కోళ్ళను, బాతులను, మేకలను సూర్యునికి బలి ఇస్తారు. తెలుపు సూర్యకాంతికి చిహ్నం. రథ సప్తమి వ్రత కథలో కూడా సూర్యారాధనతోనే రాజకుమారుడు ఆరోగ్యవంతుడౌతాడు.[79]

సూర్యకాంతి తీక్షణంగా లేని దక్షిణాయణంలో మరణాలు ఎక్కువనీ, ఆ కాలంలో నరక ద్వారాలు తెరుచుకుంటాయనీ, ఉత్తరాయణంలో సూర్య కిరణాలు తీక్షణంగా ఉంటాయి కాబట్టి మరణాలు తక్కువనీ, ఆకాలంలో వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయనీ తెలుగు వారి నమ్మకం. అందుకే ఆరోగ్యాన్ని ప్రసాదించే అరవిందుణ్ణి ఆహ్వానిస్తూ నాలుగు మూలల తెరచి ఉన్న వాకిళ్ళ ముగ్గును భోగి, సంక్రాంతి నాడు వేస్తారు.







సూర్యుని ప్రతీకలు

చక్రం-రథచక్రం. వలయం-సూర్యరథం-వలయం

మధ్యన ముగ్గును వేసి చుట్టూర ప్రవేశమార్గాన్ని సూచించే గీతలను గీస్తారు. ధనుర్మాసాంతం వరకు కొన్ని ప్రాంతాల్లో ఈ ముగ్గును వేసే ఆచారం ఉంది. సంక్రాంతి మరురోజు వైకుంఠ వాకిళ్ళను మూసివేస్తారు. తెరచుకున్న వాకిళ్ళనుండి ప్రవేశించిన సూర్యుడు మళ్లీ వెళ్లి పోకుండ ఉండడానికి ముగ్గులోని వైకుంఠవాకిళ్లను మూసివేస్తారు.

మన పండుగల్లో రథ సప్తమి సూర్యుని పండుగ. తెలుగు జానపదులు గ్రామదేవతల పండుగలను ఆదిత్యునివారమైన ఆదివారమే జరుపుతారు. తెలుగు తల్లులు తమ పిల్లలకు సూర్యుని వివిధ పేర్లను పెట్టుకుంటారు తెలుగు పడతులు సూర్యుని సంకేతాలను సంక్రాంతి ముగ్గుల్లో చిత్రిస్తారు. సూర్యుని చిహ్నాలను భూమిపైన ముగ్గుల్లో

వేయడంలోని అంతరార్థం శాస్త్రజ్ఞాన రహితమైన మనస్తత్వాన్ని వ్యక్తం చేస్తుంది. ఆటవికులు జానపదులు సూర్యుణ్ణి పురుషునిగానూ పుడమిని స్త్రీగానూ భావిస్తారు. ఈ భావమే మన పురాణ సాహిత్యంలో కూడ గోచరిస్తుంది. ఆస్ట్రేలియా, న్యూగినీల మధ్య ఉన్న ద్వీపవాసులు కూడ సూర్యుడు పురుషుడనీ, భూమి స్త్రీ అనీ వారి సంయోగ ఫలితంగానే భూమి సారవంతమైతే పంటలు బాగా పండుతాయనే విశ్వాసంతో ఉత్సవాలను జరుపుకుంటారు. ప్రాచీన కాలంలోని పడతులు కూడ పృథ్వీ ప్రభాకరుల సమ్మేళనం వల్ల పంటలు అధికం అవుతాయనే అభిప్రాయంతో సూర్యుని చిహ్నాలను భూమిపైన ముగ్గుల్లో వేయడం ఆరంభించి ఉండవచ్చు. నేటికి వారి మనస్తత్వం ముగ్గుల్లో ప్రతిబింబిస్తూ సంప్రదాయంగా మారిందని ఊహించవచ్చు.



గుండ్రపు వలముగ్గు. మధ్యలో చంద్రవంక, చుట్టూర ఉన్న వలయాలు సూర్యుని సంకేతాలు, సూర్యరశ్మికి పండిన పంటలను సూచించే తీగలు పరికంకులు



సంక్రాంతి వెలపంకముగ్గు నాల్గు వైపుల సూర్య బింబాలు చదరాలు వరి మడులకు సంకేతాలు తీగలు పంటలకు ప్రతీకలు

ముగ్గుల్లో స్వస్తిక్ రూపాలు పద్మాల మధ్యన, తీగల మధ్యన, చక్రాల మధ్యన అందంగా ఒప్పారుతుంటాయి. ఒకటి, నాలుగు, ఎనిమిది స్వస్తిక్‌లతో కూడిన ముగ్గులు వాకిట్లో కనపడుతుంటాయి.

స్వస్తిక్ సూర్యునికి సంకేతంగా, మత చిహ్నంగా, జాతి చిహ్నంగా (హిట్లరు), దుష్ట శక్తులను దరిచేరనివ్వని రక్షణ చిహ్నంగా, అలంకరణా చిహ్నంగా వివిధ దేశాల్లో వాడబడుతుంది. ఈ గుర్తు హరప్పా, మొహెంజొదారో శిథిలాల్లోనే గాక, ప్రాచీన జపాన్, పోర్చుగల్, పర్షియా, టర్కీ, గ్రీకు శిథిలాల్లో కూడ లభించింది. [80] అయితే స్వస్తిక్ గుర్తు సంక్రాంతి ముగ్గుల్లో చోటు చేసుకోవడానికి కారణం అది శుభానికీ, సూర్యునికి ప్రతీక కావడం.

గుజరాత్‌లో సూర్యుని ఆసనం స్వస్తిక్. [81] ప్రాచీన శాసనాల్లో సూర్యునికి గుర్తుగా స్వస్తిక్‌ను చిత్రించేవారు. ప్రాచీన శిధిలాల్లోని ముద్రలను, శిల్పాలను ఆధారంగా గైకొని స్వస్తిక్ ఏర్పడిన విధానాన్ని పరిశీలిస్తే అది మొదట సూర్యుని సంకేతమే అని స్పష్టమౌతుంది. స్వస్తిక్ తొలిదశ మధ్యలో బిందువుతో ఉన్న వలయం. రెండవదశ కిరణాలను సూచించే గీతంతో కూడిన వలయం. గీతల్లో నాల్గు మాత్రమే మిగిలి సూర్యుని భ్రమణాన్ని సూచిస్తూ వంగడం మూడవదశ. నాలుగవ దశలో బిందువు వలయం అంతరించి నేటి స్వస్తిక్ రూపం మిగిలింది.







త్రిరత్నాలను సూచించే ముగ్గు స్త్రీ పురుష స్వస్తిక్‌లు

ఈ స్వస్తిక్ గుర్తును వివాహాది శుభకార్యాల్లోనూ, ఇంటి గోడలపైననూ వ్యాపారుల ఖాతా పుస్తకం మొదటి పేజీపైననూ చిత్రిస్తుంటారు. గుజరాతీ స్త్రీలు స్వస్తిక్ వ్రతం చేస్తారు. వారు స్వస్తిక్ గుర్తును గీచి ప్రతిరోజూ చాతుర్మాసంలో పూజిస్తారు. స్వస్తిక్ గుర్తు కలిగిన పళ్ళాన్ని బ్రాహ్మణునికి ఇచ్చి ఉద్యాపన చేస్తారు.

గుజరాతీ భాషలోని మొదటి అక్షరం స్వస్తిక్ ఆకారాన్ని పోలి ఉంటుంది. గుజరాత్ ప్రజలు స్వస్తిక్ బ్రహ్మకూతురని కథను చెప్పుతారు. బ్రహ్మయే స్వస్తిక్ శుభసమయాల్లో పూజింపబడుతావనే ఆశీర్వాదమిచ్చాడని వారి నమ్మకం.

క్రైస్తవులకు శిలువ గుర్తు, శుభ చిహ్నమైనట్లుగా, జైనులకు స్వస్తిక్ అదృష్ట చిహ్నం. దేవాలయాల్లోనేగాక ఆశీర్వాద సమయాల్లో పవిత్ర ప్రాంతాల్లో కూడ స్వస్తిక్ గుర్తును చిత్రిస్తారు. మతానికి సంబంధించిన ప్రతి కార్యంలోనూ స్వస్తిక్ గుర్తును వేస్తారు. బియ్యం, పిండి, చక్కెర, సన్నటి ఉప్పు - వీటిలో ఏ ఒక్కదాన్నైనా వలయాకారంలో పరచి దానిలో స్వస్తిక్‌ను చిత్రిస్తారు. స్వస్తిక్‌పైన మూడు చుక్కలు, అర్ధ చంద్రాకారం బిందువును లిఖిస్తారు. ఈ చిత్రాన్ని ఆధారంగా చేసుకొని సృష్టి క్రమాన్ని, మానవుని జీవిత లక్ష్యాన్ని వివరిస్తారు. స్వస్తిక్ పైన ఉన్న మూడు చుక్కలు జైనమతంలోని త్రిరత్నాలు అవిసమ్యగ్దర్శనః, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చరిత్రం అని వారి నమ్మకం. జైనమతంలోని స్వస్తిక్ దానిపైన మూడు చుక్కలనుపోలిన ముగ్గు తెలుగు వాకిళ్ళలో కనపడుతుంది. తెలుగువారిలో

కుడివైపునకు తిరిగిన స్వస్తిక్ శుభప్రదం. హైద్రాబాదులో ఒక వర్తకుడు ఇంటి తలుపులపై పేయింటర్ ఎడమవైపునకు తిరిగిన స్వస్తిక్‌ను వేయడంతో నష్టం వాటిల్లిందని వెంటనే స్వస్తిక్ రూపాన్ని మార్చినానని తెలిపాడు.



సంక్రాంతి పంట వెయ్యిముగ్గు

దక్షిణదేశంలో జైనమతం ఉత్తర హిందూదేశంనుండి వ్యాపించింది. జైన దేవాలయాలు అనేకం తెలుగు దేశంలో ఉన్నాయి. జైనమత ప్రభావంతోనే స్వస్తిక్ రూపం ముగ్గుల్లో ప్రవేశించిందని ఊహించవచ్చు.

మనదేశంలో స్వస్తిక్ శుభ చిహ్నంగా అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని వర్గాల్లోనూ, అన్ని కాలాల్లోనూ అన్ని కళల్లోనూ, గుర్తింపబడింది. దీనికి నిదర్శనం మృచ్ఛకటిక నాటకంలో దొంగ కన్నం స్వస్తిక్ గుర్తులో వేయవలెనా అని ఆలోచిస్తాడు.

స్వస్తిక్ సూర్యుని భ్రమణానికి చిహ్నమే కాక, నాలుగు దిక్కులకు సూచకం. నాలుగు వర్ణాలకూ, ధర్మార్థ కామ మోక్ష మార్గాలకు ప్రతీకలు. సృష్టికి పూర్వకాలం,పశుపక్ష్యాదులు సృష్టింపబడిన కాలం, మానవుల లోకం, దివ్యలోకం - వీటిని స్వస్తిక్‌లోని నాలుగు గీతలు సూచిస్తుంది. స్వస్తిక్ రూపానికి మూలమైన రెండు గీతలు + స్త్రీ పురుషుల కలయికకకూ, భౌతిక పదార్థం ఆత్మలకూ, మానవాత్మ, పరమాత్మలకూ సూచికలు. కుడి, ఎడమ వైపులకు తిరిగిన స్వస్తిక్‌లు భార్యాభర్తలవుతాయనే నమ్మకం జానపదుల్లో ఉంది.

ఒక జానపద స్త్రీ "వెనుకట ఎవరో వినాయకుణ్ని గీయబోయి, గీయలేక స్వస్తిక్‌ను గీచింది" అని వివరించింది. నేపాల్‌లో మూషిక వాహనుడైన సూర్యగణపతి విగ్రహం ఉంది. మూషిక చీకటికి, గణపతి సూర్యునికి సంకేతమైతే, స్వస్తిక్ కూడ గణపతికి చిహ్నం అవుతుంది.

సంక్రాంతి పండుగ మూడు రోజులూ తెలంగాణాలో గీతం ముగ్గుల్లో కుండలను, కలశాలను తీర్చి దిద్దుతారు. ఆంధ్రలో భోగినాడు, భోగికుండల ముగ్గు వేస్తారు. తమిళులు కూడ ముగ్గుల్లో, అనేక నమూనాలతో కలశాలను చిత్రిస్తారు ముగ్గుల్లోనే గాక, హైందవ, బౌద్ధ, చిత్ర శిల్పకళల్లో కలశం అధిక ప్రాముఖ్యాన్ని పొందింది. మొట్ట మొదట కుండ నీటి కొరకూ, ధాన్యం నిలువకొరకూ, వంటవండడానికీ ఉపయోగపడింది. ఉపయోగం కొరకు కనిపెట్టబడిన కుండ ఆరాధనా చిహ్నంగా అలంకారసాధనంగా ముగ్గుల్లో చిత్రింపబడుతుంది. దేవి ప్రసాద్ ఛటోపాధ్యాయ, కోసంబి-కుంభం, కలశం సఫలతకూ, గర్భానికీ మాతృదేవతకూ ప్రతీకగా పేర్కొన్నారు.

కథాసరిత్సాగరంలో కుంభం ఉదరంతో పోల్చబడింది. నవరాత్రుల సమయాల్లో విత్తనపు గింజలు గల ఘటం స్థాపించబడుతుంది. దానికే బలులనిస్తారు. ఉత్తర ప్రదేశ్‌లోని స్త్రీలు శ్రావణమాసంలో కుండలో మట్టిని పోసి గోధుమలను చల్లుతారు. పొడవైన మొలకలు వచ్చిన తర్వాత వాటిని కుండలో నుండి తీసి ముత్తైదువలకిచ్చివారికి నమస్కారం చేస్తారు. ఈ ఆచారం సంతానభాగ్యాన్ని, సౌభాగ్యాన్ని కలిగిస్తుందని వారి నమ్మకం. నేటికీ పల్లెల్లో విత్తనాలను కొలవడానికి "విత్తనాలకుండ" ప్రత్యేకంగా ఉంటుంది. ఈ ఆచారం వల్ల వ్యవసాయ ఆదిమదశలో స్త్రీలు కుండలో విత్తనాలను చల్లి మొలకలు వచ్చిన తర్వాత భూమిలో నాటేవారని అవగతం అవుతుంది. అందుకే కుండ సఫలతకు సంకేతమైంది. సఫలతా దేవతలైన గ్రామ దేవతలకు ప్రతీక అయ్యింది.

మన గ్రామల్లో ఎల్లమ్మ,ఈరనాగమ్మలు కుండ రూపంలోనే పూజలనందుకుంటారు. తమిళ కర్ణాటక దేశాల్లో కరగానికే బలులను ఇస్తారు. గ్రామ దేవతలకు నైవేద్యమును కుండలోనే తీసుకొని పోతారు. గ్రామ దేవతల పండుగలో అమ్మవారిని ఘటరూపంలోనే ఊరేగిస్తారు.

అగ్రవర్ణ స్త్రీలు వరలక్ష్మి వ్రత సమయంలో ధాన్యంతో ఉన్న కలశంపై దేవి ప్రతిమను ప్రతిష్ఠిస్తారు. కేదారగౌరీ వ్రత సందర్భంలో కూడ కలశాన్ని ధాన్యంతో నింపి దేవి ప్రతికను పెట్టి పూజిస్తారు. కేదారం అంటే వరిమడి అనే అర్థం ఉంది. వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచే లక్ష్మీదేవి కలశ రూపంలో ఉంటుందనే నమ్మకం వ్రత ప్రారంభకులకు ఉండి ఉండవచ్చు.

గృహ్య సూత్రాలలో ఉదరకుంభం ప్రస్తావన ఉంది. వధూవరులు ఉదక కలశంతో హోమం చుట్టూర తిరుగుతారు. ప్రయాణానికి ముందు పూర్ణ కలశం ఎదురుగా రావడం, లేదా గానే నీటి కలశాన్ని చూడడం శుభం అని తెలుగు వారి నమ్మకం. ప్రాచీన కాలంలో మనిషికి పుట్టినప్పుడు, పెళ్ళిలోనూ, గృహ ప్రవేశ సమయంలోనూ, మరణ సమయంలో కుండ ఆచారాల్లో ప్రధాన పాత్రను వహించింది.

వేదాంతులు శరీరాన్ని ఘటంతో పోల్చారు. తాంత్రికులు పూర్ణ ఘటానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చారు. ఈ విధంగా విష్ణుకులాల్లోనూ, అగ్రవర్ణాలలోనూ, జానపదుల్లోనూ, తాంత్రికుల్లోనూ, వేదాంతుల్లోనూ కుండకు కలిగిన ప్రాధాన్యం వల్లనే అది ముగ్గుల్లో చోటు చేసుకొంది. రాజస్థాన్ లోకూడ క్రొత్త ధాన్యానికి సూచనగా సంక్రాంత్-కా-కుండ ముగ్గులను వేస్తారు.

ముగ్గుల్లో పాములు అనేక రూపాలతో, మెలికలతో చిత్రింపబడి ఉంటాయి. నాగుల చవితికి, సంక్రాంతికి ఈ పాముల ముగ్గును తప్పకుండ వేస్తారు. ఉత్తర ప్రదేశ్ లో కంటే దక్షిణ దేశంలో పాముల చిత్రాలు ముగ్గుల్లో కనపడతాయి. శివుని ఆభరణం, విష్ణువుని తల్పం, సంతాన సౌభాగ్య ప్రదాత కాబట్టి పాముల ముగ్గులను వేస్తున్నామని జానపద స్త్రీలు వివరించారు.

ప్రాచీన కాలంనుండి పాములు భారతీయులకు పవిత్రమైనవి. సఫలతాశక్తికి సంకేతాలు. తెలుగు దేశంలో ఎల్లమ్మ, బెంగాల్ దేశంలోని మానసాదేవి సర్పరూపాలతో ఆరాధింపబడుతున్నారు. పౌరాణిక దేవతల్లోని శివునికి, గ్రామ దేవతల్లోని ఎల్లమ్మకు నాగులు ఆభరణాలు. గ్రీకు పురాణ గాథల్లోని "డెమిటర్" కు కూడ తలలో పాములు ఆభరణాలుగా ఉంటాయి.

సర్పారాధన హరప్పా నాగరికతా కాలంనాటికే వ్యాపించి ఉండేదని నాటి అవశేషాల ద్వార విదితమౌతుంది. పశుపతిని పోలిన వ్యక్తి ముందు మోకరిల్లిన వ్యక్తుల వెనుక సర్పరూపాలు చిత్రింపబడినాయి. నాటినుండి మన దేశంలో నాగ ప్రాధాన్యం, నాగపూజ ప్రచారంలో ఉంది. పాము కాటువల్ల మరణం సంభవించడం వల్ల, దాని విషగుణం వల్ల ప్రజలకు పాముపైన భయం ఏర్పడడానికి ఒక కారణం. అతి త్వరగా ప్రాకడం వల్ల, వాలుక చీల్చబడడం వల్ల క్షణంలో అదృశ్యం కావడం వల్ల, ఆయుః ప్రమాణాన్ని అధికంగా పొందడం వల్ల మానవునికి సర్పమంటే భయం, భక్తి ఏర్పడి ఆరాధనకు కారణాలు అయినాయి. మన దేశంలోనే గాక ఈజిప్టు, బాబిలోనియా, గ్రీకు, హిబ్రూదేశాల్లో కూడ సర్పారాధన కన్పిస్తుంది.

స్త్రీలకు పాములంటే ఉన్న భక్తి వారి ముగ్గుల్లో వ్యక్తమౌతుంది. సంక్రాంతి సమయంలో గుచ్ఛ బంధం ముగ్గు వేస్తారు. ఈ గుచ్ఛ బంధం ముగ్గులో సూర్యుని చిహ్నంగా వలయం దాని నిండా కిరణాలను సూచించే సన్నని, తిన్ననైన గీతలుంటాయి. వలయానికి ఇరువైపుల ముడుచుకొని పోయిన రెండుపాముల చిత్రాలుంటాయి. ఈ చిత్ర అందానికి ముగ్గులైన బంధకవిత్వ చిత్రకారులు గుచ్ఛబంధంతో కవిత్వాన్ని చిత్రించారు. జానపద స్త్రీలు రోగాలను తొలగించే సూర్యునికి భీతిల్లి మృత్యువుకు ప్రతీకలైన పాములు ముడుచుకొని పోతాయని వివరించారు. [82]

జానపదుల సర్పారాధనలో పరస్పర విరుద్ధ భావాలు వ్యక్తమౌతాయి. మృత్యువుకు చిహ్నంగా భావించబడెడి సర్పం సఫలతకు సంకేతంగా ఆరాధింపబడుతుంది. పాములు భూమి రంధ్రాల్లో, పుట్టల్లో ఉండడం వల్ల తొలకరి చినుకులకు వెలుపలకు రావడం వల్ల - అవి నీటిని ప్రసాదించి, పంటలను పండిస్తాయనీ, అవి పృథ్వీశక్తులనీ పల్లీయుల అభిప్రాయం. పురాణాల్లో కూడ ఇదే అభిప్రాయం గోచరిస్తుంది. అనంత శేషనాగుడు, బలరామావతారానికి పూర్వం పంటలకు, వ్యవసాయానికి దేవతగా ఉండెడివాడని ఒక కథ ఉంది. పురాణాల్లో నాగులు పాతాళ లోకవాసులు. సర్పాలకు మాతృమూర్తి అయిన కద్రువ భూమికి ప్రతి రూపంగా పరిగణింపబడింది. [83]

పంటలకు దోహదం చేసే పృథ్వీశక్తిగా భావింపబడుతున్న సర్పం సంతానాన్ని కూడ ప్రసాదిస్తుందని స్త్రీల ప్రగాఢ విశ్వాసం. తెలుగు స్త్రీల నమ్మకం ప్రాచీన ఈజిప్టు పురాణాల్లోనూ, గ్రీకు దేశంలోనూ కనపడుతుంది. ఆ దేశవాసులుకూడ సర్పాన్ని సఫలతకు ప్రతీకగా, పృథ్వీ సంతానంగా భావిస్తారు.

నాగుల చవితినాడు స్త్రీలు ఇంటిముంగిట సర్పాలను చిత్రించి పుట్టల్లో పాలుపోసి ప్రదక్షిణలు, పూజలు చేస్తారు. నాగులు, నాగపూజ, స్త్రీలకు పవిత్రమైనందువల్లనే, వాటి ఆకారాలను ముగ్గుల్లో చిత్రిస్తారు. నాగపంచమినాడు నాగకోలం, నాగ మండలం తమిళ, కర్ణాటక, కేరళ దేశాల్లో ఇంటి ఆవరణల్లో, దేవాలయాల్లో, గ్రామ దేవతల గుడుల ముందు చిత్రిస్తారు.

జానపదులు సర్పాన్ని సంతాన సౌభాగ్య ప్రదాయితగా పూజిస్తే యోగులు జ్ఞాన స్వరూపిణి, పరాశక్తి యొక్క అంశమైన కుండలినీశక్తి సర్పాకారంలో ఉంటుందని విశ్వసిస్తారు. మానవుని నాభి క్రింద కుండలినీ శక్తిని నిద్రిస్తున్న సర్పంతో యోగసాధకులు పోల్చుతారు. యోగసాధనలో కుండలిని మేలుకొలుపగా, అది సుషుమ్నా మార్గంలో షట్చక్రాలను దాటి, సహస్రాకార చక్రాన్ని చేరునప్పటికి, ఆత్మకు స్వేచ్ఛ చేకూరి పరమాత్మునిలో లీనమౌతుంది.[84] ముక్తికి మార్గాన్ని చూపే కుండలినీ శక్తిని సర్పాకృతిలో యోగులు భావించడం వల్ల హిందూ సంస్కృతిలోని సర్ప ప్రాధాన్యం స్పష్టమౌతుంది. ఇంతగా ప్రాధాన్యతను సంతరించుకున్న సర్పాలు ముగ్గుల్లో ప్రవేశించి తమ ప్రత్యేకతను నిరూపించుకుంటున్నాయి.

పండుగలననుసరించి జానపద పడతులు ముగ్గుల్లో విష్ణుపాదాలనూ, కృష్ణుని పాదాలనూ, గోవు పాదాలనూ, లక్ష్మీదేవి పాదాలనూ, పూజా మందిరంలో చిత్రిస్తారు. పాదాలు భగవానునికి ప్రతీకలు. భగవంతునికి మారుగా పాదాలను పూజించడం హిందూమతంలోని ప్రత్యేకత. పరమేశ్వరుని పాద చిహ్నాలైన పాదుకలను భక్తుల శిరస్సుపై పెట్టి ఆశీర్వదిస్తారు ఆలయాల్లోని అర్చకులు. కొండలపైన భగవంతుడు వెలసి ఉంటే, సోపాన పంక్తి ప్రారంభంలో ఈశ్వరుని పాదుకలను

అర్పిస్తుంటారు. రామాయణంలో అయోధ్యనగరాన్ని పదునాలుగేండ్లు రాముని పాదుకలే పరిపాలించినాయి.

పరమేశ్వర విగ్రహపాదాలకే గాక, పెద్దల పాదాలకు నమస్కరించడం భారతీయుల సంప్రదాయం. తమ గౌరవాన్ని పాదాలకు ప్రణామం చేసి ప్రకటించుకుంటారు.

రాజస్థాన్‌లో పిల్లవాడు పుట్టగానే గది తలుపులపై పాదాల గుర్తులను వేస్తారు. తెలుగు దేశంలో మాంత్రికులు చెప్పుక్రింద మట్టిని తీసి, ఆ పాదరక్షలు ధరించిన వాడిని చంపడానికి గానీ, వశీకరణకు గానీ, పిచ్చివాడిని చేయడానికి గానీ మంత్రిస్తారు.

అదిలాబాదు ప్రాంతంలో వినాయక చవితినాడు రక్తవర్ణుడైన వినాయకునికి చిహ్నంగా ఎరుపు రంగు కలిగిన జాజాతో , తెలుపుతో రెండు వలయాలను చిత్రిస్తారు. గణేశుని తలయేగాక దేహమంతయు గజాకారమే అనే అంశాన్ని తెలిపే కథను శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు తెలిపినారు. "సుప్రభేదాగముము"అను తంత్ర గ్రంధమందిట్లున్నది. తెలివిగల కొడుకు (వినాయకుడు) తన తండ్రిని (శివుని) తన వికృత రూపానికి కారణమేమని ప్రశ్నించగా పరమేశ్వరుడు "నేను, నీతల్లి పార్వతి, హిమవంతమందు సంచరిస్తుండగా మేము ఏనుగులు రమించే దృశ్యాన్ని చూచినాము. అప్పుడే మాకును ఏనుగుల రూపంలో రమించవలెనని కోరిక కలిగింది. తత్ఫలితంగా నీవు జన్మించావు" అని శివుడు వినాయకునికి వివరించాడు. ఈ కథ వల్ల గణేశుని రూపం గజరూపమని వ్యక్తమౌతుంది. అందుకే అదిలాబాదులో గజపాదాలను వినాయకునికి మారుగా చిత్రిస్తారు.

బెంగాల్‌లోని అల్పనల్లో పాదాలను ప్రతి శుక్రవారంనాడూ, లక్ష్మీపూజ సందర్భంలోనూ వేస్తారు. ఆ పాదాల చిత్రణవల్ల లక్ష్మీదేవి

గృహ ప్రవేశం చేస్తుందని విశ్వసిస్తారు. పూజామందిరంలో పాదగుర్తులను వేయడంవల్ల దేవతలు అక్కడ వెలసినారనే అర్థం ద్యోతకమౌతుంది. పాదగుర్తులు ఇంట్లోకి ప్రవేశిస్తున్నట్లు వేస్తారు. కాని వెళ్ళిపోతున్నట్లు మాత్రం వేయరు. ఇంట్లోకి ప్రవేశించిన లక్ష్మీదేవి తిరిగి వెళ్ళిపోకూడదనే కోరికతో పాదగుర్తులను వెళ్ళుతున్నట్లుగా చిత్రించరు.

దేవతలవే కాకుండా జంతువుల పాదగుర్తులు కూడ ముగ్గుల్లో చిత్రిస్తారు. పులి పంజా ముగ్గును వేస్తే దుష్టశక్తులు రావని నమ్ముతారు. ఈ నమ్మకం ఇతర ఆచారాల్లో కూడ కనబడుతుంది. చిన్న పిల్లలకు దృష్టి దోషం తగులకుండా ఉండడానికి పులిగోరు పతకాన్ని వేస్తారు. ఆఫ్రికాలో కూడ దుష్ట శక్తుల నుండి రక్షించుకోవడం కొరకు పులిగోరును ధరిస్తారు.

తులసి వ్రత సమయంలో తులసి చెట్టు ముగ్గును వేస్తారు. ప్రతిదినం తులసి ముందు అయిదు పద్మాల ముగ్గు వేసి అయిదు వత్తులు వెలిగించి భక్తితో ధ్యానిస్తారు. తులసిని లక్ష్మీదేవి అంశగా భావించి పద్మం ముగ్గును వేస్తారు.







తరంగాలు... పులిపంజా...

గుమ్మడిపండు (గృహప్రవేశానికి వేసేముగ్గు)- బ్రహ్మముడి

తులసి పూర్వ జన్మలో జలంధరుడనే రాక్షసుని భార్యగా ఉండేది. జలంధరునికి "నీ భార్య పాతివ్రత్య ప్రభావంతోనే నీవు ఎవ్వని చేతనూ పరాజితుడవు కావు" అని బ్రహ్మ వరమిస్తాడు. జలంధరుని దుర్మార్గాలను అరికట్టడానికీ, అతన్ని వధించడానికీ విష్ణువు జలంధరుని రూపంలో అతని భార్యను పొందుతాడు. యుద్ధంలో జలంధరుడు సంహరింపబడుతాడు. అతని భార్య జరిగిన మోసాన్ని తెలుసుకొని విష్ణువును రాయిగమ్మని శాపమిస్తుంది. విష్ణువు ఆమెను మోసం చేసినందుకు పశ్చాత్తాపం చెంది తులసి మొక్కగా మరుజన్మలో పూజలను పొందుమని వరమిస్తాడు. పద్మపురాణంలో జలంధరుని భార్యపేరు బృంద.

తులసి లక్ష్మి అంశమని విష్ణువుకూ, తులసికీ పెళ్ళి చేస్తుంటారు. ఔషధీ గుణం కలిగిన తులసి, వ్రతాల్లో పూజింపపడుతూ, పురాణాల్లో ప్రస్తుతింపపడుతూ, ప్రతిరోజూ పడతుల చేత ఆరాధనలను అందుకుంటూ ముగ్గుల్లో తన రూపాన్ని ప్రదర్శిస్తుంది.

స్త్రీల ముగ్గుల్లోని తరంగ రేఖ పెద్ద ముగ్గులకు నిండుదనాన్ని, అందాన్ని ఇచ్చే అంచుల ముగ్గుగా చిత్రింపబడుతుంది. నీరు సఫలతకు చిహ్నం, పంటలకు ప్రాణాధారం. ఇది ధాన్యాన్నిచ్చే ధరణికి సారాన్ని, స్త్రీలకు సంతానాన్ని ప్రసాదిస్తుందని జానపదుల విశ్వాసం. ఈ విశ్వాసం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ తెగల్లో కనపడుతుంది. ఆస్ట్రేలియాలోనూ, పంజాబులోనూ, హిమాలయ ప్రాంతాల్లోనూ, కోయ గోండ్ల తెగల్లోనూ సంతానాన్ని కాంక్షించే స్త్రీలు వర్షంలో, జల సంగమాల్లో స్నానాలు చేస్తారు. మన తెలుగు వారిలో కూడ స్త్రీ ప్రసవించిన తర్వాత, నాను కరణం వాడు నూతిలో చేదవేయడం ఆచారం. చేదిన నీటిని విప్పంతువులైన స్త్రీల వీపుల మీద క్రుమ్మరిస్తారు. స్త్రీ సఫలత నీటిలోనికి, నీటిలోని సారం స్త్రీకి

సంక్రమిస్తుందనే అభిప్రాయం ఈ ఆచారంలో ఇమిడి ఉంది. నీటిని ప్రతిబింబించే "తరంగరేఖ ముగ్గు" భూమిపైన వేయడం వల్ల వాటి సఫలతా శక్తులు పరస్పర ప్రభావితాలు అవుతాయని జానపదుల అభిప్రాయం కావచ్చు. అందానికి కూడ ఈ తరంగరేఖ నమూనాను గోడలపైన కూడ చిత్రిస్తుంటారు. చీరల అంచుల్లో ఈ రేఖను చిత్రిస్తారు. రాజస్థాన్‌లో వర్షాకాలంలో అలలను సూచించే 'లహరియ' ముగ్గులను వేస్తారు.

స్త్రీల ముగ్గుల్లో శంఖాలు వివిధ నమూనాల్లో కనపడుతుంటాయి. శంఖం నీటిలో లభిస్తుంది కాబట్టి జానపదులకు, ఆటవిక తెగలకు అది సఫలతా చిహ్నం. వైష్ణవులకు పవిత్రమైన చిహ్నం. క్షత్రియ వీరులకు యుద్ధ ప్రారంభాన్ని సూచించే జయనాదం. భిక్షుకులకు శంఖానాదం ఇల్లాలిని భిక్షనర్థించడానికి చేసే సూచన.

బెంగాల్ ప్రాంతంలో స్త్రీలు వివాహ సమయంలో శంఖాలను పూరిస్తారు. వారి అల్పనల్లో ఎక్కువగా శంఖ చిత్రాలు కనపడుతుంటాయి.

పురాణ కర్తలు, విష్ణువు మత్స్యావతారాన్ని దాల్చి సముద్రంలోని శంఖంలోని వేదాలను దేవలోకానికి తీసుకొని వచ్చాడని వివరిస్తారు. అందుకే శంఖం పవిత్రమైంది. హిందూ మతంలోనే కాక క్రైస్తవమతంలో కూడ శంఖం పవిత్రమైనదే. సెయింట్ జేమ్స్ సమాధి దగ్గర శంఖాలను అమ్ముతుంటారు. భక్తులు వాటిని కొని టోపీలలో ధరిస్తారు. గ్రీకు దేవత అఫ్రొడైట్ సముద్రంలోని శంఖంనుండి జన్మించినట్లుగా గ్రీకు పురాణగాథలు వివరిస్తున్నాయి.[66]

విష్ణువు అవతారమైన మత్స్యాన్ని కూడ మగువలు ముగ్గుల్లో చిత్రిస్తారు. మనువుకు ప్రళయం రాబోతుందని సూచించిన కాలజ్ఞాని

చేప. నదిలో విడిచిన పిండాలను పితృదేవతలకు అందించే పవిత్ర ప్రాణి. జానపదులకు జలచరమైన చేప సఫలతకు, శుభానికి ప్రతీక. బెంగాల్‌లో కేరళలో చేపముగ్గు శుభప్రదం. మద్రాసులోని గుడిగార తెగలో నూతన వధూవరులు చేపలను పట్టుకొని వదిలి వేస్తారు. ఈ ఆచారం చేప సఫలతకు చిహ్నం అని సూచిస్తుంది.

చిత్రకళలో, శిల్పకళలో మత్స్యాలు అందంగా దర్శనమిస్తుంటాయి. జైనమతానికిచెందిన చిత్రాల్లో సముద్రంలో, నీటిలో చేపలు తిరుగుతున్నట్లుగా ఉంటాయి. జానపదుల స్త్రీల చీరల అంచుల్లో, ఆభరణాల్లో కూడ చేపల చిత్రాలుంటాయి.

సమృద్ధికి ,చిహ్నమైన గుమ్మడికాయలు కూడ ముగ్గుల్లో చోటు చేసుకున్నాయి. గుమ్మడి తీగ అనేక కాయలతో అతి త్వరగా ప్రాకుకుంటూ పోతుంది. అది శని నివారణకు కూడ సూచకం అయ్యింది. అందుకే సంక్రాంతికి పితృదేవతలకు తర్పణాలు వదలిన తర్వాత గుమ్మడి పండును దానమిస్తారు. సంక్రాంతినాడు గుమ్మడి ముగ్గును తప్పకుండ వేస్తారు. గొబ్బిళ్ళపై గుమ్మడి పూలను అలంకరించి, రచ్చ గుమ్మడి పాటలను, గొబ్బిళ్ళ పాటలను పాడుతుంటారు.

పూర్వపు రోజుల్లో ధవళేశ్వరం ప్రాంత పరిసరాల్లో ప్రజలు లంక గుమ్మడికాయలను సేకరించి, వాటిలోని గుజ్జును తొలగించి, డోలులో అనుములను పోసి భద్రపరచేవారు. అవి ఏడాది వరకు నిల్వ ఉండేవి. గుమ్మళ్ళలోని అనుములే వారి జీవనాధారం. వీలైనంత ఎక్కువ మందికి గుమ్మడి, భోజన సదుపాయాన్ని కల్పిస్తుంది. ఈనాటికీ పెళ్ళిళ్ళు మొదలైన శుభకార్యాల్లో కేదారి గౌరీదేవి వ్రతాల్లో ఎక్కువ మందికి భోజనం పెట్టవలసి వచ్చినప్పుడు గుమ్మడి కాయలను వాడుతారు.









సంక్రాంతిముగ్గు,
చెరకుగడలు, సూర్యుడు, తీగలు,
కలశం, సఫలతా సంకేతాలు

శంఖాల ముగ్గు
గుమ్మడికాయల ముగ్గు
నూపాలు ఏనుగులు

గుమ్మడి గుండ్రంగా పెద్దగా ఉంటుంది కాబట్టి ఆరోగ్యమైన - ఎుగా ఉన్న పిల్లలను గుమ్మడి పండులా ఉన్నాడని అంటారు. గుమ్మడి పండువంటి పిల్లవాడు పుట్టాలని ఆశీర్వాదం ఇస్తుంటారు. జానపద కథల్లో గుమ్మడి నుండే పిల్లలు పుడుతుంటారు. ధన, కనక వాహనాలు కథానాయకునకు గానీ, కథానాయికకు గానీ గుమ్మడి నుండే లభిస్తాయి. సిండ్రెల్లా కథలో కూడ గుమ్మడినుండే రథం ఉద్భవించి సిండ్రెల్లాను రాకుమారుని కడకు తీసుకొని పోతుంది.

నూతన గృహ ప్రవేశం నాడు గుమ్మడి పండు ముగ్గును వేస్తారు. ఈ ముగ్గు వల్ల దుష్టశక్తులు పారిపోతాయని జానపదుల నమ్మకం.

అతి ప్రాచీన కాలంలో భూమిలోని సఫలతా శక్తి అధికం కావడం కొరకు గర్భిణీ స్త్రీలను బలిచ్చే ఆచారం నేడు గుమ్మడి కాయలను పగులగొట్టడంగా మారింది.

ముగ్గుల్లో గుమ్మడి కాయలను వేయడం సస్యాభివృద్ధిని కాంక్షించే స్త్రీ కోరికను చిత్ర రూపంలో సూచించడం జరిగింది.

ముగ్గుల్లో గరుత్మంతుని, చిలుక, నెమలి, బాతుల రూపాలను చిత్రిస్తుంటారు. విష్ణువు వాహనమైన గరుత్మంతుడు హిందువులకు పవిత్రమైన పక్షి. ప్రయాణానికి ముందు చిలుక కనపడితే శుభ సూచకం. "చిలుక పలుకుల" వల్ల చిలుక విజ్ఞానానికి ప్రతీక అయ్యింది. గరుత్మంతుణ్ణి , చిలుకలను వివాహ సమయంలో అవిరేణి కుండల పైన వేస్తారు. వీటని ఆడవారే చిత్రిస్తారు. జానపదుల దృష్టిలో ఈ పక్షులు కూడ సఫలతా సూచకాలే కావచ్చు. గండభేరుండ పక్షులు కూడ ముగ్గులో దర్శనమిస్తాయి. జానపదకథల్లో గండభేరుండ పక్షులు కథానాయకుని ప్రాణాలను కాపాడుతుంది. అతనికి సహాయ పడుతాయి. జటాయువు పక్షి సీత జాడను రామునికి తెలిపి రావణవధకు పరోక్ష కారణమైంది కాబట్టి కృతజ్ఞతాభావంతో జటాయువును చిత్రిస్తారు. తేళ్ళు కష్టాలకు ప్రతీకలు. తేళ్ళ ముగ్గును చూచి భగవంతుడు కరుణిస్తాడని స్త్రీల నమ్మకం. లేళ్ళు పరుగుకు ప్రతీకలు.

ఈవిధంగా ఇంతవరకు వివరించిన ముగ్గులన్నీ సూర్యునికీ, సఫలతకూ సస్యరముకూ సంకేతాలు. సఫలతాశక్తుల అనుకరణవల్ల స్పర్శవల్ల, ఆరాధనవల్ల భూమిలోని సారం అధికం అవుతుందని స్త్రీల అభిప్రాయం. అందుకే ధన, ధాన్య, సంతానాభివృద్ధికి సఫలతా సూచకాలను ముగ్గులనే చిత్రలిపిలో లిఖిస్తారు. ఈ ముగ్గులు స్త్రీల చిత్రకళా నైపుణ్యానికే కాక, వారి సమయోచిత ప్రజ్ఞా ప్రదర్శనకు నిదర్శనాలు.

పైన పేర్కొన్న ముగ్గులనే కాక, మత పరమైన, అలంకార ప్రాయమైన వస్తువులను, వివిధ జంతువుల, పక్షుల రూపాలను

చిత్రిస్తుంటారు. వినాయకునికీ, శివికీ ప్రతిరూపాలైన ఏనుగు చిత్రాలను ముగ్గుల్లో వేస్తుంటారు. కావ్యాల్లోని నాయికలు గజగమనలు.



కుమారస్వామి వాహనాలు నెమళ్ళు పరుగుకు ప్రతిరూపాలు లేళ్ళు, విజ్ఞానానికి ప్రతిరూపాలు చిలుకలు

దేవాలయంలో ఏనుగుకు అతి ముఖ్యమైన స్థానం ఉంది. దేవుళ్ళ ఊరేగింపులో ఏనుగు ముందుంటుంది. ఏనుగు అంబారీపై అభిషేక జలాలను తీసుకొని పోతారు. లేవగానే ఏనుగును చూస్తే అదృష్టం. ప్రయాణికుడికి ఏనుగు దర్శనం శుభకరం అందుకే శుభకరమైన ఏనుగు చిత్రం ముగ్గులోకి ప్రవేశించింది.

మహాభారతంలోని అభిమన్యుని పద్మవ్యూహ చిత్రాన్ని ముగ్గుల్లో వేస్తారు. ఈ ముగ్గు చిత్రణవల్ల సుఖప్రసవం జరుగుతుందని స్త్రీల నమ్మకం. బ్రహ్మముడి ముగ్గుకు దయ్యాలు, భూతాలు పారిపోతాయని నమ్ముతారు.

విష్ణు చక్రం, శంఖం, గరుత్మంతుడు, లక్ష్మీదేవి పాదాలు, కృష్ణుని పాదాలు వైష్ణవ మతానికి సూచనలైతే, మారేడు దళం, పాములు, నంది, శివలింగం చిత్రాలు శైవమత సంబంధాలు. జైన మతానికి సూచికలు స్వస్తిక్ లు. పద్మాలు, కలశం, త్రికోణాలు శక్తి చిహ్నాలు. రథం, చక్రం, చీకటిని పారద్రోలే దీపాలు సూర్యారాధనకు ప్రతి రూపాలై ముగ్గుల్లో ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి. అనేక రకాల ప్రమిదలు, దీపపు

బొమ్మలు ముగ్గుల్లో వెలుగుతుంటాయి.

క్రిస్మస్ చెట్టు, Happy Christamas, Wish you happy New Year, క్రైస్తవ మత ప్రభావంతో ముగ్గుల్లో చేరిన చిత్రాలు.





స్టూలు, కుర్చీ టేబుల్ గంధపుగిన్నె కూజా

మత ప్రభావమే గాక ఆర్థిక వ్యవస్థలోని అంతస్థుల ప్రభావం కూడ ముగ్గుల్లో ప్రసరిస్తుంది. ధనవంతుల ఇళ్ళలోని కుర్చీ, సోఫాలు, ఉయ్యాలలు, గంధం గిన్నె, ముత్యాల పెట్టె, పువ్వుల తొట్టి, పన్నీరు చెంబు, విసనకర్ర, రత్న కంబళం, రజిత రథం మొదలైన ఆడంబరమైన అలంకార ప్రాయమైన వస్తువులను ప్రదర్శించే ముగ్గులు, తెలుగు వారి ఇంటి ముంగిళ్ళకు అందమైన ఆభరణాలు.

ఆధునిక యుగానికి అనుగుణంగా, స్వతంత్ర భారతావనికి సూచనగా వివిధ రకాల సంగీత వాయిద్యాలు, స్కూటర్లు, కార్లు, దేశీయ పతాకం, అశోకచక్రం, శాంతి కపోతాలు ముగ్గుల్లో విరాజిల్లుతున్నాయి.

ఆచార వ్యవహారాలనూ, నమ్మకాలనూ, కోరికలనూ,సామాజిక వ్యవస్థను పరిణామాలను ముగ్గులనే చిత్రలిపిలో లిఖించే స్త్రీలే మన సంస్కృతి రక్షకులు.

రాజస్థాన్ మహిళలు మండనల చిత్రీకరణను లిఖనా అంటారు. మండనలను లిఖించినావా అని ప్రశ్నించుకుంటారు. స్త్రీ జన వ్యవహారంలోని ఈ పదం ముగ్గులు ఒకప్పటి స్త్రీల చిత్రలిపులు అనెడి అంశాన్ని నిరూపిస్తుంది.

సత్యం, శివం, సుందరం - ఈ మూడింటి సమ్మేళనమే చిత్రలిపి ఆదర్శం. ఆరోగ్యం, ఆచారం, సౌందర్యం - ఈ మూడు చిత్రలిపి రచనా ఉద్దేశ్యాలు.

48472

తుది పలుకు

ముగ్గులు స్త్రీల మనస్తత్వానికి, జీవిత విధానానికి ప్రతిబింబాలే కాకుండా వారి చిత్రకళా పటిమకు ప్రతీకలు. ఇవి సౌందర్య ప్రధానాలేగాక నిర్మాణాత్మక ప్రయోజనకారణాలని నిరూపించవచ్చు. నగర, స్థూప, దేవాలయ, భవన నగర నిర్మాణ నమూనాలను కూడ క్రమ సంఖ్యలో చుక్కలనుపెట్టుతూ గీయవచ్చు. స్త్రీల చిత్రలిపి వైశిష్ట్యాన్ని బెంగాలీ చిత్రకారులు గుర్తించారు. శాంతినికేతనంలో స్త్రీలు ప్రతినిత్యం చిత్రించే అల్పనలను అభ్యసించడానికి శిక్షణను ఇస్తారు. అవనీంద్ర టాగూర్ వంటి ప్రసిద్ధ చిత్రకారులు రేఖాగణిత ప్రకారంగా అల్పన రేఖల విన్యాసాల్లో నూతనత్వాన్ని తీసుకొని వచ్చారు. ఈ చిత్రాకారులు స్త్రీల ప్రాచీన సంప్రదాయపు అల్పనల్లోని చిత్ర సౌందర్యానికి శిల్ప సౌందర్యాన్ని, ఆధునిక చిత్రకళా సౌందర్యాన్ని సమన్వయింపజేసి వన్నెలను చేకూర్చుతున్నారు. మన తెలుగు దేశంలోని చిత్రకారులు కూడ ఈ కృషిని సల్పితే తెలుగు స్త్రీల చిత్రలిపి సౌందర్యవిన్యాసం దేశమంతటా గుర్తింపు పొందుతుంది.

స్త్రీల చిత్రలిపి పైన రచించిన ఈ వ్యాసం, జానపద విజ్ఞాన పరిశోధనా సింధువులో ఒక బిందువు మాత్రమే. తెలుగు దేశంలోని ప్రతిపల్లె పడతి ఒక జానపద విజ్ఞాన వజ్రం. ఒక్కొక్కరి విజ్ఞాన వజ్రపు కాంతులు ఒక్కొక్క కోణంలో ప్రసరిస్తుంటాయి. వివిధ కోణాల్లో ప్రసరిస్తున్న జానపద విజ్ఞాన కాంతులనన్నింటినీ సమకూర్చి, విశ్లేషించడం జానపద విజ్ఞాన పరిశోధకుల కర్తవ్యం. ఈ వ్యాసంలో నేను సేకరించిన విషయాలు అల్ప సంఖ్యలు అణుమాత్రాలు.

సంప్రదాయ పరంగా ప్రాపిస్తున్న తెలుగు సంస్కృతిని, కళా వైభవాన్ని స్త్రీల చిత్రలిపిని ఆధారంగా చేసుకొని పరిశోధింపవచ్చు. స్త్రీల చిత్రలిపిలోని అంతరార్థాన్నీ, వివిధ విజ్ఞాన అంశాలనూ పరిశోధింపబోయే పరిశోధకులకు ఈ వ్యాసం ఒక సూచనను సూచిస్తుందని భావిస్తున్నాను.

వివరణలు

1,2. ఆంధ్రపత్రిక - 14-1-53 శ్రీ గొల్లపూడి వెంకటేశ్వరరావు.

3. The Wall paitings of Ajantha - G.N Yazdani

4,5. The process used in the painting - simple though the process used at Ajanta was, it durability has been marvellous A plaster chiefly composed of clay cow dung finely chopped straw or paddy mut formed the first layer which was applied to the rough-lawn stone walls to render them smooth- The classic art of Ajantha Samerendranath.

6. ఆంధ్రభూమి - 19-1-84, వసుధ.

7. జానపద భిక్షుకగాయకులు డా॥ యాదగిరిశర్మ - సిద్ధాంతవ్యాసం. (అముద్రితం)

8. లక్ష్మమ్మ. 65 సంవత్సరాలు. కాపు. పశ్చిమగోదావరి.

9. Myth and reality. D.D Kasambi

10. ఒవీలు - ఒక పరిశీలన - చింతల యాదయ్య. అముద్రితం.

11. డా॥ ఆనంద్. తిరుపతి విశ్వవిద్యాలయం. ఇచ్చిన సమాచారం.

12. 'తరంగం' కన్నడ పత్రిక.

13. శక్తిపూజ. డా॥ యం.అండమ్మ సిద్ధాంత వ్యాసం (అముద్రితం)

14. జానపద భిక్షుకగాయకులు. డా॥ యాదగిరిశర్మ-సిద్ధాంత వ్యాసం

15. Castes and tribes of Southern India - Thurston- II Volume.

16. The Language of Symbols-Archana P 87

17. The Primtive art-Ajit Mukharjee - p-12-14

18 Art of Rajastan - Jogendra Saksena - P. 49.

19. ఈ చిత్రాలు - The First cities - Dara Jane Hamblin Indus Script Deciphered- M U.N K Rao నుండి తీసుకోబడినాయి.

20. Art of Rajasthan - Jogendra Saksena.

21 Art of Rajasthan - Jogendra Saksena

22. తరంగ - కన్నడ పత్రిక - 21.10.1990.

23. కవిత.40 సంవత్సరాలు, పిచ్చుకకుంట్లు, వాగిరెడ్డిపల్లి, నల్గొండ -1976

24. పావిత్రమ్మ. 50 సంవత్సరాలు, అనంతపురం. 1988

25. అలివేలమ్మ 50 సంవత్సరాలు, బ్రాహ్మణులు, బందర్ -1988

26. లక్ష్మీనరసమ్మ 60 సంవత్సరాలు బ్రాహ్మణులు, తూ.గోదావరి -1988

27. విమలమ్మ 60 సంవత్సరాలు బ్రాహ్మణులు, నెల్లూరు - 1988

28. మంగళాంబ- 35 సంవత్సరాలు, బ్రాహ్మణులు, నెల్లూరు 1988

29. అలివేలమ్మ 60 సంవత్సరాలు బ్రాహ్మణులు - బంధరు 1988

30. హరిందేవి - 55 సంవత్సరాలు బ్రాహ్మణులు - గుంటూరు

31. విజయ - 30 సంవత్సరాలు, కాపు. ఆదిలాబాదు.

32,33 హిందువుల పండుగలు - సురవరం ప్రతాపరెడ్డి

34 శకుంతల 30 సంవత్సరాలు, కాపుకులం, బందరు 1988

35. శ్రీలక్ష్మి 38 సంవత్సరాలు బ్రాహ్మణులు . బందరు -1988.

36 Census of India - 1961 Vol II Part V-B

37 The Tribal Art of Middle India -Verner Elwin -1951

38,39 తరంగ కన్నడ పత్రిక -1990

40 లక్ష్మి 60 సంవత్సరాలు, బ్రాహ్మణులు, తిరుచ్చి, తమిళరాష్ట్రం -1988.

41. గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఆంధ్రపత్రిక

42. Alpana- Ministry of Information and Broad Casting Govt. of India

43 Folklore of Bengal- Asutosh Bhatta Charya.

44 శకుంతల పార్‌గాంకర్, మహారాష్ట్ర-పార్‌గాలే.

45 The Glory of Indian Handicrafts - Kamala Devi Chattopadhyay.

46 Folklore of Madhya Pradesh-shyam Parmar

47 Art of Rajasthan- Jogendra saksena

48 Folklore of Himachal Pradesh-Dr Gautham Sharma Vyathi

49 Art of Rajasthan-Jogendra Sakena

50 సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము - సంపుటి 8-1971.

51. ఈ నిర్మాణ నమూనా డా॥ రాధాకృష్ణశర్మగారి సిద్ధాంతవ్యాసం Architecture Iconography and sculpture of chalukya and kakatiya Temples in Telangana నుండి గ్రహింపబడింది.

52. లక్ష్మి నరసమ్మ, 60 సంవత్సరాలు , వైష్ణవులు, నెల్లూరు.

53. అలివేలమ్మ 50 సంవత్సరాలు బ్రాహ్మణులు. బందరు.

54. అనంతలక్ష్మి 45 సంవత్సరాలు, కాపుకులం, వరంగల్లు.

55. Language of Symbols - Archana.

56. హిందువుల పండుగలు - సురవరం ప్రతాపరెడ్డి.
57. శ్రీ కాళహస్తి మహత్మ్యము - 3-33.
58. హంసవింశతి - అయ్యలరాజు నారాయణామాత్యుడు.
59 తెలుగు సాహిత్యంలో క్రీడా వినోదాలు - డా॥ పి సుబ్రహ్మణ్యం.
60,61 మనోహరమ్మ, 58 సంవత్సరాలు, రెడ్డికులం, నల్గొండ.
62. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి P 142
63. Bindu is the ultimate point of power beyond which a thing or energy cannot be contracted or condensed By Virtue of it nature, it is the repository of all manifestations in its complexity and the basis of all Vibrations movements and forms The Tantric way - Ajit mukerjee - P-54
64. Sri Lalitha Sahasranama Dr Ch Suryanarayana Murthy
65 Language of Symbols - Archana
66,67 Encyc opedia of Religion and Ethics- vol-III
68 Lokayata - Debi prasad Chattopadhyaya - 1978 P 304
69 The Thantric way - Art, Science, Ritual - Ajit Mukarjee
70. The Tribal Art of Middle India. V Ewin
71 మిన్నేరు - వేదుమూరి గంగాధరం - P-228
72. మార్కండేయ పురాణము - సావర్ణి మన్వంతరము - నారాయణస్మృతి. 11వ అధ్యాయం 48వ శ్లోకం.
73 Lokayata - Debi Prasad Chitopadhayaya.
74. Encyclopedia of religion and Ethics. Jame Hastings
75 నరసింహాచారి. 50 సంవత్సరాలు కంసాలి వరంగల్లు 1975.
76. జానపద పారమార్థిక గేయ సాహిత్యం. ఎ బాలకృష్ణారెడ్డి P-54
77 The Jain cosmology - collette caillat, Ravi Kumar
78. లక్ష్మి నరసమ్మ. 50 సంవత్సరములు, బ్రాహ్మణులు, నెల్లూరు.
79. హిందువుల పండుగలు - సురవరం ప్రతాపరెడ్డి P-107
80 Swastika - Thomas Wilson
81 The Folklore Notes - Gujarath -Jalkson Vol I
82 వెంకటలక్ష్మి నరసమ్మ 60 సంవత్సరాలు యాదవ రాజమండ్రి
83 Histor cal studies in the Cult of Goddess Manasa Pradyot Kumar.
84. భారతి . ఆగస్టు -1950 అక్కులయ్య దీక్షితులు. నాగారాధన ఎట్లు పుట్టింది
85. News time - T S Satyam 25-12--88
86 లక్ష్మి 58 సంవత్సరాలు కాపు, మెదక్, 1983.

• • •

BIBILIOGRAPHY

1 Alpana - Publications Division Ministry of Information and Broadcasting, Government of India, Delhi Publications - 1967

2. Architecture, iconogrphy and Sculpture of Calukya and Kakatiya Temples in Telangana. Dr N Radhakrishna Sharma (Ph D Theis).

3. Art of Rajasthan -Henna and floor decoration - Jogendra Saksena - Sundeep Prakashan Delhi Publishers - 1979

4 The Art of Tantra - philip Rawson

5. Census of India - 1961, Vol.II, Andhra Pradesh Part V - Ethnographic Notes.

6. Encyclopedia of Religion and Ethics - James Hastings T & T Clark, Newyork, Vol I III, V - 1967

7. The First cities - Dera Jane Hamblin and the Editors of Time life Books - 1973

8 Indus Script Deciphered - M V.N Krihna Rao Agamkala Prakashan - Delhi - 1973

9. Folklore Notes - Gujarat - Vol I - Jackson, I c s., British India Press - Bombay - 1914

10. Folklore of Assam - Jogesh Das - National Book Trust - India - New Delhi - 1972

11 Folklore of Bengal - Asutosh battacharya - National Book Trust - India - New Delhi - 1978

12. Folklore of Himachal Pradesh - Dr Gautam Sharma Vyathit - 1984

13 Folklore of Madhya Pradesh - Shyam Parmor - National Book Trusst, India - New Delhi - 1972

14 Folk ore of Rajastan - D R Ahuja - National Book Trust, India - New Delhi - 1980

15. Folklore of Tamilnadu - S.M L. Laxman Chetair - National Book Trust, India - New Delhi - 1974

16. Indian Primitive Art - Ajit Mukerjee - Oxford Book Stationery Company, Calcutta - 1959

17 The Jain Cosmology - Collette Caillot, Ravi Kunal, Ravi Kumar Publishers Basel, New Delhi

18. The Language of Symbols - Archana - Published by the crafts Council of India - 1982.

19. Lokayata - Debi Prasad Chattopadhayaya - Peoples Publishing House - New Delhi - 1978

20. Myths and Symbols in Indian Art and Civilization - Zimmer H., Newyork - 1962.

21 Myth and Reality - Kosambi - D D Popular Prakashan Bombay - 1962.

22. Sun Worship in Ancient India - V C Srivastva - Indological Publications - Allahabad - 1972

23. Swastika - Thomas Wilson - Oriental Publishers - 1973.

24 Sri Lalitha Sahasranama - Dr Ch. Suryanarayana Murthy - Ganesh Company - Madras

25 Tantra - Its Mystic and Scientific Basis - Laban - Prasad Singh- Concept Publishing Company - Delhi - 1976

26 The Tantric way Art - Science - Ritual - Ajit Mukherjee, Vikas Publishing House - Delhi - 1977

27 The Tribal Art of Middle India - Verrier Elwin - Oxford University Press -- 1951

28 The Wall Paintings of Ajantha - G. Yazdani O B E.

1. ఆంధ్ర మహాభారతం. ఆది పర్వం -నన్నయ ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి - 1970.

2. తాపీ ధర్మారావుగారి జీవితం -రచనలు - ఏటుకూరి ప్రసాదరావు 1989

3. తాళ్ళపాక వారి పలుకుబళ్ళు - సంపాదకురాలు - రామలక్ష్మి ఆరుద్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి - కళాభవన్

4. తెలుగు సాహిత్యంలో క్రీడా వినోదాలు డా॥ వడ్లా సుబ్రహ్మణ్యం - 1987

5. బవనీలు - ఒక పరిశీలన - చింతల యాదయ్య - పరిశోధనా వ్యాసం - 1991

6. శక్తి పూజ - డా॥ మాదిరెడ్డి అండమ్మ సిద్ధాంతవ్యాసం (అముద్రితం)

7. శుక సప్తతి - కదిరీపతి - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి.

8. హంస వింశతి - అయ్యలరాజా నారాయణామాత్యుడు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి - 1977.

9. హిందువుల పండుగలు - సురవరం ప్రతాపరెడ్డి - ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి - 1987.

10. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము - Vol. 5, 1971.

11. తెలుగులో చిత్ర కవిత్వం - ధర్మేశ్వర రావు, పరిశోధనా వ్యాసం (అముద్రితం)

12. తరంగ - కన్నడపత్రిక - 1990

వివిధ వార పత్రికలు మరియు దిన పత్రికలు ఈ వ్యాస రచనకు దోహదమైనాయి. ముగ్గుల పుస్తకాలు కూడ సహకరించాయి.

18472